fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 39 | విజయవాడ, శుక్రవారం 9 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

బంగ్లా మాజీ ప్రధాని జియాకు ఐదేళ్ల జైలు




ఢాకా : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియాకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఇక్కడి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఒక అనాధాశ్రమం పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దాదాపు 2.52 లక్షల డాలర్ల మేర నిధులను స్వాహా చేసినట్లు ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నేతగా వున్న జియా ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఆరోపణలన్నీ రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని ఆమె పలుమార్లు కొట్టిపారేశారు. జియాపై వచ్చిన ఆరోపణలను కోర్టు రుజువు చేసినప్పటికీ ఆమె సామాజిక, శారీరక పరిస్థితిని మిగతా 9లో



గ్రాండ్ సక్సెస్





నగరంలో వామపక్షాలు నిర్వహించిన ర్యాలీ

విజయవాడలో నిత్యం రద్దీగా వుండే అలంకార్ సెంటర్, బీసెంట్ రోడ్ బంద్‌తో బోసిపోయిన దృశ్యం

మోడీ సర్కారు నిర్లక్ష్యంపై ఆంధ్రుల సమర శంఖం

బంద్‌కు అపూర్వ స్పందన

బోసిపోయిన ప్రధాన నగరాలు

డిపోలకే పరిమితమైన బస్సులు

693 మంది అరెస్టు

మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆంధ్రప్రదేశ్ సమర శంఖం పూరించింది. వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు అపూర్వంగా స్పందించింది. వైసిపి, కాంగ్రెస్, జనసేన బంద్‌కు మద్దతిచ్చాయి. వివిధ ప్రజా, ఉద్యోగ, కార్మిక, పాత్రికేయ సంఘాలూ భాగస్వామ్యమయ్యాయి. ఇటీవల ఎన్నడూ లేని విధంగా ప్రజానీకం స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొంది. ప్రజలు ఎక్కడికక్కడ నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు, కర్నూలు వరకు ఎక్కడ చూసినా ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకో దృశ్యాలే కనిపించాయి. మండల కేంద్రాలు, మారుమూల గ్రామాల్లో కూడా మోడీ వ్యతిరేక నినాదాలు మారుమోగాయి. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు.' 'విభజన హామీలు అమలు చేయాలి' అన్న నినాదాలు అన్ని ప్రాంతాల్లోనూ వినిపించాయి. 'మోడీ పకోడి వద్దు. ఉపాధి, ఉద్యోగాలు కావాలి' అంటూ విద్యార్థులు, యువకులు కదం తొక్కడం రాష్ట్రమంతా కనిపించింది. తెల్లవారుజాము నుండే రాష్ట్రమంతా రవాణా వ్యవస్థ స్తంభించింది. బస్సు సర్వీసులు నిలిచిపోయాయి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. వర్తక, వాణిజ్య వర్గాలూ కలిసి రావడంతో అన్ని జిల్లాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఇదే స్థితి! అక్కడక్కడా అరెస్టులు జరిగినప్పటికీ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. సిపిఎం, సిపిఐతో పాటు ఇతర వామపక్షాల నేతలు, కార్యకర్తలు అన్ని జిల్లాల్లో పెద్ద సంఖ్యలో బంద్‌లో పాల్గొన్నారు. వైఎస్‌ఆర్‌సిపి. జనసేన, కాంగ్రెస్ పార్టీలు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాయి. బంద్‌ను వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ ప్రజా గ్రహ భయంతో ధర్నాలతో హడావిడి చేసింది.

ప్రజా విజయం

బంద్‌పై వామపక్షాలు

త్వరలో భవిష్యత్ కార్యాచరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై వామపక్షాలు, ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు నిర్వహించిన బంద్ విజయవంత మైందని వామపక్ష పార్టీల నాయకులు ప్రకటించారు. ప్రభుత్వాలపై ప్రజల్లో నిరసనకు బంద్ ప్రతిరూపమని, ఇది అపూర్వంగా విజయవంత మైందని వారు తెలిపారు. గురువారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెల్లి విల్సన్, రావుల వెంకయ్య, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు రామారావు, పోలారి, ఎంసిపిఐయు నాయకులు టి.శివయ్య తదితరులు మాట్లాడారు. ప్రభుత్వాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత బంద్ రూపంలో బయటపడిందని తెలిపారు. త్వరలో దీనిపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. పార్టీలు, ప్రజా, వర్తక, వాణిజ్య, కార్మిక సంఘాలన్నీ దీనిలో కలిసొచ్చాయని, ప్రజల ఆగ్రహం తీవ్రస్థాయిలో వ్యక్తమైందని తెలిపారు. పలుచోట్ల అరెస్టులు జరిగినా రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో విజయవంతమైందని, గతంలో ఎన్నడూ లేనంత స్పందన ప్రజల నుంచి వచ్చిందని పేర్కొన్నారు. మోడీ ప్రసంగంలోనూ విభజన చట్టంలో హామీలు అమలు చేస్తామో లేదో చెప్పకుండా కేవలం ప్రతిపక్ష కాంగ్రెస్‌పైనే విమర్శలు ఎక్కుపెట్టారన్నారు. రాష్ట్రానికి జాతీయస్థాయి విద్యాసంస్థలు 11 కేటాయించారని, వాటికి రూ.6600 కోట్లు అవసరం అవుతాయని మిగతా 2లో

రాహుల్ నాకూ బాసే

సోనియా గాంధీ



న్యూఢిల్లీ : రాహుల్ తనకు కూడా బాస్ అని, ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదని సోనియా గాంధీ గురువారం పేర్కొన్నారు. డిసెంబర్‌లో రాహుల్‌గాంధీ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సోనియా గాంధీ మొదటి సారిగా గురువారం ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి బిజెపికి వ్యతిరేకంగా వ్యూహాలు రచించడంలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న సోనియా గాంధీ మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో కలిసి పనిచేస్తానని, ఇతర పార్టీలు, సహచరులతో ఎన్నికల వ్యూహాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. బిజెపి ఓడిపోతుందని, ప్రజాస్వామ్యం, ఐక్యమత్యం, లౌకికత్వం, సహనం, ఆర్థికంగా అభివృద్ధి చెందే వైపుగా భారత్ పునరుద్ధరించబడుతుందని పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. దేశం లోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ప్రస్తుత పాలనతో విసుగు చెందుతున్నారని, దీనిని తమకు మద్దతుగా మార్చుకుంటున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ ఎన్నికలు, రాజస్తాన్ ఉప ఎన్నికల మార్పులు చూశామని, కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పునరుత్తేజంతో పనిచేస్తుందని పేర్కొ న్నారు. నాలుగు సంవత్సరాల ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వంలో పార్లమెంటు, న్యాయవ్యవస్థ, మీడియాపై దాడులకు పాల్పడిందని, పౌరులపై కూడా దాడికి దిగాయని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలు దాడికి దిగుతున్నాయని, భయం, బెదిరింపుల వాతావరణం ఏర్పరుస్తున్నారని, ఉదారవాద, లౌకిక, ప్రజాస్వామ్యం వంటివి దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

మళ్లీ పాత పాటే!

తీరుమారని కేంద్రం

సానుభూతి ఉందంటూనే అసలు విషయాన్ని దాటవేసిన జైట్లీ



అరుణ్ జైట్లీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రం రగిలిపోతున్నా మోడీ సర్కారు తీరు ఏమాత్రం మారలేదు. లోక్‌సభలో గురువారం నాడుకూడా పాతపాటే పాడింది. రాష్ట్ర ఎంపిల ఆందోళనల మధ్య లోక్‌సభలో ప్రసంగించిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మళ్లీ పాతపాటే పాడారు. విభజన హామీలు అమలు, ప్రత్యేకహోదా వంటి అంశాలపై ఎటువంటి నిర్దుష్ట ప్రకటన చేయకుండా దాటవేశారు. ఆంధ్రప్రదేశ్‌పై సానుభూతి ఉందంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. 'ఇప్పటికే చాలా ఇచ్చాం. ఎంతో చేశాం.' అంటూ గతంలో చెప్పిన లెక్కలే మళ్లీ చెప్పారు. 2018-19 బడ్జెట్‌పై లోక్‌సభలో జరిగిన చర్చపై జైట్లీ గురువారం సమాధానమిచ్చారు. ఆయన ప్రసంగంలో తొలుత ఏపికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు రాకపోవడంతో తెలుగుదేశం, వైసిపి సభ్యులు సభలో వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తోన్నామని, ఏపి గురించి ముందుగా మాట్లాడాలని తెలిపారు. మొదట ఏపి హామీలపై మాట్లాడిన తర్వాతే మిగతా విషయాలపై మాట్లాడాలని పట్టుబట్టారు. నినాదాలు, ఆందోళన మధ్యనే జైట్లీ ప్రసంగించారు. ఏపి పరిస్థితిపై తనకు అవగాహన, సానుభూతి కూడా ఉందని, కాస్తా ఓపిక పట్టాలని జైట్లీ కోరారు. అన్ని అంశాలు ప్రస్తావిస్తానని నిరసన తెలుపుతున్న ఏపి ఎంపిలనుద్దేశించి జైట్లీ అన్నారు. ప్రసంగం చివర్లో ఆంధ్రప్రదేశ్ అంశాన్ని ప్రస్తావించిన ఆయన రెండు నుండి రెండున్నర నిమిషాలు మిగతా 9లో

రేపటి నుంచి సిపిఎం రాష్ట్ర మహాసభలు

10న ప్రదర్శన, బహిరంగ సభకు భారీ సమీకరణ • ప్రజల నుంచి విశేషాదరణ



తుది మెరుగులు దిద్దుకుంటున్న ప్రతినిధుల సభ జరిగే హాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమ గోదావరిజిల్లాలో అప్‌ల్యాండ్, డెల్టా కమిటీల ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు, కార్మికులు, కళాకారులు విస్తృతంగా మహాసభల ప్రచారం చేశారని, ప్రజల నుంచి స్పందన, ఆదరణ వ్యక్తమైందని మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సిపిఎం నాయకులు బి బలరాం అన్నారు. వేలాది మంది ప్రదర్శన, బహిరంగ సభకు హాజరు కానున్నారని, గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరికి వారే స్వతహాగా వాహనాలు సమాకూర్చు కుంటున్నారని, దాతలు, వాహన యాజమానులకు వాహనాలను సమాకూర్చాలని విజ్ఞప్తి చేశామనీ. వారు సహకరిస్తున్నారనీ తెలిపారు. పదో తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు భీమవరం పాత బస్టాండ్ నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి జువ్వలపాలెం రోడ్డు, ఉండి రోడ్డు, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, మావుళ్లమ్మ గుడి రోడ్డు మీదుగా లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌కు చేరుకుంటుందని, అక్కడ మధ్యాహ్నం రెండున్నర గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందని వివరించారు. భీమవరంలో తొలిసారి జరగబోతున్న మహాసభలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా మని, ప్రదర్శన కూడా అదే స్థాయిలో నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ముఖ్యంగా కళాకారులు ప్రజాసమస్యలపై విచిత్ర వేషాలు, డప్పుల కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణీయంగా ఉంటాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విభజన సమయంలో పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 'బిజెపి మోసం.. టిడిపి నాటకం ఆపాలి' అనే ప్రధానమైన నినాదంగా ప్రదర్శన సాగుతుందని చెప్పారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పూర్వపు ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య, ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు, రమాదేవి హాజరుకానున్నారని మిగతా 9లో

> "రాజకీయ, కళా, సాంస్కృతిక కేంద్రం భీమవరంలో జరగనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగే ప్రదర్శనకు, బహిరంగ సభలకు భారీగా జన సమీకరణ జరుగుతోంది "
>
> - బి.బలరాం
>
> సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి



నేడు టెట్ మాక్ టెస్ట్

రేపటి నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2017 అభ్యర్థులకు నమూన పరీక్ష (మాక్ టెస్ట్)లు శుక్రవారం జరగనున్నాయి. అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ ఈ పరీక్షలను ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ పూర్తిచేసింది. ఎస్జీటిలకు పేపర్-1, ఎస్ఎలకు పేపర్-2, భాషా పండితులకు పేపర్-3 రాస్తారు. మొత్తం 4,46,833 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం నుంచి పరీక్ష హజరయ్యే వరకు మాక్‌టెస్ట్ అందుబా టులో ఉంటుంది. అభ్యర్థులు వారి వివరాలతో లాగి ఇన్ అయి మాక్ టెస్ పరీక్షకు హజరు కావొచ్చు. అదేవిధంగా అభ్యర్థులు వారి హాల్ టికెట్లను శనివారం నుంచి డౌన్‌లోడ్ చేసు కోవచ్చు.ఈ నెల 21 నుంచి మార్చి 3వరకు టెట్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే.

గార్లదిన్నెలో రైల్‌రోకో

ప్రజాశక్తి- గార్లదిన్నె

అనంతపురం జిల్లా గార్లదిన్నె రైల్వేస్టేషన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రైల్‌రోకో నిర్వహించారు. గురువారం ఉదయం గుంతకల్లు నుంచి పాకాలకు వెళ్తున్న తిరుపతి ప్యాసింజర్ గార్లదిన్నె రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఆ సమయంలో సిపిఐ నాయకులు రైలును అడ్డుకున్నారు. రైలు వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిరసన తెలుపుతున్న నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంతపూచికత్తుపై విడుదల చేశారు.



రైల్‌రోకో

ఎపి బంద్‌లో భాగంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె రైల్వేస్టేషన్‌లో రైల్ రోకో చేస్తున్న సిపిఐ నాయకులు

బంద్ ప్రశాంతం జరిగింది

ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బంద్ ప్రశాంతంగా సాగిందని, ప్రజలు ఇబ్బంది పడతారనేది దృష్టిలో ఉంచుకునే టిడిపి బంద్‌కు మద్దతు ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి ఎన్ చినరాజప్ప చెప్పారు. సచివాయలంలో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కమ్యూనిస్టు పార్టీలు బంద్‌కు పిలుపు ఇచ్చాయని, ఈ విషయంలో అన్ని పార్టీలు కలిసి రావడం శుభపరిణామని తెలిపారు. శాంతియుత ఆందోళనకు ఆటంకం కల్గించవద్దని తాము పోలీసులకు సూచించామన్నారు. పార్లమెంట్‌లో ఎంపీల నిరసనలకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో టిడిపి నిరసన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గుర్తించి కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేరిస్తే బిజెపితో పొత్తుకు తెరపడే అవకాశం లేదని చెప్పారు. బడ్జెట్ బాగుందని చెప్పిన వైసిపి ఇప్పుడు ఆందోళన చేయడం సరైందని కాదని వ్యాఖ్యానించారు.

ప్రజా విజయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారని, కానీ కేవలం రూ.421 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ అంటూ దాన్ని కూడా నీరుగార్చారని ప్రకటించారు. రైల్వేజోన్‌పై చర్చలు సాగుతున్నాయనే సాకుతో జోన్ అంశాన్ని నీరుగార్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజధానికి, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వాలని కోరారు. లోటు బడ్జెట్ రూ. 16 వేల కోట్లు ఉందని నిర్ధరించినా అదీ ఇవ్వలేదని విమర్శించారు. ఎపికి చేసిన అన్యాయంపై బిజెపి వెంటనే స్పందించి జరిగిన తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. చంద్రబాబు దోబూచులాడుతున్నారని, స్పష్టమైన నిర్ణయం ఏదీ ప్రకటించడం లేదని తెలిపారు. పార్లమెంటులో నిరసనల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు.

ప్రజ్ఞ

1. సైనిక బలగాల అధునీకరణ కోసం కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ?
2. డిజిటల్ భద్రతపై ఏ సంస్థతో కేంద్ర విద్యా పరిశోధన, శిక్షణా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది?
3. ప్రపంచ వన్డే క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్?
4. ఇటీవల మరణించిన మదపూర్ వాసుదేవన్ నాయర్ ఏ రంగానికి చెందినవారు?
5. సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ సెంటర్ (సిఎస్‌ఈ) ప్రధాన కార్యాలయం ఎక్కడ వుంది?

సమాధానాలు 11లో

బంద్ అపూర్వం

- రోడ్డెక్కని బస్సులు
- విద్యా సంస్థల మూత
- కలిసొచ్చిన అన్ని పక్షాలు
- టిడిపి నిరాహారదీక్ష
- పలుచోట్ల అరెస్టులు
- బంద్‌లో జర్నలిస్టుల భాగస్వామ్యం
- ప్రజా విజయమన్న వామపక్షాలు
- కుండ, మట్టితో వినూత్న నిరసన



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ గురువారం వామపక్షాలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. వైసిపి, జనసేన, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాలన్నీ బంద్‌లో పాల్గొన్నాయి. బస్సులు రోడ్డెక్కలేదు. విద్యా సంస్థలు పరీక్షలను వాయిదా వేసుకున్నాయి. పలుచోట్ల వామపక్ష నాయకులు, జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. తెలుగుదేశం నాయకులు కూడా నిరాహార దీక్షలు చేపట్టారు. పలు చోట్ల బంద్‌లోనూ పాల్గొన్నారు. పోలీసులూ బంద్‌కు సహకరించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బంద్ పూర్తిగా విజయవంతమైంది. బంద్‌లో భాగంగా విజయవాడలో ఉదయం నాలుగున్నర గంటలకే వామపక్ష, వైసిపి నాయకులు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ బస్సులు నిలిపేశారు. అధికారులూ బస్సులను బయటకు రానీయలేదు. లెనిన్ సెంటర్లో అన్ని పార్టీల నాయకులూ నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీ ఇచ్చింది మట్టి, కుండేనంటూ వినూత్న ప్రదర్శన చేపట్టారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మోకాళ్లపై నిలబడి నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థి సంఘాలూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించాయి. ముస్లిం ఐక్యవేదిక నాయకులు కూడా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సిపిఐ నాయకులు దోనేపూడి కాశీనాథ్, న్యూడెమొక్రసీ నాయకులు పోలారి, ఎంఎల్ పార్టీ నాయకులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల నాయకులు మోడీకి వ్యతిరేకంగా వినూత్న కార్యక్రమం చేపట్టారు. జర్నలిస్టు సంఘాలు తొలిసారి బంద్‌లో పాల్గొన్నాయి. ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిడబ్ల్యుజెయు, ఐజెయు, ఎపిజెఎఫ్, ఎపిపిజెఎ, ఎపిబిజెఎ తదితర సంఘాలన్నీ బంద్‌లో పాల్గొన్నాయి. బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రతిపక్షనాయకుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో బంద్‌లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర వైఖరికి నిరసనగా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాదు పోరంకి సెంటర్లో గుండు గీయించుకుని నిరసన వ్యక్తం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బెంజ్ సర్కిల్లో పెట్రోలు బంకు వద్ద నిరసన ప్రదర్శన చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది సిబ్బంది విధులకు హాజరవగా బంద్ నిర్వాహకులు వాటిని మూయించారు, బంద్‌కు ప్రజల నుండి సంపూర్ణ మద్దతు వచ్చిందని, అపూర్వమని, ప్రజా విజయమని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఇప్పటి వరకూ జరిగిన కార్యాచరణను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆ పార్టీలు ప్రకటించాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కర్నూలులో బంద్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులందరూ జిల్లాల వారీగా తెలుగుదేశం ఇచ్చిన నిరసన పిలుపులో పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు గుంటూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించడం ద్వారా కేంద్రానికి తమ నిరసన తెలిపారు. విజయవాడలో నిరాహార దీక్ష చేపట్టారు. మంత్రి అఖిలప్రియ కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నిరసనలో పాల్గొన్నారు. మిత్రధర్మం మరువొద్దని ప్లకార్డును ప్రదర్శించారు. వైసిపి నాయకులు కొలుసు పార్థసారథి తదితరులు విజయవాడ లెనిన్ సెంటర్లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్నలిస్టుల సంఘాల నాయకులు జి.ఆంజనేయులు, అంబటి ఆంజనేయులు, ఎస్.వెంకట్రావు, జయరాజు, కృష్ణాంజనేయులు, చందు జనార్ధన్ తదితరులు బంద్‌లో పాల్గొన్నారు.

బంద్‌పై చంద్రబాబు సమీక్ష

దుబాయ్‌లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బంద్‌పై టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. బంద్‌కు సహకరించాలని అధికారులను ఆదేశించారు. శాంతియుతంగా జరిగేలా చూడాలని, అసాంఘిక శక్తులను అడ్డుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను ఆదేశించారు.

సంపూర్ణం... స్వచ్ఛందం

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని, రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ వామపక్షాలు గురువారం చేపట్టిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది.

విశాఖపట్నం: విశాఖ నగరంలో బంద్ స్వచ్ఛందంగా, సంపూర్ణంగా జరిగింది. నిత్యం రద్దీగా ఉండే మద్దిలపాలెం, జగదాంబ, ద్వారకా బస్టాండ్, రైల్వేస్టేషన్, గోపాలపట్నం, గాజువాక జంక్షన్లు బంద్ కారణంగా జనం లేక వెలవెలబోయాయి. మద్దిలపాలెం జంక్షన్లో రోడ్డుపై సిపిఎం కార్యకర్తలు కబడ్డీ ఆడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. అచ్యుతాపురంలో టిడిపికి చెందిన యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కారును బంద్ నిర్వాహకులు అడ్డుకున్నారు.

తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి: తూర్పుగోదావరి జిల్లాలో బంద్ సంపూర్ణంగా జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో బంద్ ప్రభావం సాయంత్రం వరకూ కొనసాగింది. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ర్యాలీలో సిపిఎం మాజీ ఎంపి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా పోరాట సమితి నాయకులు బలరాంనాయుడు కోటగుమ్మం సెంటరులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మౌనదీక్ష చేశారు.

శ్రీకాకుళం: విజయనగరం జిల్లాలో విజయనగరం, పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, బొబ్బిలి పట్టణాల్లో వామపక్ష శ్రేణులు తెల్లవారు జామునే రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపాయి. సాలూరులో సైతం లారీలను స్వచ్ఛందంగా నిలిపివేశారు.

తిరుపతి : చిత్తూరు జిల్లా తిరుపతిలో సిపిఎం, సిపిఐ నాయకులు నడిరోడ్డుపై కబడ్డీ ఆడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రెస్‌క్లబ్, ఎపియుడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బంద్‌కు మద్దతు ప్రకటించి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. కడప జిల్లాలో పెట్రోల్ బంక్‌లు కూడా మూతపడ్డాయి. కడప, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, కమలాపురం మైదుకూరు, జమ్మలమడుగు, రాజంపేట, పులివెందుల, రాయచోటి, బద్వేల్‌లో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది.

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో అఖిలపక్ష నేతలు పాల్గొని బంద్‌కు మద్దతు తెలిపారు. ఒంగోలులో న్యాయవాదులు బంద్‌కు మద్దతుగా విధులు బహిష్కరించి ఐలూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. జర్నలిస్టు సంఘాలు కూడా బంద్‌లో పాల్గొన్నాయి. కలెక్టరేట్ వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విచిత్ర వేషధారణతో వినూత్న రీతిలో నిరసన తెలిపింది. నెల్లూరు జిల్లాలో బంద్‌కు ప్రజల నుంచి భారీ స్పందన కనిపించింది. వామపక్షాల బంద్‌కు సంఘీభావంగా ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్ తన పాదయాత్రకు విరామం ప్రకటించారు. విద్యార్థులతో కలిసి ఎఎస్‌పేట మండలం దుండిగల్ వద్ద నిరసన తెలిపారు.

కర్నూలు : అనంతపురం జిల్లా హిందూపురంలో నిర్వహించిన బైకు ర్యాలీలో పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, అనంతపురంలో నిరసన ప్రదర్శనలో సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబుళ, వైసిపి ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపి అనంత వెంకటరామిరెడ్డి పాల్గొ న్నారు. గార్లదిన్నె మండలంలో సిపిఐ ఆధ్వర్య ంలో రైల్‌రోకో జరిగింది. కర్నూలు జిల్లా నంద్యాలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం నాయకులు కొత్త బస్టాండు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

విజయవాడలో జర్నలిస్టుల ప్రదర్శన

విభజన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు విమర్శించారు. రాష్ట్ర బంద్‌కు మద్దతుగా గురువారం ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యాన లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

693 మంది అరెస్ట్: డిజిపి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా చెదురుమదురు ఘటనల మినహా రాష్ట్ర బంద్ ప్రశాంతంగా జరిగిందని డిజిపి ఎం మాలకొండయ్య ప్రజాశక్తికి తెలిపారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బంద్ సందర్భంగా సుమారు 693 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

సామర్లకోటలో ఫోనిక్స్ మెగా రైస్‌మిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచంలోనే అతిపెద్ద రైస్‌మిల్లు తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో నెలకొల్పేందుకు దుబా య్‌కు చెందిన ఫోనిక్స్ సంస్థ సిద్ధమయింది. ముఖ్య మంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటనలో భాగంగా గురువారం ఆ సంస్థ ఎగ్జిగ్యూటివ్ చైర్మన్, సిఇఒ గౌరవ్ థావన్‌తో భేటీ అయ్యారు. ఈ మెగా ఇంటిగ్రేటెడ్ రైస్‌మిల్లు పనులు ఏప్రిల్‌లో ప్రారంభిస్తామని థావన్ సిఎంకు తెలిపారు. ఏడాదికి 3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో మెగా రైస్‌మిల్ ప్రాజెక్టు పనిచేస్తుందని ఈ సందర్భంగా థావన్ సిఎంకు తెలిపారు. వాటిలో లక్ష మెట్రిక్ టన్నులను దేశీయ మార్కెట్‌లో, మిగిలిన 2 లక్షల మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి చేయాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం షరాఫ్ గ్రూపు చైర్మన్ షరావుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్‌తో సిఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌తో పాటు ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సిఎం షరాఫ్‌ను కోరారు. అందుకు భూ కేటాయింపులు, అనుమతులు తదితర విషయాల్లో సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం ఆహార శుద్ధి రంగంలో సరైన విధానం ప్రకటిస్తే రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధమని షరాఫ్ ముఖ్యమంత్రికి స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఎయిర్ క్రాఫ్ట్ , విమానాల ఇంటీరియర్, డ్యూరబుల్స్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఎమిరేట్స్ గ్రూపు ముందుకొచ్చింది. ఏవియేషన్ శిక్షణ కోసం అకాడమీని నెలకొల్పేందుకు సిద్ధంగా ఉంది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆసంస్థ ఏపి ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపిఇడిబి)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విమానయాన రంగంలో ఏపి ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్ ప్రారంభించాలని దుబాయ్ నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ చైర్మన్ షేక్ అహ్మద్ బీన్ సయీద్ అల్ మక్తూమ్‌ను ముఖ్యమంత్రి కోరారు. ఎపి, అమరావతికి తమ విమాన సర్వీసులు ప్రారంభిం చాలంటే భారత ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయని ఈ సందర్భంగా మక్తూమ్ సిఎం దృష్టికి తెచ్చారు. నిబంధనలు సరళీకరిస్తే తమ సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.



నెల్లూరు జిల్లాలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ప్రతిపక్ష నాయకుడు, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి



కర్నూల్లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పక్కన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకరరెడ్డి తదితర నాయకులు

రగిలిన రాష్ట్రం

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

బంద్‌లో పాల్గొన్న జగన్

ప్రజాశక్తి-ఎ.ఎస్.పేట

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ అన్నారు. గురువారం ఉదయం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఎఎస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులతో కలసి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని నినాదాలు చేయడంతో జగన్ వారితో గొంతు కలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. హోదా ఉంటే అన్ని రంగాల్లో రాష్ట్రం ముందడుగు వేయొచ్చన్నారు. ప్రత్యేక హోదా కోసం వైసిపి గట్టిగా పోరాడుతుందన్నారు. అధికార పార్టీ ప్యాకేజీలని చెప్పడం, కేంద్రం నిధులు మంజూరు చేయలేదనడం ఇలా రోజుకో విధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రత్యేక హోదా సాధించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఉదయం ఎనిమిది గంటల సమయంలో బంద్ సందర్భంగా ప్రజా సంకల్ప యాత్రకు విరామం ప్రకటించి హైదరాబాదుకు వెళ్లారు. శనివారం ఉదయం జువ్వలగుంట పల్లి నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని వైసిపి వర్గాలు తెలిపాయి.

మోడీ వాగాడంబరం కట్టిపెట్టు

- బాబూ.. అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకుపో
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ప్రధాన మంత్రి నరేంద్రమోడి వాగాడంబరాలు కట్టిపెట్టి ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కర్నూలులో బంద్‌లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు కోట్లమంది ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఎపికి జరుగుతున్న అన్యాయంపై వాయిదా తీర్మానానికి కూడా అవకాశం ఇవ్వకుండా సభను ఇంకా ఎన్నాళు వాయిదా వేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ గురువారం వామపక్షాలు నిర్వహించిన బందులో సహకరించి, స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నరేంద్రమోడి ప్రభుత్వం పదే పదే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా బడ్జెట్‌లో మరింత అన్యాయానికి పాల్పడిందన్నారు. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్, వైఎస్ఆర్‌సిపి, జనసేనలు. వర్తక వాణిజ్య సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు, కార్మిక సంఘాలతో పాటు ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు కలిసికట్టుగా నిరసన తెలపాయన్నారు. అయితే అధికారపార్టీ అయిన తెలుగుదేశం కూడా పార్లమెంటులో ఎంపిలకు సంఘీభావంగా ర్యాలీలు, నిరసనలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ బంద్ కేవలం ప్రారంభం మాత్రమేనని, త్వరలో అఖిలపక్షాల సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని సూచించారు.



విజయవాడలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న విఎస్సార్, వైవి, మధు, కత్తి మహేశ్, చలసాని శ్రీనివాస్, బాబురావు ప్రభృతులు



అనంతపురంలో కాంగ్రెస్ నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి

మోడీ ఇంటి ముందు చంద్రబాబు ధర్నా చేయాలి

- చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్రం పట్ల నిబద్ధత ఉంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంటి ముందు ధర్నా చేయాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్‌సెంటర్‌లో గురువారం చేపట్టిన బంద్‌లో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చకుండా దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. ఢిల్లీలో నిలబడి పార్లమెంట్‌ను స్తంభింపజేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి చంద్రబాబు ఎందుకు స్పందించలేదన్నారు. ఆస్కార్, నంది అవార్డులు ఇప్పటికే ఇచ్చేశారని, ఇంక నటించడం అనవసరమని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు నిబద్ధత ఉంటే అందరినీ కలుపుకొని అఖిలపక్షం వేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. పిలిచి పిలిచి శాలువాలు కప్పిన వారు ఇప్పుడు రాష్ట్రానికి ఏమిచ్చారని ప్రశ్నించారు.

బిజెపికి ఎపి ప్రజలు ఎలా కనిపిస్తున్నారు?: కత్తి

బిజెపి ప్రభుత్వానికి ఎపి ప్రజలు ఎలా కనిపిస్తున్నారని సినీ విమర్శకులు కత్తి మహేష్ ప్రశ్నించారు. వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్‌సెంటర్‌లో గురవారం నిర్వహించిన బంద్‌లో ఆయన పాల్గొన్నారు. టిడిపి అసమర్థ వైఖరి వల్లే కేంద్రం బడ్జెట్‌లో మోసం చేసిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఎపిని విస్మరించడం దారుణమన్నారు. బంద్‌కు పవన్ కల్యాణ్ మద్దతు ప్రకటించడం అభినందనీయమని, పవన్ ప్రజల్లోకి రావాలని, ఆయన పోరాటం చేస్తామంటే ఆయనతో పాటు ఉద్యమంలోకి కలిసి రావడానికి సిద్ధమని తెలిపారు. ఇప్పటి దాకా రాష్ట్రానికి చెప్పినవన్నీ ఇస్తారని వేచి చూశామని, ఇక పోరాటాల ద్వారానే సాధించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. ఎపి ప్రయోజనాల్ని కాపాడేందుకు సినీ పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుందని, అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

ప్రధాని లేని సమయంలో ప్లకార్డులతో నాటకాలు

టిడిపి ఎంపిల తీరుపై రఘువీరారెడ్డి విమర్శ

ప్రజాశక్తి-హిందూపురం టౌన్

పార్లమెంట్‌లో ప్రధాని లేని సమయంలో టిడిపి ఎంపిలు ప్లకార్డులు చేతబట్టుకొని ప్రదర్శిస్తున్నారని పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి విమర్శించారు. నాలుగు రోజులుగా అధికార పార్టీకి మిత్ర పక్షంగా ఉన్న టిడిపి ఎంపీలు ఇలా నాటకాలు ఆడుతున్నారన్నారు. గురువారం అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో నిర్వహించిన బంద్‌లో పాల్గొన్నారు. తొలుత పట్టణంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టిడిపి, వైసిపిలు రాష్ట్ర అభివృద్ధిని రాష్ట్ర ప్రయోజనాను స్వార్థం కోసం తాకట్టు పెట్టాయన్నారు. రాష్టం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని, ఈ విషయం తెలిసినా టిడిపి నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టారని రఘువీరారెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ప్రజలు సైతం స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు.

మహిళా కాంగ్రెస్ ర్యాలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ ప్రజల తరుపున కాంగ్రెస్ పోరాటం చేస్తుందని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తెలిపారు. విభజన హామీలు విస్మరించి కేంద్రం తీరుకు నిరసనగా గురువారం చేపట్టిన బంద్‌లో భాగంగా విజయవాడలోని ఏలూరు రోడ్డులో ర్యాలీ నిర్వహించి, లెనిన్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ నాయకులు కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. నగర కాంగ్రెస్ నాయకులు అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో షెటిల్ ఆడుతూ నిరసన తెలిపారు. పిసిసి అధికార ప్రతినిధులు కొలనుకొండ శివాజి, వి.గురునాథం, ఆ పార్టీ నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.



ఓల్డ్ బస్టాండ్ వద్ద డిపోలో ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

బస్సులు బంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి అన్యాయం చేయడంపై వామపక్షాలు గురువారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి బస్సులతో సహా ప్రయివేటు బస్సులు కూడా రోడ్డెక్కలేదు. అన్ని ప్రాంతాల్లో ఆర్టీసి బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. బంద్ పరిస్థితిని బట్టి కొన్ని ప్రాంతాల్లో బస్సు సర్వీసులను నడిపినట్లు ఆర్టీసి ఉన్నతాధికారులు తెలిపారు. సాధారణంగా నడిచే బస్సు సర్వీసుల్లో 41 శాతం సర్వీసులను గురువారం నడిపినట్లు వివరించారు. సాధారణంగా బస్సులు నడపడం ద్వారా రోజుకు రూ.12 కోట్లు వచ్చేదని, బంద్ సందర్భంగా రూ.4.92 కోట్లు వసూలయ్యాయని తెలిపారు.



గుండు గీయించుకుని ఎమ్మెల్యే బోడేప్రసాద్ నిరసన

ప్రజాశక్తి - ఉయ్యూరు

కేంద్రప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గురువారం ఉయ్యూరులో గుండు గీయించుకుని నిరసన తెలిపారు. పార్లమెంటులో ఎంపిల నిరసనకు మద్దతుగా ఉయ్యూరులో ఏర్పాటుచేసిన శాంతియుత నిరసనలో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శించారు. అనంతరం గుండు గీయించుకున్నారు. మాజీ ఎఎంసి చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, టిడిపి నాయకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, వేమూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, తదితర విద్యార్థి సంఘాల నాయకులు

రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టులు

శ్రీకాకుళంలో అత్యధికంగా 454 మంది

బంద్‌పై ప్రభుత్వ నిర్బంధం

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాలు గురువారం చేపట్టిన బంద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. ఎక్కడికక్కడే అరెస్టులకు పాల్పడింది. వామపక్ష శ్రేణులను, బంద్‌కు మద్దతు పలికి.. పాల్గొన్న వైసిపి, కాంగ్రెస్ పార్టీ, జనసేన పార్టీ నాయకులను, కార్యకర్తలను వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా మొత్తం 454 మంది వామపక్ష, వైసిపి, కాంగ్రెస్, జనసేన నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కృష్ణమూర్తి, వైసిపికి చెందిన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కూడా ఉన్నారు. పాలకొండ వైసిపి ఎమ్మెల్యే వి.కళావతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి శాంతి తదితరులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. విజయనగరం జిల్లాలో 73 మందిని అరెస్టు చేశారు. విశాఖ నగర పరిధిలోనూ, గ్రామీణ ప్రాంతంలోనూ పోలీసులు అరెస్టులకు పూనుకున్నారు. పలువురు సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. అనకాపల్లిలో 300 మందిని అరెస్టు చేయడంతో అన్ని పార్టీల నాయకులూ పోలీసు స్టేషన్ ఆవరణలో బైటాయించారు. ఆరిలోవ, అరకులోయ, కె.కోటపాడు, పాడేరు, నక్కపల్లి, పాయకరావుపేట, అచ్యుతాపురంలో కూడా అరెస్టులు జరిగాయి. చిత్తూరు జిల్లా పుత్తూరు, పలమనేరు, మదనపల్లి, పీలేరుల్లో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. మొత్తం 77 మంది సిపిఎం, సిపిఐ నాయకులను అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా దర్శిలో 20 మందిని అదుపులోకి తీసుకుని తరువాత వదిలేశారు. కర్నూలు జిల్లా నంద్యాలలో 20 మంది సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో కూడా పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 91 మందిని అరెస్ట్ చేశారు. ఏలూరు, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, చింతలపూడిలో అరెస్టులు జరిగాయి.

రాష్ట్రం అట్టుడుకుతుంటే సిఎం దుబాయ్ వెళ్తారా..?

వైసిపి అధికార ప్రతినిధి అంబటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం పార్టీ నాలుగేళ్ల నుంచి బిజెపికి మిత్రపక్షంగా ఉండి రాష్ట్రానికి ఏం సాధించారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పాలని వైసిపి అధికార ప్రతినిధి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా రోడ్డెక్కితే, పెట్టుబడులంటూ చంద్రబాబు దుబాయ్ వెళ్లడం సిగ్గుచేటన్నారు.

విభజన హామీలు సాధించడంలో ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సంకీర్ణ ధర్మానికి కేంద్రం విరుద్ధంగా వ్యవహరిస్తున్నా, టిడిపి మాత్రం ఇంకా సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తున్నామనడంలో అర్థం లేదని వ్యాఖ్యానించారు. ఎంపీ గల్లా జయదేవ్ ప్రతిపక్ష నేతపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజయోజనాల కోసం జరిగిన బంద్‌లో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.



కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ కార్యకర్తలు



బంద్‌కు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకుల ర్యాలీ

రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి, రాజకీయ స్వలాభాల కోసం కుట్రలు పన్నుతున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ధ్వజమెత్తారు. వామపక్షాలు గురువారం చేపట్టిన బంద్‌లో భాగంగా కెవిపిఎస్, ఇతర గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సాంఘిక, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రధాన కార్యాలయాలు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల గురుకుల పాఠశాలల సొసైటీ కార్యాలయాలు క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీరింగ్ కార్యాలయం, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్, గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను స్వచ్ఛందంగా మూసివేసి, బంద్‌లో పాల్గొని వారి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ విభజన సమయంలో రాష్ట్రానికిచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించడంలోనూ కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెచ్చుకోవడంలోనూ, విభజన హామీలను అమలయ్యే విధంగా కేంద్రం పై ఒత్తిడి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలింబిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్, తుడుందెబ్బ రాష్ట్ర నేతలు వంశీకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

జనాగ్రహం

విభజన హామీలకు నిలువెత్తున పాతరేసి ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన మోడీ ప్రభుత్వానికి నిరసనగా వామపక్షాల పిలుపు మేరకు గురువారం రాష్ట్ర బంద్ అపూర్వంగా విజయవంతమైంది. బంద్‌కు వైసిపి, కాంగ్రెస్ మద్దతు పలకగా జనసేన సంఘీభావం తెలిపింది. ఏపీకి బిజెపి చేసిన అన్యాయంపై అనేక ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు బంద్‌లో పాల్పంచుకున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, టిడిపి ఈ రెండు పార్టీలు మాత్రమే బంద్‌కు దూరంగా ఉన్నాయి, మిగిలిన పార్టీలు, ప్రజలు మొత్తంగా బంద్‌లో పాల్గొన్నాయి. ఇప్పటికి ఐదు బడ్జెట్లు తెచ్చిన ఎన్‌డిఎ సర్కారు రాష్ట్రానికి ఎంత మాత్రం సహకరించలేదు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజి, రైల్వేజోన్, రాజధాని, పోలవరం, జాతీయ స్థాయి విద్యా సంస్థలు, విశాఖ, విజయవాడ మెట్రోరైలు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఇలా ఏపీకి ఇచ్చిన అన్ని హామీలకూ మొండిచెయ్యి చూపింది. దీంతో రాష్ట్ర ప్రజల్లో కేంద్రం పట్ల గూడుకట్టుకున్న ఆగ్రహం గురువారంనాటి బంద్ రూపంలో పెల్లుబుకింది. నిరసనలు, ఆందోళనలు ఎగసిపడ్డాయి. వ్యాపారులు, వాణిజ్య, విద్యా సంస్థలు, విద్యార్థులు, కార్మికులు, యువకులు, మహిళలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వాములై తమ అసంతృప్తిని, అసహనాన్ని, ఆకాంక్షలను, డిమాండ్లను ఢిల్లీకి వినిపించారు. ప్రజాగ్రహాన్ని మన్నించైనా తాము చేసిన అన్యాయాన్ని గుర్తించి కేంద్రం తరఫు నుంచి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఒక పక్క ఇక్కడ బంద్ కొనసాగుతుండగానే అక్కడ పార్లమెంట్‌లో పచ్చి అబద్ధాలు వండి వార్చారు. ఏపీకి ఇప్పటికే చాలా చేసేశామనీ, ఇంకా చేయాల్సినవన్నీ చేస్తామని పాత పాటే పాడి మరోసారి రాష్ట్ర ప్రజలను వంచించేందుకు బరితెగించారు. బడ్జెట్ అనేది ప్రభుత్వ విధానపత్రం. ఐదు బడ్జెట్లల్లోనూ ఏపీ గురించి మాట మాత్రమైనా ప్రస్తావించకుండా తామేదో రాష్ట్రానికి ఒరగబెడుతున్నామనడం పార్లమెంట్‌ను, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

ప్రధానిదీ ఇదే వరస. పార్లమెంట్‌లో మొన్న గంటన్నరసేపు రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఊదరగొట్టిన మోడీ ఎక్కడా ఏపీ గురించి పన్నెత్తు మాట్లాడలేదు. టిడిపి ఎంపీల దగ్గర ఏపీకి ఏం తక్కువ చేశామన్నారు. పైగా ప్రతిపక్ష కాంగ్రెస్‌పై నెపం వేశారు. అప్పుడు అధికారంలో ఉన్న యుపిఎ, ప్రతిపక్షంలో ఉన్న ఎన్‌డిఎ ఏకమైతేనే రాష్ట్ర విభజన సాధ్యమైందన్న వాస్తవం చెరిపేస్తే చెరిగిపోయేది కాదు. తాము అధికారంలోకొస్తే అన్ని హామీలనూ అమలు చేసి తీరతామని రాజ్యసభలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వెంకయ్యనాయుడు, జైట్లీ నొక్కి వక్కాణించారు. తదుపరి రాష్ట్రంలో పాల్గొన్న ఎన్నికల సభల్లో టిడిపిని వెంటేసుకొని మరీ మోడీ ఆ వాగ్దానాలను కంఠోపాఠం చేశారు. అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు దాటాక, ఐదు బడ్జెట్లు ప్రవేశపెట్టాక కూడా ఏ ఒక్క హామీనీ అమలు పర్చకుండా ఇచ్చిన హామీలకు బిజెపి కట్టుబడి ఉంది నమ్మమంటే నమ్మడానికి ఏపీ ప్రజలు అంత తెలివి తక్కువ వారేమీ కాదు. వాజపేయి హయాంలోనూ ఈ రాష్ట్రంలో టిడిపి, బిజెపి పొత్తు కొనసాగింది. అప్పుడూ వీరిద్దరూ కలిసి ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకూ ఏపీ ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. పదేళ్ల వరకు సోదిలో కూడా లేవు ఆ పార్టీలు. విభజన హామీలకు వెన్నుపోటు పొడిస్తే గత అనుభవం తప్పక పునరావృతమవుతుందని ప్రజలు బంద్ ద్వారా భవిష్యత్తును ఆవిష్కరించారని వారు గ్రహించాలి.

రాష్ట్రంలో కేంద్రంలో బిజెపితో అధికారాన్ని పంచుకొని చెట్టపట్టాలేసుకు తిరుగుతున్న టిడిపి మూడున్నరేళ్లయ్యాక తీరిగ్గా ఇప్పుడు మోడీ సర్కారు ఏపీకి అన్యాయం చేసిందని సన్నాయి నొక్కులు నొక్కడం అతి పెద్ద మోసం. నిరసన వెల్లువను గమనించి ఎక్కడ తమ అడుగు జారుతుందోనన్న భయంతోనే టిడిపి విన్యాసాలు. ఇప్పుడైనా బిజెపి చేసిన ద్రోహం పట్ల స్పష్టతగా ఉన్నారా అంటే అదీ లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకొని టిడిపికి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రుల వరకు పొద్దున ఒక మాట, రాత్రికి ఇంకో మాట లోపల ఒకటి బయట వేరొకటి మాట్లాడుతూ ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. కేంద్రంపై కోర్టుకెళతామంటారు, అంతలోనే మిత్ర ధర్మం పాటిస్తామంటారు. రాష్ట్రంలో బంద్ ఎందుకు ఢిల్లీలో పోరాడండి అని ముఖ్యమంత్రి అంటారు, మరోవైపు ఢిల్లీలో టిడిపి ఎంపిల పోరాటానికి మద్దతు అంటూ రాష్ట్రంలో టిడిపి శ్రేణులు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తారు. ఇప్పటికైనా బిజెపి, టిడిపి తమ కపట నాటకాలు కట్టి పెట్టాలి. తమ రాజకీయ, ఇతరత్రా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే ప్రజలు క్షమించరు.

ఇదీ విషయం



జనగళం యుగళమై
గొంతెత్తిన తెలుగు నేల...
వంచన ధిక్కార స్వరం
పిడికిలి బిగిసిన వేళ!

బంద్ లోనూ ద్వంద్వ నీతి
అడుగడుగున నిర్బంధం...
ఎక్కడ నిలదీస్తారోనని
ఖాకీలతో దిగ్బంధం!

\- కొల్లూరు వెంకట్

'దొంగే-దొంగ' అన్నట్లుంది ప్రధాని ప్రసంగం

విశ్లేషణ





వి శంకరయ్య

> బిజెపి కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి పూర్వపు వ్యవస్థనే మార్పు చేసింది. దీంతోపాటు ప్రత్యేక హోదాను కూడా పక్కన పెట్టింది. ఈ దుర్మార్గానికి ఒడిగట్టింది ప్రధాని మోడీ కాదా? ఒక వేళ చట్టం ద్వారానే ప్రత్యేక హోదా అమలు జరపాలని భావించి వుంటే పోలవరం ముంపు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఏపిలో కలిపిన సందర్భంలో ప్రత్యేక హోదాను కూడా జతపర్చి అమలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు?

పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం ఏపి ప్రజలకు పుండుపై కారం రాసినట్లుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ద్వారా అవశేష ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టం, కష్టం మొత్తానికి బాధ్యత కాంగ్రెస్ పార్టీపైకి నెట్టి నేటి దురవస్థకు కాంగ్రెస్‌దే బాధ్యతంటూ... కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌పై నాలుగు రాళ్లు కూడా వేశారు. ప్రధాని స్థాయి నేత పచ్చి అబద్ధాలు వల్లె వేయడం ఏపి ప్రజలను మరింత రెచ్చగొట్టేలా వుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ అధికారంలో ఉండి విభజించినా ఆ రోజుల్లో బిజెపి మద్దతు ప్రకటించిన తర్వాతనే ఈ దురాగతానికి తలపడింది. పార్లమెంట్ ఉభయ సభల్లో రాష్ట్ర విభజన చట్టం బిజెపి మద్దతు లేనిదే ఆమోదం పొందేది కాదనే అంశం ఏపిలో ప్రతి పౌరునికి తెలుసు. పార్లమెంట్ తలుపులు మూసి విభజన బిల్లు ఆమోదం పొందిన సందర్భంలో ఆనాడు పార్లమెంటులో బిజెపి పక్షనేత సుష్మా స్వరాజ్ తెలంగాణ నేతలను ఉద్దేశించి ఈ చిన్నమ్మను కూడా గుర్తు పెట్టుకోండి అని చేసిన వ్యాఖ్య వెనుక ఎంత దుర్మార్గపు భావన వుందో నేతలు మర్చిపోయినా ఏపి ప్రజలు మర్చిపోలేదు. సోనియాగాంధీ హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసేందుకు ప్రయత్నించిన సందర్భంలో అందుకు బిజెపి అంగీకరించలేదని ఇప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఒక సందర్భంలో ప్రకటించిన అంశం వాస్తవం కాదా! తెలంగాణలో తానేదో బావుకొనేందుకు కాంగ్రెస్ ఎంత తహతహలాడిందో బిజెపి కూడా అదే తరహాలో చేయని ప్రయత్నం లేదు. అంతక్రితమే కాకినాడ సమావేశంలో చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు, తెలంగాణ ఆవిర్భావానికి బిజెపి తీర్మానం చేసింది నిజం కాదా! తెలంగాణ ఉద్యమంతో టిఆర్‌ఎస్‌తో పాటు చెట్టాపట్టాలు వేసుకొని బిజెపి పాల్గొన్నది వాస్తవం కాదా! ఆ రోజుల్లో ప్రధాని మోడీ హవా లేకపోవచ్చు. తన సహచరుల నుంచైనా తెలుసుకోలేదని భావించలేం. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్‌కి బిజెపికి సమాన బాధ్యత ఉంది.

దీనికితోడు ఏపికి జరిగిన అన్యాయంపై మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి ఆవేదన వెలిబుచ్చుతున్నారు. అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించారని చెబుతున్నారు. ఈ అంశంపై ఎన్నికలు ముందున్నాయి కాబట్టి ముఖ్యమంత్రి రభస సాగిస్తున్నారు. కాగా రాష్ట్ర విభజనను ఆమోదిస్తూ రెండు దఫాలు కేంద్రానికి లేఖలు రాసిన సందర్భంలో ఒక్కసారైనా రాష్ట్ర విభజనకు శాస్త్రీయమైన ప్రతిపాదనలు ఎందుకు చేయలేదు? తుదకు రాష్ట్ర విభజన తప్పదని తేలిపోయిన తర్వాత ఢిల్లీలో దీక్ష సాగించిన సందర్భంలోనైనా ఏపి ప్రజలకు అన్యాయం జరగకుండా ఏవైనా ప్రతిపాదనలు చేశారా? ఆ మహాపాపంలో కాంగ్రెస్‌కు బిజెపికి ఎంత బాధ్యత వుందో తెలుగుదేశం పార్టీకి కూడా సమాన బాధ్యత వుంది. ఒక్క మార్క్సిస్టు పార్టీ తప్ప మిగిలిన అన్ని పార్టీలు ఆ అగ్నిగుండానికి తలాకొంచెం సమిధలు అందజేశారు.

ఏపికి జరిగిన అన్యాయంలో రెండు అంశాలు ఇమిడి వున్నాయి. 1.రాష్ట్ర విభజన చట్టం మేరకు చట్టబద్ధంగా నిధులు, రాయితీలు అందకపోవడం. 2. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆనాటి ప్రధాన మంత్రి, నేడు అధికారంలో ఉన్న బిజెపి నేతల ప్రోత్సాహంతో ప్రకటించబడిన హామీలు అమలు జరగకపోవడం. ఇందులో ప్రధానమైంది ప్రత్యేక హోదా. 1969లో 5వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ప్రత్యేక హోదా వెలుగు చూసింది. ప్రత్యేక హోదా చట్టం ద్వారా ఏ రాష్ట్రానికి అమలు చేయలేదు. జాతీయాభివృద్ధి మండలిలో ఆమోదింపబడి ప్రణాళికా సంఘం ద్వారా 11 రాష్ట్రాలకు అమలు జరపడం వాస్తవం కాదా? ఏపి అంశానికి వచ్చేసరికి విభజన చట్టంలో లేదనే వాదన తీసుకువచ్చి ఏపికి పంగనామాలు పెట్టింది- కేంద్రంలోని బిజెపి పార్టీ కాదా! 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో హామీ ఇచ్చిన అప్పటి ప్రధాని ప్రత్యేక హోదా అంశాన్ని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి ప్రణాళికా సంఘానికి పంపించింది నిజం కాదా? గత ప్రభుత్వం ఆమోదించి తాము బలపరచిన అంశాన్ని నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కితే ఏపి ప్రజలు క్షమించే స్థితిలో లేరు.

బిజెపి కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి పూర్వపు వ్యవస్థనే మార్పు చేసింది. దీంతో పాటు ప్రత్యేక హోదాను కూడా పక్కనబెట్టింది. ఈ దుర్మార్గానికి ఒడిగట్టింది ప్రధాని మోడీ కాదా? ఒక వేళ చట్టం ద్వారానే ప్రత్యేక హోదా అమలు జరపాలని భావించి వుంటే పోలవరం ముంపు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఏపిలో కలిపిన సందర్భంలో ప్రత్యేక హోదాను కూడా జతపర్చి అమలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టిన ఈ మహా నేరాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొనసాగించింది. నేడు గుక్కతిప్పుకోలేక కాంగ్రెస్‌పార్టీ పై నెపం నెట్టి ఏపి ప్రజల చెవుల్లో 'తామర పువ్వులు' పెట్టేందుకు ప్రధాని చేస్తున్న ప్రయత్నాలు విఫలం కాక తప్పవు. ప్రత్యేక హోదాలో నిధులకన్నా రాయితీలే ఎక్కువ ప్రధానమైనవి. పన్ను రాయితీలకు ప్రత్యేక హోదాకు 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల తదుపరి సంబంధం లేదని ఇటీవల వరకు వాదించిన కేంద్ర ఆర్థిక మంత్రి... 11 రాష్ట్రాలకు తిరిగి పన్ను రాయితీలు కల్పించారు కదా! ఇన్నాళ్ల మిన్నకుండిపోయిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇప్పుడే గుర్తు వచ్చినట్లు మాట్లాడటం విడ్డూరం.

ఏపి ప్రత్యేక హోదా నిరాకరించినందుకు ఒకటి రాజకీయ కారణమైతే రెండు ఆర్థిక పరమైన అంశాలుగా వున్నాయి. రాజకీయమైన అంశంపై పలు భాష్యాలు ప్రచారంలో వున్నా ఆర్థికపరమైన అంశాలు నిర్దిష్టంగా కన్పిస్తున్నాయి. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించినందున 2013-14 కేంద్రం బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు, 2014-15 బడ్జెట్‌లో రూ.17 వేల కోట్లు కేంద్రం కోల్పోయింది. అదే మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చివుంటే ఇంతకు రెట్టింపు ఆదాయం కేంద్రం కోల్పోవాల్సి వుంటుందని ఆ రోజుల్లోనే ప్రచారంలోనికి వచ్చింది. పైగా ఏపికి విస్తారంగా నిధులు, రాయితీలు లభించేవి. అయితే ఇందువల్ల బిజెపికిగానీ కేంద్ర ప్రభుత్వానికిగానీ పెద్దగా లాభించేది లేదని ఈ నిర్ణయం గైకొన్నట్లు అప్పట్లో జరిగిన ప్రచారం అందరికీ తెలుసు. కానీ ముఖ్యమంత్రి, ఆయనకు చెందిన మీడియా ఈ అంశాలను మరుగు పరచి ఏపి ప్రజలకు తీరని ద్రోహం చేశారు. 2015-16 కేంద్ర బడ్జెట్ నుండి 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోనికి వచ్చాయి. 14వ ఆర్థికసంఘం సాధారణ కేంద్ర మద్దతు, అదనపు కేంద్ర మద్దతు, ప్రత్యేక కేంద్ర మద్దతు, ప్రత్యేక ప్రణాళికా మద్దతు, నాలుగు పథకాలను రద్దు చేసిందని ఇందువల్ల ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వలేక పోతున్నామని కేంద్రం వాదించింది. గమనార్హమైన అంశమేమంటే 2014-15 కేంద్ర బడ్జెట్‌లో 13వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రూ.46,400 కోట్లు వ్యయం చేయబడింది. ఒకవేళ ఏపికి ప్రత్యేక హోదా ఇచ్చినట్లయితే 2015-16 ఒక్క రాష్ట్ర బడ్జెట్‌లోనే దాదాపు రూ.10 వేల కోట్లు కేంద్రం నుంచి అంది వుండేవి. ఈ గణాంకాలన్నీ రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు, ముఖ్యమంత్రికి తెలుసు. ప్రత్యేక హోదా లభించి వుంటే...రాష్ట్ర బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన వివిధ పథకాలకు నిధుల వరద వెల్లువెత్తేది. ఇంత భారీ ఎత్తున ఎపికి నిధులు ఇస్తే బిజెపికి వచ్చే రాజకీయ ప్రయోజనమేమీ లేదు. అందుకే తాజా బడ్జెట్‌లో రాజకీయ ప్రయోజనాలున్న రాష్ట్రాలకు నిధులు పారించారు.

ప్రత్యేక హోదా గాలికి పోగా తుదకు విభజన చట్టాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదు. ఇందులో ప్రధానమైంది రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి. విభజన చట్టం సెక్షన్ 46(3) ప్రకారం గతంలో బుందేల్‌ఖండ్, కోరాపుట్, బోలంగీర్, కలహండిలో అమలు జరిపిన తరహా ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వవలసి వుంది. కోటి జనాభా గల బుందేల్‌ఖండ్‌కు 2009-10 నుంచి ఐదేళ్ల కాలంలో రూ.8 వేల కోట్లు ఖర్చు చేశారు. ఈ తరహాలో వెనుక బడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వబడుతుందని 2014 ఫిబ్రవరి 20వ తేదీ రాజ్యసభలో ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించి వున్నారు. ఇందుకు రాజ్యసభలోని బిజెపి సభ్యులు చప్పట్లు కొట్టారు కూడా. ముఖ్యమంత్రి అయిన తొలి రోజుల్లో చంద్ర బాబు ఐదేళ్ల కాలానికి రూ.24 వేల కోట్లు కావాలని నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు. ఈ అంశంపై కేంద్ర నిర్లక్ష్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. మూడేళ్లకు గాను రూ.1050 కోట్లు విదిల్చి మిన్నకుండిపోయింది. ఎంతవరకు నిజమో కానీ ఈ నిధులు కూడా వ్యయం చేసినట్లు యుసిలు కేంద్రానికి సమ ర్పించనందున కొత్తగా నిధులు విడుదల కాలేదని రాయలసీమ పర్యటన సందర్భంగా బిజెపి నేత పురంధరేశ్వరి ఆరోపించారు. అందుకే పలువురు ఈ మూడేళ్ల కాలంలో కేంద్రం నుంచి వచ్చిన నిధుల గురించి శ్వేత పత్రం విడుదల చేయాలని కోరు తున్నారు. అందుకు ముఖ్యమంత్రి ససేమిరా అంటున్నారు రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46 (2) మేరకు 2014-15 బడ్జెట్ లోటును కేంద్రం సమకూర్చాలి. 14వ ఆర్థిక సంఘం సిఫా ర్సులు కేంద్రం ఆమోదం పొందేలోపు తొలి ఏడాది వనరుల కొరత తీర్చాలని అప్పటి ప్రధాని రాజ్యసభ సాక్షిగా ప్రకటించి వున్నారు. ఈ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికీ కుస్తీ పడుతున్నాయి. విభజన చట్టం సెక్షన్ 94 (3) ప్రకారం రాజ్‌భవన్, శాసనసభ, మండలి, హైకోర్ట్, పరిపాలనా భవనాల వ్యయాన్ని కేంద్రమే భరించాల్సి వుంది. కానీ ముఖ్యమంత్రి అమరావతి అద్భుత రాజధాని నిర్మాణం ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం పిడికెడు మట్టి చెంబుడు నీళ్లు ఇచ్చి సరిపెట్టింది. ఈ అంశంలో ముఖ్యమంత్రి కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేని స్థితిలో వున్నారు. విభజన చట్టం సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ బాధ్యత కేంద్రమే భరించాలి. కానీ ప్రత్యేక ప్యాకేజీ ప్రతిపాదన సందర్భంగా ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే భరిస్తామని కేంద్రం ప్రకటించి తీవ్ర అన్యాయానికి ఒడి కట్టింది. ఇందుకు ముఖ్యమంత్రి ఆనాడు కేంద్రాన్ని ప్రశ్నించలేకపోయారు. తుదకు ఈనాటికి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయం ఎంతో కేంద్రం వద్ద తేల్చుకోలేదు. ఏతా వాతా జరిగిందేమంటే దొంగలే దొంగా దొంగా అని అరుస్తూ ఎపి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. మరీ విచిత్రమేమంటే కేంద్రానికి వ్యతిరేకంగా ఎపిలో ఉద్యమం సాగేందుకు... ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి కేంద్రం దొంగ నాటకాన్ని బహిర్గతం చేసేందుకు ఈనాటికీ ముఖ్యమంత్రి సుముఖంగా లేరు. కేంద్రం ఒడిగట్టిన దురన్యాయాన్ని నిలదీసేందుకు సిద్ధమౌతున్న వామపక్ష ప్రజాతంత్ర శక్తులను, ఇతర ప్రతిపక్షాలను నిరుత్సాహ పరుస్తున్నారు.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013)

చర్చ

వృద్ధులను కాదు
నిరుద్యోగులను నియమించండి



2014 డిసెంబర్ 31 నాటికి ఒక్క రైల్వేలోనే 2.27 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఏడవ వేతన సంఘం చెప్పింది. 2015-16 నాటికి మరో 4.94 లక్షల మంది రిటైర్ అవుతారని ప్రకటించింది. 2016కి రైల్వేలో 7 లక్షల 21 వేల పోస్టులు ఖాళీ అయ్యాయి. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోడీ వాటిని భర్తీ చేయలేదు సరికదా రైల్వేలో ఉద్యోగ విరమణ చేసిన వారి వయోపరిమితిని 62 ఏళ్ల నుండి 65 ఏళ్లకు పెంచుతూ 2017 డిసెంబర్ 2న ఉత్తర్వులిచ్చారు. వారిని రోజు కూలీలుగా రైల్వేలో నియమించుకోమన్నారు. ఇది 2019 సెప్టెంబర్ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అంటే 2019 మోడీ గద్దె దిగే వరకు రైల్వేలో నిరుద్యోగులకు ఉద్యోగం రాదు.

2009లో రైల్వేలో ఉద్యోగ విరమణ చేసిన 62 ఏళ్ళలోపు వారిని రోజు కూలి నిమిత్తం ఐదు నెలల కాలానికి గ్యాంగ్‌మేన్, గేట్‌మ్యాన్, కీమేన్, ట్రాలీమేన్ వంటి ఉద్యోగాల్లో అప్పటి యుపిఏకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారిగా నియమించుకుంది. ఆ తరువాత 2010 నవంబర్‌లో లోకోపైలెట్, గార్డుమేన్‌కు దానిని విస్తరించింది. ఇలా అన్ని పోస్టులకు ఈ విధానాన్ని విస్తరింపజేస్తూ 2011 జనవరి నుండి అమలు చేస్తోంది. అప్పటి నుండి దానిని పొడిగించుకుంటూ వస్తోంది. ఇలా ఖాళీలు నింపకుండా నిరుద్యోగులను మోసం చేసింది.

మోడీ అధికారం చేపట్టి నాలుగేళ్ళు కావస్తోంది. ఆయన చేసిన వాగ్దానం మేరకు ఈ పాటికి 8 కోట్ల ఉద్యోగాలివ్వాలి. కానీ ఈ నాలుగేళ్లల్లో మోడీ ప్రభుత్వం అరకోటి ఉద్యోగాలు ఊడగొట్టింది. వయో పరిమితి మించి పోవడంతో నిరుద్యోగం పెరిగి పోతోంది. దిక్కుతోచని స్థితిలో నిరాశ, నిస్పృహలకు గురైన యువత ఆత్మహత్యలకు పాల్పడుతోంది.

16 లక్షల మంది చేయాల్సిన పనిని అందులో సగం మందితోనే చేయిస్తున్నారు. దీని ఫలితంగా పని ఒత్తిడి పెరిగి రైల్వే వరుస ప్రమాదాలకు గురౌతోంది. వేలాది మంది ప్రజల ప్రాణాలు గాల్లో కలపడానికి మోడీ సిద్ధ పడుతున్నారే తప్ప నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఖాళీలు ఉన్నా నింపకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. పైగా ప్రమాదాలకు కారణం ఉద్యోగుల నిర్లక్ష్యమని తప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఈ తప్పుడు సమాచారాన్నే నీతి ఆయోగ్ కూడా తన అధ్యయనంలో ధ్రువీకరించి, జరుగుతున్న ప్రతి 10 ప్రమాదాల్లో ఆరింటికి రైల్వే సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తేల్చింది.

నాటి మన్మోహన్ నుండి నేటి మోడీ, చంద్రబాబుల వరకు జీతాల ఖర్చులు తగ్గించుకోవాలనే ప్రపంచ బ్యాంకు సలహానే అమలు చేస్తున్నారు. ఒక్క రైల్వేలోనే కాదు. రోడ్డు, విమానం, బ్యాంకులు, ఇన్సూరెన్స్, విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరుతో సహా సర్వం ప్రయివేట్‌పరం చేయడమేకాక రోజుకూలీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వాళ్ళతోనే మోడీ ప్రభుత్వం పని చేయించుకుంటున్నది. అన్నింటా ఉద్యోగ విరమణ చేసిన వారిని నియమించు కుంటున్నారు.

13న రైల్‌రోకో

కాంగ్రెస్ చేసిన పాపాన్ని, పెంచి పోషించి, విస్తృతపరిచి మోడీ నిరుద్యోగులను మోసం చేశారు. యువత ఐక్యంగా పోరాడి ఉద్యోగాలు సాధించాలి. రైల్వేను రక్షించుకోవాలి. దీనికితోడు రైల్వేజోన్ సాధించుకోవాలి. అందుకే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) దేశ వ్యాప్తంగా ఈ నెల 13న రైల్‌రోకోలకు పిలుపునిచ్చింది. రైల్‌రోకోలో యువతీ, యువకులంతా పాల్గొని మోడీకి తమ నిరసన తెలియజేయాలి.

\- ఎం. సూర్యారావు,
డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

జన వాక్యం

సామాజిక చిత్రాలు




ఒకప్పుడు తెలుగు, తమిళ, హిందీ, ఇంకా ఇతర భాషల్లో ఎన్నో విజ్ఞానదాయక చలన చిత్రాలు వచ్చేవి. ఆ చిత్రాలు ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపేవి. నిర్మాణం, కథ, కథనాలు, దృశ్యాలు, పాటలు వంటివి ఎలాంటి విమర్శలకు తావీయకుండా వుండేవి. గొప్ప గొప్ప నిర్మాణ సంస్థలు నవరస భరిత చిత్రాలను అందించేవి. ముఖ్యంగా దేశభక్తి, సామాజిక అంశాలతో పాటు జానపదం, పౌరాణికం వంటి అంశాలు కూడా జనాదరణ పొందేవి. ఆ రోజుల్లో నెలకొన్న ఎన్నో సామాజిక సమస్యలను సైతం చిత్రాల్లో ప్రదర్శించేవారు. అంతేకాదు వాటికి మంచి పరిష్కార మార్గాలు కూడా ఆ చిత్రాల్లో వుండేవి. కానీ నేటి సిన్మాల్లో ఆ స్థాయి కనిపించడం లేదు. ఇప్పటికైనా నిర్మాణసంస్థలు, నిర్మాతలు, దర్శకులు చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి మంచి సిన్మాలు చేయాలి.

జె సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

మార్పు ఇంటి నుండే రావాలి

సంస్కృతి



ఎల్ బుచ్చిరెడ్డి



ప్రస్తుతం దేశంలో యువ భారతం, మానవ వనరుల మీద చర్చ నడుస్తోంది. మానవ వనరులు అనగానే మనకు మొదట స్ఫురించేది యువత. దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉంటుందని వివేకానందుడు ఏనాడో చెప్పారు. యువత ఎలా ఉండాలి? వారి వ్యక్తిత్వం ఎలా నిర్మించబడాలనేది చాలా ప్రాముఖ్యత కలిగిన విషయం. అయితే దీనికి పునాదులు ఇంట్లోనే పడాలి. మనం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో ఉన్నాం. వీటి పర్యవసానాల ఫలితంగానే పలు రంగాలలో కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో కూడా అవి కొనసాగుతాయనేది నిర్వివాదాంశం. ప్రస్తుతం యువత/ బాల్యం అడుగులు సవ్యమైన దిశలో సాగే పరిస్థితుల గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి బీజం ప్రాథమికంగా ఇంట్లోనే పడాలి. ఇంటి భౌతిక, బౌద్ధిక వాతావరణం సానుకూలంగా ఉండాలి. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలి. వారి అవసరాన్ని తీర్చిదిద్దే క్రమంలో వారి ప్రవర్తనను గమనించడం చాలా అవసరం. వారి ఆలోచనలను క్రమ పద్ధతిలో ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలు గణనీయమైన సమయాన్ని పాఠశాలలో గడిపినా ఇంట్లో గడిపే సమయం అంతకంటే ఎక్కువే. వారి ఆలోచనలు, అభిప్రాయాలు, ఆకృతి తీసుకునే క్రమంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

తల్లిదండ్రులే బిడ్డలకు మొదటి గురువులు కాబట్టి బాధ్యతల నుండి తప్పించుకోలేరు. వారికి సమయం కేటాయించాలి. మన దేశంలో పిల్లల పెంపకం మీద పెళ్ళయిన యువతీ యువకులకు సరైన అవగాహన కల్పించే ఎలాంటి శిక్షణా లేదు. అందుకే పిల్లల పెంపకంలో మనం వెనుకటి తరాల కన్నా అంతభిన్నంగా లేమని చెప్పాలి. అతి క్రమశిక్షణ, అతి గారాబం, పిల్లల్ని దండించడం ఇలాంటివి ఇంకా కొన్ని ఇళ్లల్లో చూస్తూనే ఉన్నాం. పెంపకం విషయంలో తగినంత శిక్షణా లోపమే ఇది. ధనార్జన ప్రాముఖ్యత సంతరించుకోవడం మూలాన బిడ్డల మానసిక అభివృద్ధికి సమయం కేటాయించడం లేదు. చదువు, సంపాదన కోసం ఉద్యోగం అనే దృక్పథం పెరగటం, పాఠశాలలు, ఉపాధ్యాయులు ఈ విషయంలో పిల్లలకు తగిన ఆసక్తి కల్పించకపోవడం కొన్ని కారణాలు. సాహిత్యం మీద ఆసక్తి ఉన్న కుటుంబాలను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. కేబుల్ టీవీల ప్రభావం వలన గణనీయంగా పుస్తక పఠనాసక్తి పోయింది. మొబైల్‌ల ప్రభావం వలన దురదృష్టవశాత్తూ పుస్తకాలకు బదులుగా వాట్సప్, ఫేస్‌బుక్‌లను గంటల తరబడి చూడటం మొదలైంది. ఉన్నత చదువులు చదివిన వారి నుంచి సాధారణ స్థాయి విద్యావంతులు కూడా సామాజిక వెబ్‌సైట్లకు దాసోహం అయిపోతున్నారు. బిడ్డల అభివృద్ధి సవ్యంగా ఉండాలంటే పుస్తకాలు చదివించాలి. వారిలో పఠనాసక్తిని పెంచాలి. ఇంటిని గ్రంథాలయంగా మార్చాలి. కథలు, కవితలు, నాటికలు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదివించాలి. సమకాలీన సమాజం పట్ల అవగాహన పెంచే విధంగా చదవడం అవసరం. ముఖ్యమైన విషయాల గురించి చర్చ జరిగే సందర్భంలో చర్చలు ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలి. పెద్దలు తమ అభిప్రాయాలను పిల్లల మీద రుద్ద కూడదు. మన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పాలి. కొత్తగా తెలుసుకున్న విషయాలను నేర్చుకున్న విషయాల నేపథ్యంలో సవరించుకోవడం పిల్లలకు నేర్పాలి.

ఆటలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, అభ్యసించే విధంగా ప్రేరణ కలిగించాలి. వారిలో ఒక కవి, రచయిత, గాయకుడు, చిత్రకారుడు తప్పక ఉంటాడు. వెలికితీసే ప్రయత్నం చేయాలి. సామాజికాంశాల పట్ల ఆసక్తి పెంచాలి. సామాజికాంశాలు చర్చించే సభలకు పిల్లలను తీసుకొని వెళ్ళాలి. వాటి ప్రభావంతో మార్పు వచ్చే అవకాశం ఉంది. నేడు ప్రధానంగా పట్టణ, నగరాల పిల్లలు వ్యసనాల బారిన పడుతున్నారు. పది పన్నెండు సంవత్సరాల పిల్లలు మద్యం సేవించి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తోటి వారిని హింసించి వికృతానందం పొందుతున్నారు. ఇది నెమ్మదిగా గ్రామాలకు పాకింది. కార్పొరేటు విద్యా సంస్థల్లో చదివే పిల్లలు మద్యం, మాదకద్రవ్యాలు సేవిస్తున్న వార్తలు చదువుతున్నాం. మాదకద్రవ్య స్మగ్లర్లు, విక్రేతలు పిల్లలు, యువకులనే లక్ష్యం చేసుకుంటున్నారు. కార్పొరేట్ విద్యాలయాల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ర్యాంకులు, మార్కులే కొలమానంగా భావించే పరిస్థితి దాపురించింది. తీవ్ర ఒత్తిడికి లోనైన విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడుతున్నారు. ఈ మధ్య కాలంలో చిన్న పిల్లల్లో హింసా ప్రవృత్తి ప్రబలుతున్నది. ఆన్‌లైన్ గేమ్స్‌పైన పరిమితులు లేవు. మొబైల్ సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యం విస్తృతమైంది. దీంతో మాదక ద్రవ్యాలు, నీలి చిత్రాల విష సంస్కృతి ప్రబలింది. వీటిని నియంత్రించడంలో సర్కారు నిర్లక్ష్యం వహిస్తోంది. తీవ్రవాదంపై పెట్టాల్సిన ఖర్చు కన్నా, వీటిని అంతమొందించడానికే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. ఎందుకంటే తీవ్రవాదం అత్యంత ప్రమాదకరమైనదైనా, యువతను పెడధోరణిలోకి నెడుతున్న ఈ ప్రేరకాలు అంత కన్నా ప్రమాదకరమైనవి. ఇవి యువతను అచేతనం చేస్తూ అసంఖ్యాక ప్రజలపై జరిగే ఆర్థిక, సాంస్కృతిక దోపిడీల నుంచి దృష్టి మరలిస్తున్నాయి. ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత చర్యలు తీసుకోవు, ప్రజలు ఈ విషయాలు గమనించాలి.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలని ఆశిస్తారు. పిల్లలు, తమకన్నా గొప్పగా జీవితంలో రాణించాలని కోరుకుంటారు. అయితే ఈ ప్రేమలో పడి వారికి కష్టం తెలియకుండా పెంచడం, సరైనదో కాదో ఒక్కసారి ఆలోచించాలి. పిల్లల కోసం డబ్బు సమకూర్చడం ఒక్కటే మన బాధ్యత అవుతుందా! డబ్బు జీవితానికి కావాల్సిన సంతృప్తిని ఎప్పటికీ ఇవ్వలేదు. డబ్బు వేరు. జీవితం వేరు. పిల్లలు శారీరక శ్రమను గౌరవించే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. కొన్ని వృత్తులు శారీరక శ్రమతో కూడుకున్నవైతే మరికొన్ని మానసిక శ్రమతో. శారీరక శ్రమను మానసిక శ్రమను సమానంగా ఆదరించేట్లు మన విద్యా విధానం ఉండాలి. పిల్లలను శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆరాధించేలా తల్లిదండ్రులే తయారు చేయాలి. విద్యలో కూడా అది భాగం కావాలి. చదువు శ్రమ నుండి విముక్తి కలిగిస్తుందనే భ్రమతో పిల్లల్ని పెంచుతున్నాం. శ్రమకు, చదువుకు దూరం పెరుగుతున్నా శారీరక శ్రమ పట్ల చిన్న చూపు, బౌద్ధిక శ్రమపై అపారమైన గౌరవం విద్యా వ్యవస్థలోని పెద్ద లోపాలు. ఇకనైనా మార్కులకు, గ్రేడులకు, ర్యాంకులకు విలువనిచ్చే విద్యా వ్యవస్థ పోవాలి. ప్రతి విద్యార్థిపై శ్రద్ధపెట్టే చదువు, ప్రగతికి శ్రమకి, జీవితానికి శ్రమకు, ఉన్న సంబంధాల్ని ప్రత్యక్షంగా పిల్లలు అనుభవించి, నేర్చుకునే చదువు కావాలి. అప్పుడే చదువు ప్రతి ఒక్కరి వికాసానికి తోడ్పడగలదు. అనుభవం, విజ్ఞానం అందరి సొత్తు. భవిష్యత్ ప్రపంచానికి ప్రతి బిడ్డ తన పాత్రను పోషించే శక్తిని, నైపుణ్యాన్ని అందించే చదువును మనం అందుబాట్లోకి తెచ్చుకోవాలి.

(రచయిత ఏఐఎన్‌విఎస్‌పి గౌరవాధ్యక్షులు)

ఫీడింగ్ బాటిల్స్ వాడుతున్నారా?

పిల్లలకు ఫీడింగ్ బాటిల్స్ ఉపయోగించవద్దని పిల్లల నిపుణులు చెబుతున్నారు. రకరకాల ఫీడింగ్ బాటిల్స్ వాడడం వల్ల పెదవులు, దంతాలు, నోటి అమరికలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని వారు సూచిస్తున్నారు. కారణాలేంటో తెలుసుకుందాం!

రబ్బర్‌లోని కంటికి కనిపించని క్రిముల వలన పిల్లలకు అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. అందుకే పిల్లలకు తల్లి పాలే ఆరోగ్యదాయకం.



అదే ఫీడింగ్ బాటిల్స్ ద్వారా పాలను ఇచ్చేటప్పుడు నాలుక మడత పడుతుంది. తాగిన తర్వాత శ్వాస తీసుకోవడం పిల్లలకు కష్టమవుతుంది. మదర్ ఫీడ్, కప్పుల్లో పాలు తాగే పిల్లల కంటే ఫీడింగ్ బాటిల్స్ ద్వారా పాలు తాగే పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఫీడింగ్ బాటిల్స్ ద్వారా తాగితే పాలతో పాటు గాలి కూడా కడుపులోకి చేరుతుంది. దానివల్ల గ్యాస్ట్రిక్, కడుపుబ్బరం వంటి సమస్యలు ఏర్పడతాయి. బాటిల్ పాలు తాగే పిల్లలు మదర్ ఫీడ్‌కు దూరమవుతారు. ఫీడింగ్ బాటిల్ ద్వారా పాలు తాగితే.. దవడ, దంత సమస్యలు కూడా ఏర్పడతాయి. అలాగే మాటలు సకాలంలో రావు. ఉచ్చారణ సరిగ్గా ఉండదు. దంత వరుసలో మార్పులుంటాయి. ఫీడింగ్ బాటిల్స్ అధికంగా ఉపయోగిస్తే.. డయేరియా వంటి సమస్యలూ ఏర్పడతాయని పిల్లల వైద్యనిపుణులు అంటున్నారు. అందుకే పాల బుడ్డీల కంటే గ్లాసుల ద్వారా పిల్లలకు పాలు పట్టించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అందుకే పిల్లలకు పాలు పట్టించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ★

బ్యాగుల ఎంపికలో జాగ్రత్తలు



మహిళలు బ్యాగులను బాగా ఇష్ట పడతారు. అయితే వాటిని ఎంపిక చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి దుస్తులు ధరించి, మనం వాడే బ్యాగ్ అంతగా నప్పకపోతే మనకూ చూసేవారికీ బాగుండదు. బ్యాగులు మరీ పెద్దవిగా ఉంటే అందరి దృష్టి వాటిపైనే ఉంటుంది. స్టయిల్ రంగు, టెక్చర్‌లను జాగ్రత్తగా ఎంచుకోవాలి. చెయిన్ బ్యాగ్ , యానిమల్ ప్రింట్స్ కూడా ఫ్యాషన్‌లో ఇప్పుడొక భాగం, మెటల్ లేదా ప్లాస్టిక్ చైన్ ఉన్న బ్యాగులను ఎంచుకోవచ్చు. నాసిరకం లెదర్ బ్యాగులనుకాక నాణ్యమైన లెదర్‌ను ఎంపిక చేసుకోండి.



ఆయన ఓ మాజీ ఐఏఎస్ అధికారి. తన సర్వీసులో 25 సార్లకు పైగా.. ఒకచోట నుంచి మరోచోటకు బదిలీ అయ్యారు. ఐఏఎస్‌ల చరిత్రలోనే బహుశా.. ఇదొక రికార్డు! తన విధి నిర్వహణలో నిజాయితీ అనే లక్షణాన్ని మార్గదర్శిగా చేసుకోవడం వల్లనేమో.. ఆయన కలెక్టర్‌గా పనిచేసింది ఒకేఒక్క జిల్లా మెదక్‌లో. అదీ, ఐదు నెలలు మాత్రమే! అయినా, ఎవరికీ ఎక్కడా తలొగ్గలేదు. నీతే శ్వాసగా పనిచేశారు. అందుకే బడుగులు, బలహీనులకు ఆయనో భరోసా అయ్యారు. ప్రజలను అలక్ష్యం చేసే ప్రభుత్వ వ్యవస్థకు, అధికార యంత్రాంగానికి మాత్రం ఆయనంటే ఎప్పుడూ హడలే. ప్రజాసమస్యలపై ఆయన ఏదైనా లేఖాస్త్రం సంధిస్తే స్థానిక, జిల్లా, రాష్ట్ర యంత్రాంగం నుంచి కేంద్ర మంత్రిత్వశాఖల వరకూ గడగడలాడాల్సిందే. ప్రధానమంత్రి కార్యాలయం సైతం.. ఆయన రాసిన లేఖలకు దిగొచ్చి బాధ్యతగా స్పందించాల్సిందే. సమస్య ఎక్కడుంటే.. ఆయన అక్కడుంటారు. ఆయనే మాజీ ఐఏఎస్ అధికారి **ఇఏఎస్ శర్మ.** ఆయన గురించి తెలుసుకుందాం.

అతడొక లేఖాస్త్రం

అందరికీ తెలిసిన పేరు ఇఏఎస్ శర్మ. పూర్తిపేరు ఈమని అనంత సత్యనారాయణ శర్మ. సొంతూరు శ్రీకాకుళం. 2000 సంవత్సరంలో కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా పనిచేసి, స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. కానీ ఈయన గురించి ఇంకా చెప్పాల్సింది చాలానే ఉంది.

న్యాయపోరాటం

ప్రస్తుతం విదేశీ విరాళాల ఉల్లంఘన చట్టంపై బిజెపి, కాంగ్రెస్‌లపై ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు. విదేశీ కంపెనీల నుంచి ఎన్నికల నిధులు ఈ రెండు పార్టీలు కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన విషయంపై తనదైన శైలిలో పోరాడుతున్నారు. గతంలో కేజీబేసిన్‌లో కార్పొరేట్‌లు వేల కోట్లరూపాయల విలువైన చమురును కొల్లగొట్టిన అంశపైనా పోరాడారు. ఇలా చెప్పుకుంటూపోతే అనేకం. ప్రాంతం ఏదైనా సమస్య ఎక్కడుంటే అక్కడ ఆయన ఉంటారు. స్వచ్ఛందంగా పోరాడుతుంటారు.

హక్కుల ఉల్లంఘన జరిగితే?!

విశాఖ కంచరపాలెంలో పేదల గుడిసెలను కూల్చేసిన రైల్వే అధికారులపై, కదిరిలో మహిళ ఇల్లు కూల్చేసిన ఘటనపై, ఎక్కడో హర్యానాలో మహిళా ఐపిఎస్ అధికారిని బిజెపి మంత్రి దుర్భాషలాడిన ఘటనపైనా స్పందిస్తూ.. హక్కుల పోరాటానికి మార్గదర్శిగా నిలిచారాయన. విశాఖజిల్లా పూడిమడకలో కొంతమంది పేదలు వేసుకున్న ఇళ్లు 2017లో అగ్నికి ఆహుతి కాగా, వారికి మానవతాదృష్టితో తనవంతు సాయపడ్డారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన వాటికోసం కేంద్ర ప్రభుత్వస్థాయి వరకూ లేఖలయుద్ధం నడిపారు. ఈయన రాసిన లేఖ వల్ల ప్రతి కుటుంబానికి రూ.18 వేలు మంజూరయ్యాయి. ఇళ్లు నిర్మించుకుందామని ఆ డబ్బులు తీసుకోవడానికి ఆ పేదలంతా బ్యాంకులకు వెళితే.. రూ.2 వేలు కంటే ఎక్కువ ఒక్కొక్కరికీ ఇవ్వలేమని చెప్పడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. కారణం నోట్ల రద్దుతో డబ్బుల్లేవంటూ బ్యాంకు అధికారులు చెప్పడం. దీనిపై శర్మ ఏకంగా రిజర్వుబ్యాంకు గవర్నరు ఉర్జిత్ పటేల్‌కి లేఖాస్త్రం సంధించారు.. 'మీ నిర్ణయం పేదల పొట్ట కొట్టిందనీ, నిలువ నీడ లేకుండా చేసిందంటూ... అనాలోచిత నిర్ణయాలు తగవు' అంటూ ఇఏఎస్ శర్మ లేఖ రాశారు. అంతే హైదరాబాద్ రిజర్వుబ్యాంకు అధికారులకు మరుక్షణంలోనే ఫోను వచ్చింది.. ఆ పేదలకు రూ.18 వేలు దక్కేలా చేసింది.



అధికారులకు అండగా

న్యూస్ ఛానెల్‌లో ఓ సంఘటన (2017లో) ఆయన దృష్టికి వచ్చింది. అది హర్యానా రాష్ట్రంలో దళిత ఐపిఎస్ అధికారిపై బిజెపి మంత్రి ఒక కేసు విషయంలో ఒత్తిడి తేవడం. అందుకు ఆమె నిరాకరించడం. ఆమెకి వెంటనే ఆయన ఫోన్ చేసి, బిజెపి మంత్రి ఏమన్నాడో తాను విన్నాననీ, మీకే భయం లేదంటూ ఐపిఎస్ అధికారిణికి భరోసా ఇచ్చారు. హర్యానా ఎస్సీ ట్రిబ్యునల్‌కి, ఎస్సీ కమిషన్‌కి ఫిర్యాదు చేశారు. ధైర్యంగా ఉండాలంటూ ఆమెకు భరోసా ఇచ్చారు.

మహిళా సమస్యలపై ప్రత్యేకంగా ఒక మహిళా మేనిఫెస్టోను 2019 ఎన్నికల నాటికి శర్మ సిద్ధం చేస్తున్నారు.

ఆలోచనే.. ఓ ప్రజా మేనిఫెస్టో

'ఫోరం ఫర్ బెటర్ విశాఖ' అనే నినాదంతో శర్మ తొలి నుంచీ విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అనేక సమస్యలపై గళం విప్పుతున్నారు. 2014 సంవత్సరం నుంచి మురికివాడలు, ఏజెన్సీ, మత్స్యకార గ్రామాలు, మైదాన ప్రాంతాల్లో గల ప్రజలను కదిలిస్తూ... ఆయా వార్డులు, గ్రామాల్లో మరుగుదొడ్లు, మంచినీరు, పట్టాలు, విద్య, ఉపాధి, వైద్యం వంటి సమస్యలను స్థానికుల చేత గుర్తించేలా సమాయత్తం చేశారు. అక్కడితో ఆయన ఆగిపోలేదు. వారికి శిక్షణ ఇప్పించి, ఫిర్యాదుల రూపంలో పరిష్కారానికిగానూ 'ప్రజా మేనిఫెస్టో'ను రూపొందించారు.

ఈ నేపథ్యంలో 2009-10 సాధారణ ఎన్నికల్లో ఓ మురికివాడలోకి ఓ ప్రధానపార్టీ తరపున అసెంబ్లీకి పోటీచేసే ఓ అభ్యర్థి ఓ చేత్తో మూట (డబ్బు సంచి) మరోచేత్తో బుడ్డీ (మందు సీసా) పట్టుకొచ్చి ప్రజలకు ఎర వేయబోయేసరికి ప్రజలంతా సమస్యలతో తిరగబడ్డారు. వారిని సదరు వ్యక్తి దుర్భాషలాడగా.. వాటన్నింటినీ ప్రజలు సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. వాటన్నింటినీ అప్పటి విశాఖ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి.. పోలీస్ కమిషనర్‌తో సదరు అభ్యర్థిపై చర్యలు తీసుకునేలా చేశారు.

ఉద్యమ స్ఫూర్తితో ప్రజా మేనిఫెస్టో తయారీలో ప్రస్తుతం ఇఏఎస్ శర్మ నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఒడిశా రాష్ట్రం మాచ్‌కొండ రిజర్వాయర్ ఒడ్డున (నక్సల్స్ ప్రభావిత గ్రామాల్లో) ఆదివాసీలతో చర్చించి, ఆదివాసీ మేనిఫెస్టోను.. విశాఖ నగరంలోని కొమ్మాది, సేవానగర్, కంచరపాలెం దళితులు, పేదల సమస్యల చిట్టాతో ఇంకో మేనిఫెస్టోను.. మద్యం, బెల్టు షాపులు, మహిళా సమస్యలపై ప్రత్యేకంగా ఒక మహిళా మేనిఫెస్టోను 2019 ఎన్నికల నాటికి శర్మ సిద్ధం చేస్తున్నారు. పోటీచేసే వారు వీటిని దాటిపోలేరని శర్మ అంటారు.

నూటికో...కోటికో

హక్కుల ఉద్యమాల్లో ఏపి, తెలంగాణ హైకోర్టుల్లోనేగాక, ఢిల్లీ హైకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేశారు. అమరావతిపై ఎన్‌జిటిలో వేసిన కేసుతో 'అమరావతి మా పర్యవేక్షణలో జరగాలంటూ ఎన్‌జిటి ఉత్తర్వులిచ్చింది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో గిరిజనులను ఊచకోత కోసి, వారి హక్కులను ఉల్లంఘించే 'సల్వాజుడుం' (ప్రైవేట్ సైన్యం) రాజ్యాంగ విరుద్ధమంటూ.. నిజనిర్ధారణ కమిటీగా ఆ రాష్ట్రంలో పర్యటించి, సమగ్రమైన నివేదికను రూపొందించారు. దీంతో ఈయనపై నిరాధార ఆరోపణలు చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రయత్నించారు. అయితే సుప్రీంకోర్టు వారికే మొట్టికాయలు వేసింది. ఆయన టీమ్ చెప్పింది సరైనదంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు మూడు పేజీల జడ్జిమెంట్ ఇవ్వడం విశేషం.

పర్యావరణ పరిరక్షణ, మురికివాడల్లో ప్రజల జీవన ప్రమాణాల కోసం, గిరిజన హక్కులు, మానవహక్కుల ఉద్యమాల్లోనూ, ఎన్నికల సంస్కరణలు జరగాలంటూ, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఇలా ఏ విషయంపై, ఏ రూపంలో ముందడుగు వేసినా.. ఆయన తాపత్రయం అంతా.. పేదలు, బడుగులకు న్యాయం జరగాలన్నదే. దటీజ్ గ్రేట్‌నెస్ ఆఫ్ శర్మ.

- ఎన్. మధుసూదనరావు,
విశాఖపట్నం.

తరిగిన కూరగాయలు తాజాగా ఉండాలంటే?!

ఉద్యోగం చేసేవారు ఇటు ఇంటిపని, అటు ఆఫీసు పనులతో సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. అదే క్రమంలో ప్రతిరోజూ ఉదయం వంట చేయడానికి ముందు కాయగూరలు కట్ చేయడానికి కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. అందుకే కొందరు ముందే కట్ చేసి పెట్టుకుంటారు. అయితే ఇలా కట్ చేసిన కూరగాయలు కొన్నిరకాలు తాజాగానే ఉన్నా...మరికొన్ని మాత్రం పాడవుతాయి. మరి కట్ చేసిన కూరగాయలను ఇలా భద్రపరచుకోవాలి.

ఆకుకూరలు

ఆకుకూరలు ఫ్రిజ్‌లో భద్రపరచడానికి ముందే వాటి ఆకులను, కొమ్మల నుంచి వేరుచేయాలి. ఈ విధంగా చేసిన ఆకుల్లో ఎండిపోయినవి, వాడిపోయినవి, కుళ్లినట్లు కనిపించే వాటిని ఏరేసి పక్కకు తీయాలి. ఇప్పుడు మిగిలిన తాజా ఆకుల్ని ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. దీనికోసం ఒక పేపర్ టవల్ లేదా పలుచని నూలువస్త్రం తీసుకుని అందులో ఈ ఆకుల్ని చుట్టేసి ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు. అయితే ఈ ఆకుకూరలు సాధారణంగా రెండురోజులు మాత్రమే తాజాగా ఉంటాయి.

ఉల్లిపాయలు: ఉల్లిపాయలు కోసిన వెంటనే వాటిని గాలి తగలని డబ్బాల్లో వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి. అయితే ఈ ఉల్లిపాయ ముక్కల్ని ఒక రోజు లోపల



వినియోగించుకోవడం తప్పనిసరి. ఆ తర్వాత అవి వాటి తాజాదనాన్ని కోల్పోతాయి.

కీరదోసకాయలు: కీరదోసకాయ ముక్కలు ఎక్కువ సమయం బయట ఉంచకూడదు. అందుకే గాలి తగలని డబ్బాల్లో వేసి భద్రపరుచుకోవాలి. ఇలా చేస్తే కీరదోస ముక్కలు మూడు రోజులపాటు తాజాగా ఉంటాయి.

దుంపలు: బంగాళదుంప, ముల్లంగి, క్యారెట్లులాంటి దుంపలను కట్ చేసి ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో భద్రపరచడంవల్ల అవి వాటి మృదుత్వాన్ని కోల్పోతాయి. అలాగే వాటి రంగు కూడా మారిపోతుంది. దుంపజాతి కూరల్లో ఉండే తేమశాతం త్వరగా తగ్గిపోవడం వల్ల వాటి రుచి కూడా తగ్గిపోతుంది. కాబట్టి ఇలాంటివి కట్ చేసిన వెంటనే ఒక గిన్నెలో నీరుపోసి, అందులో కట్ చేసిన కూరలువేసి వదులైన మూతపెట్టి భద్రపరుచుకోవాలి. అయితే ఇవి కేవలం ఒకరోజు మాత్రమే ఉంటాయి. కాబట్టి వండుకోవడానికి ఒక రోజు ముందు మాత్రమే వాటిని కట్ చేసుకోవడం ఉత్తమం.

టమాటా ముక్కలు: కట్ చేసిన టమాటా ముక్కలు ఎక్కువసేపు నిల్వ ఉండవు. ఒకవేళ వీటిని భద్రపరచాలనుకుంటే ఒక గిన్నెలో వాటిని వేసి, పైన వదులుగా ఉన్న మూత పెట్టాలి. అయితే ఇలా భద్రపరచినవి కేవలం 24 గంటలు మాత్రమే తాజాగా ఉంటాయి.

అల్లం వెల్లుల్లి: తొక్క తీసేసినవి కట్ చేసి విడివిడిగా గాలి తగలని బాక్స్‌లో భద్రపరుచుకోవాలి. ఇవి దాదాపు ఐదు రోజుల వరకూ తాజాగా ఉంటాయి.

వంకాయలు: సాధారణంగా వంకాయలు కట్ చేసిన కాసేపటికే రంగు మారిపోవడం మనం గమనిస్తుంటాం. అయితే వాటిమీద పసుపు, నిమ్మరసం కలిపిన నీటిని చల్లితే అవి రంగు మారకుండా తాజాగా ఉంటాయి. అలాగే కట్ చేసిన వంకాయల్ని ఫ్రిజ్‌లో భద్రపరుచుకోవాలని అనుకుంటే వాటిని గుండ్రంగా కట్ చేసుకుని, ఆ ముక్కల్ని పేపర్ టవల్స్ మధ్య వేసి ఒక డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఇలా చేస్తే వంకాయ ముక్కలు రెండురోజుల పాటు తాజాగా ఉంటాయి.

క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రొకోలీ: క్యాబేజీ వంటి కాయగూరల్ని కట్ చేసిన వెంటనే ఒక ప్లాస్టిక్ కవర్‌లో వేసి ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. క్యాలీఫ్లవర్, బ్రొకోలీ వంటి కూరగాయలు కట్ చేసినప్పటికీ వాటిలో తేమని అంత తొందరగా కోల్పోవు. అందుకే క్యాలీఫ్లవర్ గాలి తగలని వాటిలో వేసి భద్రపరుచుకోవాలి. బ్రొకోలీని ముక్కలుగా చేసి తర్వాత నెట్‌తో ఉన్న కవర్స్‌లో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువసేపు తాజాగా ఉంటాయి.

మిరపకాయలు: కట్ చేసుకున్న తర్వాత వీటినీ గాలి తగలని వాటిల్లో భద్రపరుచుకోవాలి. వీటికి తడి తగిలితే జిగురుగా మారి, త్వరగా పాడైపోతాయి. ★

మీ కోసం



పురుగు కుడితే వచ్చే దద్దుర్లపై అరటితొక్కతో రుద్దితే దురద, వాపు తగ్గుతాయి.

జీవన సౌరభం

మిత్రులు ఆనందంగా ఉన్నప్పుడు పిలిస్తే వెళ్ళాలి. కష్టాల్లో ఉన్నప్పుడు పిలవకున్నా వెళ్ళాలి !!

ఫ్లీడర్‌గారూ! నాకు రెండేళ్లక్రితం పెళ్లయింది. పిల్లలు లేరు. డాక్టరు పరీక్ష చేసి మా ఆయనలో లోపం ఉందన్నారు. మా అత్త గారు అవేమీ నమ్మకుండా నాలోనే లోపముందని, నాకు విడాకులిచ్చి, ఆయనకి వేరే పెళ్లి చేస్తామంటున్నారు. అలా విడాకులిస్తారా?

- కమల, పార్వతీపురం.

ఆయనకి వేరే పెళ్లి చేస్తామంటున్నారు!


న్యాయ సూత్రం

సంతానం కలగకపోవటానికి కారణం మీ భర్త లోపమేనని పరీక్షల్లో తేలినప్పుడు.. మీ భర్త తన తల్లికి ఆ విషయం గట్టిగా చెప్పాలి. మిమ్మల్ని తన తల్లి నిందిస్తున్నా, మీకు విడాకులిస్తామంటున్నా తనకి మరోపెళ్లి చేస్తామన్నా మిన్నకుంటున్నాడంటే, అతని మనసులోనూ ఇంకో పెళ్లి మీద ఆసక్తి ఉందన్నమాట. భార్యభర్తల అనుబంధాలు ఇలా సున్నితంగా, బలహీనంగా ఉంటున్నాయంటే అది మనపెద్దల సంస్కారలోపం. మీ అత్తగారి కుమార్తెకు ఇలా జరిగితే, విడాకులిప్పించి మరో పెళ్లిచేస్తామని అల్లుడు తరపువారు అంటే ఒప్పుకుంటుందా? భరించగలదా?



అందుకే పెద్దలు అంటారు. తనకో న్యాయం, ఇతరులకో న్యాయం ఉండకూడదనీ. మీరేమీ భయపడకండి. సంతానలేమీ విడాకుల కారణం కాదు. మీ భర్త లోపంతో ఉన్న వైద్యపరీక్షల కాగితాలు మీదగ్గర భద్రంగా ఉంచుకోండి. మీ భర్త విడాకులకు వేస్తే మీరు తిరస్కరిస్తూ, అసలు వాస్తవాల్ని రుజువులతో కోర్టుకి వివరించండి. లాయరు సాయం తీసుకోండి. మీకు న్యాయం జరుగుతుంది. ఈ కారణంగా గృహహింసకి పాల్పడితే ఐపిసి 498ఎ కేసు పెట్టండి.

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com



సెన్సెక్స్ ⬆ 330
34,413

నిఫ్టీ ⬆ 100
10,576

రూపాయి ⬇ 04 పైః
అమెరికా డాలరుకు రూ.
64.25

భారీ జరిమానా

ఆన్‌లైన్ సెర్చ్ విషయంలో అక్రమ వ్యాపార విధానాలను అవలంభించి నందుకు గూగుల్ సంస్థకు సీసీఐ రూ.136 కోట్ల మేర జరిమానాను విధించింది.



గూగుల్‌కు రూ.136 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ఇంటర్‌నెట్ దిగ్గజం గూగుల్ సంస్థకు భారత్‌లో అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. భారత మార్కెట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సెర్చ్ విషయంలో అక్రమ వ్యాపార విధానాలను అవలంభించి నందుకు గాను ఆ సంస్థకు 'కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' (సీసీఐ) రూ.136 కోట్ల మేర జరిమానాను విధించింది. మ్యాట్రిమోని డాట్ కామ్, కన్జ్యూమర్ యూనిటీ అండ్ ట్రస్ట్ సొసైటీలు 2012లో గూగుల్ ఎల్ఎల్‌సీ, గూగుల్ ఇండియా, గూగుల్ ఐర్లాండ్ సంస్థలపై ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదును విచారణకు తీసుకున్న సీసీఐ సంస్థ గూగుల్ నమ్మకానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం అనే నిబంధనను ఉల్లంఘించినందుకు గాను జరిమానా విధించాలని నిర్ణయిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ఆన్‌లైన్ సెర్చ్ అంశంలో మార్కెట్లో ఆధిపత్య స్థానంలో ఉన్న గూగుల్ సంస్థ వివిధ అంశాల సెర్చ్ ఫలితాలను ప్రకటించే విషయంలో వాస్తవాలకు దూరంగా.. కొన్ని సంస్థలకు కొమ్ముకాసే విధంగా ఫలితాలను అందించడం ద్వారా అక్రమాలకు పాల్పడినట్టు పేర్కొంది. ఇందుకు గాను ఆ సంస్థ 2013 నుంచి 2015 వరకు భారత్‌లోని కార్యకలాపాల ద్వారా గూగుల్ సంస్థ ఆర్జించిన సగటు మొత్తం ఆదాయంలో 5 శాతాన్ని జరిమానాగా విధించినట్టుగా సీసీఐ వెల్లడించింది.

క్రిప్టో సంపన్నుల జాబితాలో క్రిస్ లార్సెన్!

- **7.5-8 బిలియన్ డాలర్లతో అగ్రస్థానం: పోర్బ్స్ వెల్లడి**



రైపిల్ సహ వ్యవస్థాపకులు క్రిస్ లార్సెన్

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో కరెన్సీల విలువ అంతకంతకు క్షీణిస్తున్నాయి. దీంట్లో ముఖ్యంగా బిటకాయిన్ జెట్ స్పీడ్ వేగంతో విలువను కోల్పోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం క్రిప్టో కరెన్సీ అత్యంత సంపన్నుల జాబితాను ప్రముఖ పత్రిక పోర్బ్స్ వెల్లడించింది. ఈ జాబితాలో రైపిల్ సహ-వ్యవస్థాపకులు క్రిస్ లార్సెన్ 7.5-8 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీతో అగ్రస్థానంలో నిలిచినట్టు పోర్బ్స్ వెల్లడించింది. మరోవైపు ఈ చట్ట సమ్మతం కానీ ఈ కర్సెనీల విలువ మాత్రం అంతకంతకు పెరుగుతుండటం విశేషం. పోర్బ్స్ అంచనా ప్రకారం..2017లో బిట్‌కాయిన్, ఇథెరియమ్, ఎక్స్ఆర్‌పీ వంటి మూడు సాధారణ క్రిప్టో కరెన్సీలు సగటున 14,409శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. ప్రస్తుతం దాదాపు 1500 క్రిప్టోఅసెట్స్ ఉనికిలో ఉన్నాయని పోర్బ్స్ పత్రిక విశ్లేషించింది. ఇక ఈ జాబితాలో జోసెఫ్ లుబిన్ క్రిప్టో నికర విలువ (1-5 బిలియన్ డాలర్లు), చాంగ్‌పెంగ్ జాహో (1.1-2 బిలియన్ డాలర్లు), కెమెరాన్ అండ్ టెలర్ వింక్లేస్స్ (900 మిలియన్- 1.1బిలియన్ డాలర్లు), మాథ్యు మెల్లన్ (900 మిలియన్- 1.1బిలియన్ డాలర్లు) సంపదతో ఉన్నారు. కాగా ఈ జాబితాలో మరికొంత మంది కూడా ఉన్నట్టు పోర్బ్స్ తెలిపింది.

ఎయిరిండియాకు నిర్వహణ లాభాలు..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా (ఏఐ) సంస్థ క్రమంగా తన పనితీరును మెరుగుపరచుకుంటూ లాభాల బాటలోకి వస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ఏఐ నిర్వహణ లాభం రెండింతలు పెరిగి రూ.298 కోట్లకు చేరిందని ప్రభుత్వం వెల్లడించింది. 2015-16లో ఏఐ ఆపరేటింగ్ ప్రాపిట్ రూ.105 కోట్లుగా ఉందని తెలిపింది. అయితే గతేడాది ఏఐ నికర నష్టాలు మాత్రం భారీగా పెరిగి రూ.5,765 కోట్లకు చేరుకున్నాయి. ఇక అంతకు ముందు ఏడాది సంస్థ నికర నష్టం రూ.3,836 కోట్లుగా నమోదైంది. ప్రభుత్వ టౌర్నరౌండ్ ప్రణాళికలో భాగంగా ఎయిరిండియా ఆర్థిక, నిర్వహణ పనితీరు క్రమంగా వృద్ధి చెందుతోందని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా గురువారం లోక్ సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా తెలిపారు. టౌర్న రౌండ్‌లో భాగంగా ఏఐ మార్గాలను హేతుబద్ధీకరించడంతో పాటు విమాన ఉపయోగాన్ని మెరుగుపర్చేందుకు వివిధ చర్యలు చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. కాగా 2016-17 సంవత్సరానికి ఎయిర్‌లైన్ మొత్తం రణాలు రూ.48,447 కోట్లుగా నమోదు కాగా.. ఇందులో ఎయిర్ క్రాఫ్ట్, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు వరుసగా రూ.17,359 కోట్లు, రూ.31,087 కోట్లుగా ఉన్నట్టు వివరించారు.

హమ్మయ్య.. ఎట్టకేలకు లాభాల్లోకి!!

- వరుసగా ఏడు సెషన్ల నష్టాలకు బ్రేక్
- 330 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 10,500 ఎగువకు ఎన్ఎస్ఈ నిఫ్టీ



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల బాట పట్టాయి. బడ్జెట్ ప్రకటనల ప్రభావంతో పాటు.. అంతర్జాతీయ ఒత్తిళ్ల కారణంగా వరుసగా గత ఏడు సెషన్ల నుంచి కుదేలవుతూ వస్తోన్న మార్కెట్లు గురువారం ఎట్టకేలకు కోలుకున్నాయి. దాదాపు అన్ని రంగాల్లో కొనుగోళ్ల ధోరణి కనిపించింది. ఔషధ రంగ కంపెనీల షేర్ల ర్యాలీతో నేడు స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. దీంతో బడ్జెట్ సెషన్ నుంచి నష్టాలను నమోదు చేస్తున్న మార్కెట్లకు కొంచెం ఊరట లభించినట్టయింది. మార్కెట్ సూచీలు రోజంతా భారీ లాభాలలోనే కదిలాడాయి. సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 34,413 పాయింట్ల వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 100 పాయింట్లు లాభపడి 10,577 పాయింట్ల వద్ద ముగిసింది. ఫార్మా రంగం టాప్ విన్నర్‌గా నిలవగా.. పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ, మెటల్, ఐటీ, ఆటో రంగాల షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. సిప్లా షేర్లు 6 శాతానికి పైగా లాభపడగా.. సన్ ఫార్మా, అంబుజా సిమెంట్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు మూడు శాతానికి పైగా రాణించాయి. మరో పక్క ఐటీ సంస్థలు కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ 3 శాతం, టెక్‌మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్‌లు రెండు శాతం వరకు పెరిగాయి. షార్ట్ కవరింగ్‌లు జరగడంతో మార్కెట్లు లాభపడ్డాయని నిపుణులు చెబుతున్నారు. మరోపక్క ఆసియా మార్కెట్లు లాభాల్లో ట్రేడవగా.. యూరప్‌లోని ప్రధాన మార్కెట్లు నష్టాల్లో కదలాడాయి. అరబిందో ఫార్మా, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, ఆదానీ పోర్ట్స్, ఐటీసీ, టాటా మోటార్స్, హిందాల్కో, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

ఏసీసీ లాభాలు అదుర్స్



చెన్నై: సిమెంట్ తయారీ దిగ్గజం ఏసీసీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి మేటి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో సంస్థ లాభం 126 శాతం వృద్ధి చెంది రూ.206 కోట్లకు చేరుకుంది. మార్కెట్ వర్గాల అంచనాలను మించి కంపెనీ మేటి ఆర్థిక ఫలితాలను ప్రకటించడం విశేషం. ఇదే కాలంలో సంస్థ నికర అమ్మకాలు 30 శాతం మేర పెరిగి రూ.3417 కోట్లకు చేరుకున్నాయి. ఫలితాల నేపథ్యంలో ఈ కంపెనీ షేర్లు మార్కెట్లో హల్‌చల్ చేశాయి. ఒక దశలో ఈ స్టాక్ దాదాపు 3 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. మేటి ఫలితాల నేపథ్యంలో కంపెనీ బోర్డు షేరు ఒక్కింటికి రూ.15ల డివిడెండ్‌ను ప్రకటించింది.

స్మార్ట్‌ఫోన్ @ రూ.500..!

- రూ.60-70 రీచార్జ్‌కే మేటి ఆఫర్లు
- 'ఫీచర్'ఫోన్ వాడకందారులే లక్ష్యం
- జియో పోటీ సంస్థల కొత్త ఎత్తుగడ
- చర్చల్లో ఎయిర్‌టెల్, ఐడియా. వొడా



ముంబయి : దేశీయ టెలికాం రంగంలో పోటీ రానురాను మరింత తీవ్రతరం అవుతోంది. మార్కెట్లో గట్టి పోటీదారే లేకుండా చేసుకోవాలన్న వ్యూహంతో రిలయన్స్ జియో ఇన్ఫో కామ్ పావులు కదుపుతుంటే.. బరిలో నిలిచేందుకు పోటీ సంస్థలు కూడా శాయశక్తులా కృషి చేస్తున్నాయి. తమతమ వ్యూహాల్లో భాగంగా జియో సంస్థ ఇటీవల మార్కెట్‌లో తమ వాటాను పెంపొందించుకొనే వ్యూహంలో భాగంగా సబ్సిడీ ధరలకే 4జీ ఫీచర్ ఫోన్లను అందిస్తుండడం.. కేవలం రూ.49 నుంచి మొదలుకొని రూ.153ల స్వల్ప ధరల ప్లాన్‌లతో అపరిమిత కాలింగ్ సౌలభ్యం, 28 రోజల పాటు రోజుకు 1 జీబీ డేటాను అందించే ఆకర్షణీయమైన పథకాలను తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యం లోనే పోటీ సంస్థలైన ఎయిర్‌టెల్, ఐడియా, వొడాఫోన్ సంస్థలు కూడా మార్కెట్లో పట్టు నిలుపుకొనేందుకు గాను త్వరలోనే రూ.500ల కంటే తక్కువ ధరకే 4జీ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసే వ్యూహంలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇందుకోసం ఆయా సంస్థలు మొబైల్ కంపెనీలతో చర్చిస్తున్నట్లు సమాచారం. అంతేగాక.. నెలకు రూ.60 నుంచి 70 రీచార్జ్‌తోనే అధిక డేటా, వాయిస్ కాల్ ఆఫర్లను ఇవ్వాలని యోచిస్తున్నాయని తెలుస్తోంది.

ఎందుకంత తక్కువకంటే..

దేశంలో అత్యధిక జనాభా దిగువ మధ్య తరగతి, పేద కుటుంబాలలోనే ఉన్నారు. వీరు ఎక్కువగా మొబైల్ ఫోన్లను వాయిస్ కాల్స్ నిమిత్తమే వాడుతూ వస్తున్నారు. ఇందు కోసం 2జీ ఆధారితంగానే పని చేసే వాయిస్ సేవలను వీరు ఎక్కువగా వినియో గిస్తున్నారు. దాదాపు 100 కోట్లకు పైగా ఉన్న మొబైల్ వాడకందారుల్లో వీరి వాటా సుమారు 65 నుంచి 70 కోట్ల వరకు ఉంది. టెలికాం రంగానికి మొత్తం వస్తున్న ఆదా యంలో దాదాపు సగం రెవెన్యూ ఈ ఫీచర్‌ఫోన్ వినియోగ దారుల నుంచే వస్తుండడం విశేషం. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు సంపన్నులు ఇప్పటికే అత్యాధునిక టెలికాం సేవల నిమిత్తం స్మార్ట్‌ఫోన్లను వాడేస్తున్నారు. వేగవంతమైన డేటా నిమిత్తం వీరిలో చాలా మంది 4జీ సేవలకు అప్‌డేట్ అయి పోయారు కూడా.

ఈ నేపథ్యంలో స్మార్‌ఫోన్ల వాడకం దారుల మార్కెట్ గరిష్ట స్థాయికి విస్తరించింది. ఇకపై ఈ విభాగంలో చెప్పుకోదగ్గ వృద్ధి నమోదు కావడానికి అవకాశం లేదు. దీంతో తాజాగా టెలికాం సంస్థలన్నీ ఫీచర్ ఫోన్ల వాడకందారుల వైపు దృష్టి సారిస్తున్నాయి. తక్కువ ధరకు మేటి ఫ్రీ వాయిస్ సేవలతో పాటు డేటా పీచర్లను కూడా రుచి చూపించి తమ మార్కెట్‌ను విస్తృత పరుచుకోవాలని టెలికాం సంస్థలు పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగానే తక్కువ ధరకే ఇంటర్‌నెట్ సౌకర్యంతో కూడిన ఫీచర్ ఫోన్‌ను అందించేందుకు జియో సంస్థ ముందుకు రాగా.. తమ వినియోగదారులను కాపాడుకొనేందుకు ఇప్పుడు మిగతా టెలికాం సంస్థలు రూ.500ల కంటే తక్కువకే స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నాయి.


MATHAMETICS FOR TET



S.LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

PRACTICE PAPER - 1

Time AND Work



Important Facts And Formulas

1. If a can do a piece of work in n days, Then A's 1 day's work = 1/n
2. If A's 1 day's work = 1/n, then A can Finish the work in n day's.
3. If A is Thrice as good a workman as B, Then :
Ratio of work done by A and B = 3:1.
Ratio of time taken by A and B to finish a work = 1:3.

---

1. A does a work in 10 days and B does the same work in 15 days. In how many days they to gether will do the same work?
a) 5 days b) 6 days
c) 8 days d) 9 days

2. A can Finish a work in 18 days and B can do the same work in half the time taken by A. Then working together what part of the same work they can finish in a day?
a) 1/6 b) 1/9 c) 2/5 d) 2/7

3. A tyre has two punchers. the first puncher alone would have made the tyre flat in 9 minutes and the second alone would have done it in 6 minutes. if air leaks out at a constant rate, how long does it both the punchers together to make it flat ?
a) 1 ½ minutes b) 3 ½ minutes
c) 3 3/5 minutes d) 4 ¼ minutes

4. a, b and c can compleate a peice of work in 24,6 and 12 days respectively. working together, the woii compleate to same work in..
a) 1/24 days b) 7/24 days
c) 3 3/7 days d) 4 days

5. A man can do a job in 15 days. His father takes 20 days and his son finishes it in 25 days. How long will they take to compleate the job if they aii work together ?
a) Less than 6 days
b) Exactly 6 days
c) More than 10 days
d) Approximately 6.4 days

6. A man can do a piece of work in 5 days. but with the help of his son, he can do it in 3 days. In what time can the son do it alone ?
a) 6 1/2 days b) 7 days
c) 7 1/2 days d) 3 days

7. A can lay railway track between two given stations is 16 days and b can do the same job in 12 days. with the help of c, they did the job in 4 days only. Then c alone can do the job in.
a) 9 1/5 days b) 9 2/5 days
c) 9 3/5 days d) 10 days

8. A takes twice as much time as b or thrice as much time to finish a peice of work. Working together, they can finish the work in 2 days. B can do the work alone in..
a) 4 days b) 6 days
c) 8 days d) 12 days

9. X can do ¼ of a work in 10 days. Y can do 40% of the work in 40 days and Z can do 1/3 of the work in 13 days. Who will complete the work first?
a) X b) Y
c) Z d) X and Z both

10. P,Q and R are three typists who working simultaneously can type 216 pages in 4 hours. In one hour, R can type as many pages more than Q as Q can type more than P. During a period of fie hours, R can type as many pages as P can during seven hours. How many pages does each of them type per hour ?
a) 14,17,20 b) 15,17,22
c) 15,18,20 d) 16,18,22

11. Ronald and Elan are working on an assignment. Ronald takes 6 hours to type 32 pages on a computer, while Elan takes 5 hours to type 40 pages. How much time will they take, working together on two different computers to type an assignment of 110 pages?
a) 7 hours 30 minutes
b) 8 hours
c) 8 hours 15 minutes
d) 8 hours 25 minutes

12. Two workers A and B are engaged to do a work. A working alone takes 8 hours more to complete the job than if both worked together. If B worked alone, he would need 4 ½ hours more to complete the job then they both working together. what time would they take to do the work together?
a) 4 hours b) 5 hours
c) 6 hours d) 7 hours

13. P can complete a work in 12 days working 8 hours a day. Q can complete the same work in 8 days working 10 hours a day. If both P and Q work together, working 8 hours a day, in how many days can they complete the work?
a) 5 5/11 b) 5 6/11
c) 6 5/11 d) 6 6/11

14. A and B can do a work in 12 days, B and C in 15 days. C and A in 20 days. If A,B and C work together, they will complete the work in ?
a) 5 days b) 7 5/6 days
c) 10 days d) 15 2/3 days

15. A and B can do a work in 8 days, B and C can do the same work in 12 days. A,B and C together can finish it in 6 days. A and C together will do it in..?
a) 4 days b) 6 days
c) 8 days d) 12 days

16. A and B can do a peice of work in 72 days. B and C can do it in 120 days. A and C can do it in 90 days. In what time can A alone do it ?
a) 80 days b) 100 days
c) 120 days d) 150 days

17. A and B can do a peice of work in 5 days. B and C can do it in 7 days. A and C can do it in 4 days. who among these will take the least time if put to do it alone?
a) A b) B
c) C d) Data inadequate

18. A can do a peice of work in 4 hours. B and C together can do it in 3 hours, while A and C together can do it in 2 hours. How long will B alone take ti do it ?
a) 8 hours b) 10 hours
c) 12 hours d) 24 hours

19. A can do as certain work in the same time in which B and C together can di it. If A and B together could do it in 10 days and C alone in 50 days, then B alone could do it in ?
a) 15 days b) 20 days
c) 25 days d) 30 days

20. A works twice as fast as B. If B can complete a work in 12 days independently, the number of days in which A and B can together finish the work is ?
a) 4 days b) 6 days
c) 8 days d) 18 days

★

Answer:

1. b	2. a	3. c	4. c	5. c
6. a	7. c	8. b	9. c	10. c
11. c	12. c	13. a	14. c	15. c
16. c	17. a	18. c	19. c	20. a

ఉద్యోగాలు

ఏఎల్ఐఎంసీవోలో 64 ఉద్యోగాలు

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా పనిచేసే ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో). ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న తమశాఖల్లోని 64 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్)-1, మేనేజర్-2 (ఫైనాన్స్-1 + ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (సివిల్)-1), డిప్యూటీ మేనేజర్-2 (మార్కెటింగ్-1 + మెటీరియల్ మేనేజ్‌మెంట్-1), అసిస్టెంట్ మేనేజర్-2 (ప్రొడక్షన్-1 + డిజైన్ అండ్ డెవలప్‌మెంట్-1), మార్కెటింగ్ ఆఫీసర్-1, ఆర్ అండ్ డీ ఇంజనీర్-1, స్టోర్ ఆఫీసర్-1, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-2, క్యాసీ అసిస్టెంట్ (మెకానికల్/ ఎలక్ట్రికల్)-3, స్టెనోగ్రాఫర్-1, జూనియర్ క్లర్క్/ అసిస్టెంట్-8, జూనియర్ స్టోర్ కీపర్-1, అసెంబ్లర్-3, ఫిట్టర్-9, మెషినిస్ట్-2, ఎలక్ట్రీషియన్-3, టర్నర్-3, మిల్‌రైట్-2, ప్లాంట్ ఆపరేటర్-6 (బాయిలర్-5 + డీజీ సెట్-1), ప్రెస్ ఆపరేటర్-1, ఎలక్ట్రోప్లేటర్-2, ఉడ్ వర్కర్/ కార్పెంటర్-4, వెల్డర్-1, పైప్ ఫిట్టర్ (ప్లంబర్)-1, పాలిషర్-2.

వేతన శ్రేణి : సీనియర్ మేనేజర్-రూ.32,900-58,000, మేనేజర్-రూ.29,100-రూ.54,500, డిప్యూటీ మేనేజర్-రూ.24,900-రూ.50,500, అసిస్టెంట్ మేనేజర్-రూ.20,600-రూ.46,500, మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్), -రూ.12,600-రూ.32,500, క్యాసీ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/ అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-రూ.7,300-రూ.16,300, పాలిషర్-రూ.6,720-రూ.14,950, మిగిలిన పోస్టులకు రూ.7,010-రూ.15,600.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ/ సీఏ/ ఐసీఏ/ ఇంజనీరింగ్ డిప్లొమా/ డిగ్రీ/ ఐటీఐ/ పదోతరగతి. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.

వయసు : సీనియర్ మేనేజర్‌కు 49 ఏళ్లు, మేనేజర్-46 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్-43 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్-40 ఏళ్లు, మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-34 ఏళ్లు, క్యాసీ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/ అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-32 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : పోస్టులను బట్టి రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు : 'మేనేజర్', మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-రూ.500, మిగిలిన పోస్టులకు రూ.250, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 28, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.alimco.in

బీఆర్‌బీఎన్ఎంపీఎల్‌లో ఏడు ఖాళీలు

బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేటు లిమిటెడ్ (బీఆర్‌బీఎన్ఎంపీఎల్). 7 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు : అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం).

వేతనం : రూ.58,905.

విభాగాల వారీ ఖాళీలు : ఇంక్ మ్యానుఫ్యాక్చరింగ్-4, రాజభాష-3.

అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి బ్యాచిలర్ ఇంజనీరింగ్ డిగ్రీ (కెమికల్ ఇంజనీరింగ్/ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ)/ బ్యాచిలర్ డిగ్రీ (కెమిస్ట్రీ)/ ఇంజనీరింగ్ డిప్లొమా (కెమికల్)/ మాస్టర్స్ డిగ్రీ (హిందీ/ హిందీ ట్రాన్స్‌లేషన్/ ఇంగ్లీష్/ సంస్కృతం). అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.

వయసు : 31 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు : రూ.300, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ/ మాజీ సైనికోద్యోగ/ ఇంటర్నల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 19, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.brbnmpl.co.in

కాకినాడలో వైద్య విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సాయంత్రం సంచలనం కలిగించింది. శ్రీకాకుళం జిల్లా రాజాంకు చెందిన లెంక వెంకటరమణ, రాజేశ్వరీ దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు గిరీష్‌నాయుడు (21) కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్నాడు. ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగుతున్న సమయంలో చదువు ఒత్తిడిని తట్టుకోలేక గిరీష్‌నాయుడు గురువారం సాయంత్రం ఆర్ఎంసి మెన్స్ హాస్టల్‌లోని టెర్రస్‌పై నుంచి కిందికి దూకాడు. దీంతో, అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిజిహెచ్‌కు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సదస్సు

రాజమహేంద్రవరంలో ప్రత్యామ్నాయ ఇందన వనరులపై అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న నన్నయ విసి ముత్యాలనాయుడు

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలి : నన్నయ విసి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రత్యామ్నాయ, సాంప్రదాయ ఇంధన వనరులను వృద్ధి చేసుకునేందుకు అన్ని దేశాలు దృష్టి సారించాలని నన్నయ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు కోరారు. 2050 నాటికి భారతదేశం వందశాతం ప్రత్యామ్నాయ ఇందన వనరుల అభివృద్ధికి కృషి చేస్తుందని నమ్ముతున్నానని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గురువారం రాత్రి ప్రత్యామ్నాయ ఇందన వనరులపై అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కలుషితం అవుతున్నందువల్ల ఆక్సిజన్ సిలిండర్లు వీపున మోసుకెళ్లే పరిస్థితి దాపురించనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విస్తారమైన కోస్టల్ కారిడార్ ఉందని, ఇప్పటికే గాలి, జలాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. సౌర విద్యుత్‌ను నూరు శాతం ఉత్పత్తి చేసేందుకు దృష్టి సారించాలని కోరారు. అనంతరం ఆయన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల నుంచి హాజరైన రీసెర్చ్ స్కాలర్స్ మహేంద్ర సుంకర, జాషువా, జోసఫ్‌స్కీ, డాక్టర్ జగన్నాథ్ సత్యవోలు, వి.సుదర్శన్, ఎన్.గీతాంజలి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - అనకాపల్లి టౌన్ (విశాఖ)

అనుమానాస్పదంగా వృద్ధ దంపతులు మృతి చెందిన సంఘటన విశాఖ జిల్లా అనకాపల్లి శారదానది రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ శ్యామ్ కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శాంతికబ్‌నగర్ జిల్లా బస్తీ మండలం ఖాకీ గ్రామానికి చెందిన రాంబీచ్‌పాండే (65), శాంతాదేవి (55) దంపతులు తీర్థయాత్రలకు వెళ్లి, తిరుగు ప్రయాణయ్యారని పేర్కొన్నారు. అనకాపల్లి శారదానది బ్రిడ్జి కింద వీరి మృతదేహాలను గురువారం చూసిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడ్డారా లేక ఎవరైనా తోసేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

శత వసంతంలోకి ప్రవేశించిన కెడిసిసి బ్యాంకు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కెడిసిసి) వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం కెడిసిసిలో ఏర్పాటు చేసిన వేడుకలో శాసనమండలి సభ్యులు కెఇ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కెడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కర్నూలులో 1919 లో ప్రారంభమైందన్నారు. నేటికి 22 శాఖలతో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని 894 గ్రామాలలో రైతు సోదరుల పరపతి అవసరాలను తీరుస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన ఉత్సవాలను ఏప్రిల్‌లో 15 రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు.

12 నుంచి బలివే ఉత్సవాలు

ప్రజాశక్తి-ముసునూరు

కృష్ణాజిల్లా ముసునూరు మండలం బలివే గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈఓ నాగసురేష్ గురువారం తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. దర్శనానికి వచ్చే యాత్రికుల కోసం బారికేడ్లు, దేవాలయానికి విద్యుత్ అలంకరణ, జల్లు స్నానం తదితర ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో హోం మంత్రి

ప్రజాశక్తి -ఇంద్రకీలాద్రి (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను రాష్ట్ర హోం శాఖా మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ ఈవో పద్మ స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో మంత్రికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందచేశారు.

ప్రజ్ఞ

జవాబులు

1. వినయ్ శీల్ అబెరోయి కమిటీ
2. గూగుల్
3. జులెన్ గోస్వామి
4. కథాకళి (కేరళ)
5. న్యూఢిల్లీ

చరిత్రను కాలరాస్తున్న ప్రభుత్వాలు

- అంకురం చిత్ర దర్శకులు ఉమామహేశ్వరరావు
- రెండోరోజు భీమవరంలో కొనసాగిన సాంస్కృతిక సంబరాలు



మాట్లాడుతున్న చిత్ర దర్శకులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-భీమవరం టౌన్

గత చరిత్రను నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత నేటి కళాకారులపై ఉందని అంకురం చిత్ర దర్శకులు సి.ఉమామహేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక సంబరాలు (భీమవరం ఫెస్ట్) రెండోరోజు గురువారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచీ వచ్చిన ప్రజానాట్య మండలి కళాకారులు ప్రకాశం చౌక్ సెంటర్ నుంచి ర్యాలీగా నృత్యం చేసుకుంటూ ప్రభావతి కళావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సి.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ప్రస్తుతం కళలు రెండు రకాలుగా చీలిపోవడం బాధాకరమన్నారు. డబ్బు, పెట్టుబడి, అధికారం కళలుగా కొన్ని ఉంటే, జనం, నిజం మరికొన్ని కళలుగా ఉన్నాయని అన్నారు. వాస్తవికతను ప్రతిబింబించే కళలు ప్రజానాట్యమండలి సొంతమని చెప్పారు. చరిత్రను పాలకులకు అనుకూలంగా మలుచుకుంటున్న పరిస్థితులు నేడు ఉన్నాయన్నారు. అన్ని రంగాలనూ పెడతోవపెట్టే సంస్కృతి వస్తుందని, దీనిని అంతం చేయాలంటే కళాకారులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అన్నారు. మతం, కులం, భాషా భేదాలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి నాటకాల ద్వారా కళారూపాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఉద్యమాల వైపు నడపాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు గరికపాటి రాజారావును నేటి కళాకారులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రశ్నిస్తూ పోరాటం చేయడం ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని, కళాకారులు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు నాటికలు ప్రదర్శించారు.

రాష్ట్రానికి అన్యాయం జరిగితే బిజెపితో తెగతెంపులే

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ

రాష్ట్రానికి అన్యాయం జరిగితే బిజెపితో తెగతెంపులు చేసుకుంటామని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. విశాఖ నగర పరిధి గాజువాకలోని హోటల్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు సరిగా లేకపోవడంతో గడిచిన మూడు రోజులుగా తమ ఎంపిలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఎంపిలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా తమ పార్టీ కూడా నిరసనలు తెలిపారన్నారు. వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కేసులకు భయపడి బిజెపిపై ఒత్తిడి పెంచడంలేదన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకోవాల్సిన కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా తగినన్ని నిధులు కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర ప్రజలు బిజెపిని క్షమించబోరన్నారు. ప్రజల ఆగ్రహం వలనే బంద్ ఇంతగా విజయవంతమైందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. విభజన హామీలు అమలుచేయకుండా తాత్సారం చేస్తున్న బిజెపిపై మొదటి సంవత్సరమే పోరాటం చేయాల్సిందని విలేకర్లు అడిగిన ప్రశ్నకు.. చివరి ఏడాదైనా న్యాయం చేస్తారని వేచి చూశామని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టిడిపి అధికార ప్రతినిధి ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడపలో కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

ప్రజాశక్తి - కడప

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాది, బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు నాగరాజు చేపట్టిన నిరవధి దీక్ష గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి మద్దతు తెలియజేశారు. కడప మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, కడప మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి, మాజీ మంత్రి రామమునిరెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు నారాయణ, సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు కె.ఆంజనేయులు, రామమోహన్, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మస్తాన్‌వలిపాల్గొన్నారు.

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా

ఉద్యమ ప్రస్థానం ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-భీమవరం టౌన్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యమ ప్రస్థానం ఫొటో ఎగ్జిబిషన్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు గురువారం ప్రారంభించారు. పోలవరం నిర్వాసితుల పోరుబాట, తుందుర్రు మెగా ఆక్వా ఫుడ్‌పార్క్ వ్యతిరేక పోరాటం, గరగపర్రు దళితుల పోరాటం, కాలుష్యంపై పోరాటం, విద్య, వైద్యం, పర్యావరణం, సైన్సు అంశాలు, ప్రముఖ కవులు, కళాకారులు, మేధావులు, ఉద్యమనేతల జీవిత విశేషాలు తదితర అంశాలతో ఫొటో ఎగ్జిబిషన్ స్థానిక నటరాజ్ థియేటర్ పక్క గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ప్రజా పోరాటాల రథసారధిగా సిపిఎం ప్రజా సమస్యలను ఏ ఒక్కటీ వదలకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, చేతివృత్తిదారులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించిందన్నారు. అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు సాగించిందన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రయత్నాలపై సిపిఎం అలుపెరుగని పోరాటం సాగిస్తోందన్నారు. సిపిఎం ప్రస్థానాన్ని తెలియజేస్తూ అనేక అభ్యుదయకరమైన అంశాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, డెల్టా కమిటీ కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, డి.కళ్యాణి, ఎగ్జిబిషన్ కమిటీ కన్వీనర్ పి.దక్షిణామూర్తి, నిర్వాహకులు పిఎల్ నరసింహారావు మాట్లాడారు.

ఆర్థిక భారంతో దంపతుల ఆత్మహత్య

అనాథగా మిగిలిన చిన్నారి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం క్రైం

ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రామాలయం వీధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక దానవాయిపేటలో వస్త్ర వ్యాపారం చేసే కునుకు బాలకృష్ణ (31), శ్రీగంగ (23) భార్యాభర్తలు. వీరికి ఎనిమిది నెలల చిన్నారి ఉంది. కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వీరికి రావాల్సిన బాకీలు రాకపోవడం, తీసుకున్న అప్పులు తీర్చలేకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లోనే ఇద్దరూ పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గురువారం ఉదయం ఎంతకీ వారి ఇంటి తలుపులు తీయకపోవడంతో స్థానికులు బలవంతంగా తెరిచి చూడగా ఈ ఘోరం వెలుగు చూసింది. ఆ సమయంలో ఎనిమిది నెలల చిన్నారి నిద్రించి ఉండటం అందరినీ కలచి వేసింది. సమాచారం తెలిసిన వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న బాలల నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. బాలల విభాగంలో ప్రదర్శనలు గురువారంతో ముగిశాయి. శుక్రవారం నుంచి పౌరాణిక నాటక ప్రదర్శనలు ఉంటాయి. బాలల ప్రదర్శనల్లో చివరిగా వసుధైక కుటుంబం, మనవి, శిలాపుష్పాలు, ఊరుభంగం, చలిచీమలు, చేసుకున్నంత మహదేవ, గాజుబొమ్మలు నాటికలను ప్రదర్శించారు. దేశానికి వెన్నెముకైన రైతు భూముల కబ్జా, ర్యాగింగ్, నైతిక విలువలు, బాలలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు, దారుణాలు, వృద్ధ తల్లి దండ్రులను ఆశ్రమాల్లో చేర్చడం, తదితరాలు ఇతి వృత్తాలుగా ప్రదర్శనలు కొనసాగాయి.



'కటికపూలు' పుస్తకావిష్కరణ చేస్తున్న వి.శ్రీనివాసరావు,వొరప్రసాద్ తదితరులు

భాషపై ఆధిపత్యం కోసం మతోన్మాద శక్తుల ప్రయత్నం

దళిత్ శోషన్ మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు

'కటికపూలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

భాషపై ఆధిపత్యం కోసం స్వార్ధ రాజకీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని దళిత్ శోషన్ మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. పూర్వం అక్షరమే అంటరానిదిగా ఉండేదని, ఇప్పుడు భాషను కొన్ని కులాలు, మతాలు ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నాయని పేర్కొన్నారు. పలు సాహితీ సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో ఇండస్ మార్టిన్ రచనల సంకలనం 'కటికపూలు' పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. విజయవాడలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కెవిపిఎస్ గతంలో చేసిన సర్వేలో సమాజంలో 148 రకాల వివక్షలు ఉన్నాయని తేలిందని, ఇప్పుడు భాష కూడా తోడై అవి 149 అయ్యాయని చెప్పారు. ఏ రాష్ట్రానికీ మాతృభాషగా లేని సంస్కృత, హిందీ భాషలను దేశ ప్రజలపై రుద్దేందుకు ఆర్ఎస్ఎస్ తదితర మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తుండడం అప్రజాస్వామికమన్నారు. భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నం చాలా ప్రమాదకరమన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి వొరప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తకొత్త అంశాలను స్పృశిస్తూ సోషల్ మీడియా ద్వారా కొత్త సాహిత్యం ముందుకు వస్తోందన్నారు. కవి డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ అస్థిత్వ ఉద్యమాల స్ఫూర్తితో అనుభవించిన విషయాలను కొత్త రచయితలు రాస్తున్నారని తెలిపారు. మార్కెట్ సంస్కృతి, మనువాద సంస్కృతి సమాజంపై రుద్దబడుతున్నాయని చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభలు పెట్టేవారు గ్రామాల్లో శ్రమచేసే వారి భాషను ఒడిసిపట్టాలని కోరారు. భాషపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే అధ్యయన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ ఎం.ఎఫ్.గోపినాథ్ మాట్లాడుతూ సోమరిపోతుల సంస్కృతి గొప్పదా? శ్రమజీవుల సంస్కృతి గొప్పదా? అని సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరేడు శతాబ్దాలలో భాష సంఘర్షణకు సంబంధించి పరిశోధనలు జరగలేదన్నారు. ప్రముఖ కవి ఖాదర్‌మొహిద్దీన్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి కటికపూలు రచన తాజాదనం తీసుకువచ్చిందన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ దళిత సాహిత్యంలో ఉన్న కొన్ని ఖాళీలను కటికపూలు పుస్తకం భర్తీ చేసిందన్నారు. అసహ్యించుకునే పదాలను కూడా ఆత్మగౌవరంగా ప్రకటించటం సాహిత్యంలో ఒక అలంకరణగా ఉందన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ దళితుల్లో అభివృద్ధి చెందిన వారు కిందస్థాయిలో వారిని పట్టించుకోకపోవటంతో దళితుల్లోనే మరోవర్గం ఉద్భవిస్తోందని చెప్పారు. కుల నిర్మూలన కోసం పటిష్టమైన ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత ఇండస్ మార్టిన్ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని గుర్తించాలని చెప్పేందుకు ఈ రచన చేశానని చెప్పారు. ఫేస్‌బుక్ మిత్రుల సహాయంతో ఈ ప్రయత్నం చేశానని, దీన్ని కొనసాగిస్తానని అన్నారు. ఫేస్‌బుక్‌లో పోస్టులుపెట్టిన ప్రతిసారీ కొన్ని శక్తుల నుంచి బెదిరింపులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి నాయకులు కె.సత్యరంజన్, జి.నారాయణ, కవి గుర్రం సీతారామ్, ఆర్టిస్ట్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

జీతం కావాలా... లంచం కొట్టు!

ఎసిబికి పట్టుబడ్డ కడప రిమ్స్ పరిపాలనాధికారి

ప్రజాశక్తి-కడప కోటిరెడ్డిసర్కిల్

రిమ్స్ పరిపాలనాధికారి ఆర్.భరత్‌మోహన్‌సింగ్ రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు. ఆఫీసు సూపరింటెండెంట్ నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గురువారం రిమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎసిబి డిఎస్‌పి నాగరాజు మాట్లాడుతూ నవంబర్‌లో అనంతపురం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్ సి.సురేష్‌కుమార్‌రెడ్డి కడప రిమ్స్ బదిలీపై వచ్చారని తెలిపారు. ఆయన ఎఒ భరత్‌మోహన్ సింగ్‌కు జాయినింగ్ లెటర్ ఇచ్చారని చెప్పారు. అప్పటి నుంచి అతనికి సూపరింటెండ్ సీటును కేటాయించలేదన్నారు. మూడు నెలలకు సంబంధించి జీతాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. సీటు కేటాయింపు, జీతం చెల్లించాలంటే తనకు రూ.లక్ష ఇవ్వాలని సురేష్‌కుమార్‌రెడ్డిని రిమ్స్ ఎఒ డిమాండ్ చేశారని తెలిపారు. సురేష్ తమను సంప్రదించి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఎఒకు సురేష్ రూ.60 వేలు ఇస్తుండగా దాడులు చేసి పట్టుకున్నామన్నారు. భరత్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంత్యక్రియలు

ముద్దుకృష్ణమకు కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

దు:ఖ సాగరంలో వెంకట్రామాపురం



ప్రభుత్వ లాంఛనాలతో ముద్దుక్రిష్ణమ పార్థివ దేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-రామచంద్రాపురం

ముద్దుక్రిష్ణమనాయుడు పార్థివదేహానికి అశేష జనవాహిని మధ్య అంతిమయాత్ర సాగింది. ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలను గురువారం సాయంత్రం నిర్వహిం చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు విచ్చేశారు. జిల్లాలో 'పెద్ద దిక్కు'ను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రామాపురం దు:ఖ సాగరంలో మునిగిపోయింది. చంద్రగిరి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉదయం నుంచి దహనక్రియలు పూర్తయ్యే వరకు ఉన్నారు. పార్థివదేహాన్ని స్వయంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు కరుణా కర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు ముందుండి మోశారు.

రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురంలో ముద్దుకృష్ణమనాయుడు పార్థివదేహానికి సాయంత్రం 4.42 గంటలకు వారి వ్యవసాయ భూమిలో ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు జరిగాయి. హిందూ సాంప్రదాయ పద్ధతుల్లో చిన్న కుమారుడు జగదీష్ చితికి నిప్పంటించారు. పోలీసులు అధికార లాంచనాలతో గౌరవ వందనం చేశారు. అంతిమయాత్రకు రాష్ట్ర మంత్రులు అమరనాథరెడ్డి, పత్తిపాటి పుల్లారావు, అచ్చెంనాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌సిలు బుద్దా వెంకన్న, గౌనివారి శ్రీనివాసులు, బిఎన్ రాజసింహులు, కలెక్టర్‌ప్రద్యుమ్న, తుడ చైర్మన్ నరసింహయాదవ్, శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సుగుణమ్మ, తలారి ఆదిత్య, శంకర్, నారాయణస్వామి, మాజీ ఎంపి చింతామోహన్, కరుణాకర్‌రెడ్డి, ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. మంత్రి అమరనాథరెడ్డి, కలెక్టర్ ప్రద్యుమ్నలు పాల్గొన్నారు.

మీరు మునిగి మమ్మల్ని ముంచొద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

'టిడిపి ఆందోళన ప్రతిపక్షాలకు ఊతం ఇచ్చేలా ఉంది.. చివరికి మీరు (టిడిపి) మునిగి మమ్మల్ని ముంచొద్దు' అని మాజీ మంత్రి, బిజెపి రాష్ట్ర నాయకులు కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలుకు ఇంకా ఆరేళ్ల సమయం ఉందని, ఇప్పటికే హామీల అమలు ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. గుంటూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విభజన చట్టంలోని హామీల అమలుకు 10 ఏళ్ల సమయం ఉందన్న ఆయన ఈ నాలుగేళ్లలో రాష్ట్రానికి ఎన్నో నిధులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు వచ్చాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో కర్నాటకకు రూ.22,150 కోట్లు, తమిళనాడుకు రూ.11,300 కోట్లు కేటాయించగా ఆంధ్ర ప్రదేశ్‌కు రూ.31 వేల కోట్లు ఇచ్చారని చెప్పారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని టిడిపి నిరసనలు తెలపడం తగదని, మిత్రపక్షంగా ఉన్న వారు మిత్రధర్మం పాటించాలని సూచించారు.టిడిపి రాజ్యసభలో కాంగ్రెస్‌తో కలసి రెండు కీలక బిల్లులకు మోకాలడ్డిందని, ట్రిపుల్ తలాఖ్ రద్దు, బిసి కమిషన్ చట్టబద్ధతకు రాజ్యసభలో బిల్లులు పెండింగ్‌లో ఉండటానికి టిడిపి సైతం కారణమేనన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై ఇటీవల జరిగిన దాడిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారి ఇళ్లపై అధికారం ఉంది కదా అని దాడులు చేయడం తగదన్నారు.

విద్యుత్ షాక్‌తో 11 గేదెలు మృతి

ప్రజాశక్తి- హనుమంతునిపాడు (ప్రకాశం)

విద్యుత్ షాక్‌కు గురై 11 గేదెలు మృతిచెందిన ఘటన ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలోని నల్లగండ్ల గ్రామంలోని పొలంలో బుధవారం రాత్రి చోటుచేసుంది. ప్రమాదవ శాత్తు కరెంటు వైరు తెగిపోవడంతో అటుగా మేతకు వెళ్లిన గేదెలు కరెంటు తీగకు తగిలి మృతి చెందాయి. తిమ్మారెడ్డిపల్లి గ్రామ రైతులకు చెందిన ఐదు గేదెలు, నల్లగండ్ల గ్రామ రైతులకు చెందిన ఆరు గేదెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు.

మార్చి 1 నుండి రిజిస్టరైన పరికరాలకు మాత్రమే ఆధార్ సమాచారం

దుర్వినియోగం నిరోధానికి యుఐడిఎఐ ఆదేశం

న్యూఢిల్లీ: ప్రజల ఆధార్ కార్డులకు సంబంధించిన బయోమెట్రిక్ సమాచారాన్ని మార్చి 1 నుండి ముందుగా నమోదు చేసుకున్న పరికరాలకు మాత్రమే అనుమతించాలని విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) అధీకృత ఏజెన్సీలను ఆదేశించింది. ఆధార్ డేటా దుర్వినియోగం అవుతోందని ఇటీవల ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో యుఐడిఎఐ ఈ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ పరికరాలను అప్‌గ్రేడ్ చేసుకునే గడువు గత ఏడాది జూన్ 1 నాటికే ముగిసినప్పటికీ పలుమార్లు దానిని పొడిగించారు. తాజా పొడిగింపు ఆరవది కావటం విశేషం. ఆధార్ సమాచార వ్యవస్థను ఎన్‌క్రిప్ట్ చేసేందుకు వీలుగా బయోమెట్రిక్ పరికరాల నుముందుగా తమ వద్ద నమోదు చేసుకోవాలని యుఐయై సూచించింది.



సమావేశం ।

సౌది అరేబియాలో పర్యటిస్తున్న విదేశాంగశాఖా మంత్రి సుష్మాస్వరాజ్ అల్ జనాద్రియా ఉత్సవ కమిటి నిర్వాహకుడు సల్మాన్ బిన్ అబ్దుల్లా అల్ సౌదితో సమావేశమైన దృశ్యం.

మేథో సంపత్తి దేశాల జాబితాలో 44వ స్థానంలో భారత్

వాషింగ్టన్ : అంతర్జాతీయ మేథో సంపత్తి (ఐపి) తాజా సూచికలో భారత్ మొత్తం 50దేశాల జాబితాలో భారత్ 44వ స్థానంలో వుంది. గురువారం అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ ఈ వివరాలను విడుదల చేసింది. గత సూచీలో భారత్ 25శాతం స్కోర్ సాధించగా ఈసారి 30శాతం సాధించిందని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్‌కి చెందిన గ్లోబల్ ఇన్నొవేషన్ పాలసీ సెంటర్ (జిఐపిసి) రూపొందించిన వార్షిక నివేదిక పేర్కొంది. స్కోర్‌ను మెరుగుపరుచుకున్నప్పటికీ భారత్ ఇంకా ఈ జాబితాలో అట్టడుగు స్థానంలోనే వుంది. గతేడాది 45 దేశాల జాబితాలో 43వ స్థానంలో వుండగా ఈసారి 50దేశాల జాబితాలో 44వ స్థానంలో వుంది.

కంప్యూటర్ ఇంప్లిమెంటెడ్ ఇన్వెన్షన్స్ (సిఐఐ) కి పేటెంట్ సంపాదించుకోవడానికి చేసిన కృషి, అలాగే వాటిని నమోదు చేయించుకోవడానికి అనుసరించిన విధానాల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేసినట్లు మెరుగైన స్కోర్ వల్ల తెలుస్తోందని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో అమెరికా అగ్ర స్థానంలో వుంది. తర్వాత బ్రిటన్, స్వీడన్ వున్నాయి. భారత్ సాధించిన స్కోరు చూస్తుంటే ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి అనుబంధంగా అదనపు, అర్థవంతమైన సంస్కరణలు అవసరమని ఆ నివేదిక పేర్కొంది.

కర్నాటక ఎన్నికల్లో బిఎస్‌పి, జెడి(ఎస్) పొత్తు

న్యూఢిల్లీ : ఈ ఏడాదిలో జరిగే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), జనతాదళ్ (సెక్యులర్) గురువారం ప్రకటించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఈ పొత్తును కొనసాగిస్తామని తెలిపాయి. ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో బిఎస్‌పి నేత సతీష్ చంద్ర మిశ్రా, జెడి (ఎస్) నేత దినేష్ అలీ ఈ విషయాన్ని తెలిపారు. 224 స్థానాలు ఉన్న కర్నాటక అసెంబ్లీకి ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది.

త్రిపురలో అభివృద్ధి కుంటుబడింది

ఎన్నికల ప్రచార సభలో మోడీ ఆరోపణలు

న్యూఢిల్లీ : గత 25ఏళ్ళుగా వామపక్ష పాలనలో వున్నందున త్రిపురలో అభివృద్ధి కుంటుపడిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కొరవడ్డాయంటూ అగర్తలకు 86 కిలోమీటర్ల దూరంలోని సోనామురాలో జరిగిన బహిరంగసభలో మోడీ వక్రభాష్యాలకు దిగారు. ఈశాన్య భారతాన్ని అభివృద్ధిపరిచేందుకు కేంద్రం కృషి చేస్తోందని అన్నారు. కానీ త్రిపుర మాత్రం వెనుకబడే వుందని, గత పాతికేళ్ళుగా వామపక్షాల పాలన కారణంగా రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. యువతను ప్రధానంగా ఆకట్టుకోవాలనే లక్ష్యంతో మోడీ ఎక్కువగా ఉపాధి అంశాలు, నిరుద్యోగం సమస్యపైనే దృష్టి కేంద్రీకరించారు. ఈనెల 18న జరుగుతున్న ఎన్నికల్లో బిజెపి పోటీ చేయడం లేదని, నిరుద్యోగులైన యువత పోటీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ త్రిపుర ప్రభుత్వ ఉద్యోగులు నాల్గవ వేతన కమిషన్ ప్రాతిపదికనే వేతనాలు పొందుతున్నారని, దేశవ్యాప్తంగా ఏడవ వేతన సంఘం సిఫార్సులు అమలవుతుంటే త్రిపురలో ఆ పరిస్థితి లేదన్నారు. త్రిపురలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే కార్మికులందరికీ కనీస వేతనాలు లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

దళితుడి భూమి కబ్జా కేసులో కేంద్రమంత్రి

ఎఫ్ఐఆర్ నమోదు

పాట్నా : దళితుడి భూమిని కబ్జా చేసిన కేసులో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేరు నమోదైందని పోలీసులు గురువారం తెలిపారు. మంత్రి సొంత రాష్ట్రమైన బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. ప్రత్యేక ఎస్‌సి, ఎస్‌టి కోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 2వ తేదీన సింగ్, మరో 32మందిపై ఎఫ్ఐఆర్ నమోదైందని పాట్నా జిల్లాలోని దానాపూర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సందీప్ కుమార్ సింగ్ తెలిపారు. నవాడా బిజెపి ఎంపి అయిన సింగ్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ (స్వతంత్ర) మంత్రిగా వున్నారు. తనకు చెందిన రెండెకరాలకు పైగా భూమిని ఆయన కబ్జా చేశాడని అసోపూర్ గ్రామానికిచెందిన రామ్ నారాయణ్ ప్రసాద్ తెలిపారు. దీంతో తాను నిరసన తెలియచేయగా తనపై దుర్భాషలకు దిగాడని చెప్పారు. కాగా కోర్టు ఆదేశాల ప్రకారం, ఐపిసి లోని సంబంధిత సెక్షన్ల క్రింద ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఈ కేసు నమోదైన నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజీనామా చేయాలంటూ బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. దీనిపై బిజెపి ప్రతినిధి రాజీవ్ రంజన్ స్పందిస్తూ మంత్రి గిరిరాజ్ సింగ్ చట్టానికి కట్టుబడి వుండే వ్యక్తి అని వ్యాఖ్యానించారు. సమయం వచ్చినపుడు ఆయన కోర్టులో తన వాదన వినిపిస్తారని అన్నారు. కొంతమంది ఈ విషయాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నించడం దురదృష్టకరమని అన్నారు.

ముఖ్యమంత్రితో సహా 253 మంది నామినేషన్లు

కోహిమా : నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల చివరి రోజైన గురువారం ముఖ్యమంత్రి టిఆర్ జీలైంగ్‌తో సహా 253 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అధికార పార్టీ నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) తరుపున జీలైంగ్, బిజెపి నుంచి మాజీ ముఖ్యమంత్రి కెఎల్ చిషి నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉప సంహరణకు ఈ నెల 12 వరకూ గడువు ఉంది. ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది. 7 పెరెన్ నియోజకవర్గం నుంచి జీలైంగ్, కె ఎల్ చిషి అతోఐజు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఎన్‌పిఎఫ్ 59 స్థానాల్లో పోటీ చేస్తుంది. ఎన్‌డిపిపి 40 స్థానాల్లో పోటీ చేస్తుంది. బిజెపి 20, కాంగ్రెస్ 19, ఎన్‌పిపి 28, జెడి(యు) 15, ఎన్‌సిపి 6, ఆప్ 3, లోక్ జన్ పార్టీ 2 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. 17 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలో రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఐదుగురు మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.



పెద్ద నోట్ల రద్దు సంక్షోభంలో యుపి రైతులు

లక్నో: పెద్దనోట్ల రద్దు తాము సాధించిన విజయాలలో ఒకటిగా ప్రధాని, ఎన్‌డిఎ ప్రభుత్వం నేటికీ ప్రచారం చేసుకుంటున్నాయి. కాని నోట్లరద్దు రైతాంగాన్ని ఎలా దెబ్బతీసిందన్న విషయం యుపి బంగాళాదుంప పండించిన రైతుల పరిస్థితిని పరిశీలిస్తే అర్థం అవుతుంది. 2016 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు ప్రక్రియతో దేశంలో ఏర్పడిన నగదు కొరత గత ఏడాది ఏప్రిల్ వరకూ గ్రామీణ ప్రాంతాలను భారీగా కుదిపేసింది. ముఖ్యంగా దేశంలో బంగాళాదుంప (ఆలూ) పంటలో 30 శాతం మేర పండించే యుపి గ్రామీణ ప్రాంతాలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. దేశవ్యాప్తంగా పండే మొత్తం ఆలూ పంటలో 20 శాతం మేర నైరుతి యుపి ప్రాంతంలోని ఆగ్రా, హత్రాస్, మధుర తదితర ప్రాంతాలలోనే పండుతుంది. ఇక్కడి నుండి మార్కెట్లకు సరఫరా అయ్యే ఆలూ సగటు ధర ప్రతినెలా పతనమవుతూ రైతుల ఆశలకు గండికొట్టింది. 2016 నవంబర్‌లో క్వింటాల్ ఆలూ సగటు ధర రు.916. నోట్ల రద్దు తర్వాత నెలరోజులకు మరుసటి నెలలో 41.8 శాతం మేర పడిపోయి రు.532కి చేరింది. గత ఏడాది మార్చిలో క్వింటాల్ రు.399 స్థాయికి చేరుకునే వరకూ ఈ పతనం కొనసాగింది. క్వింటాల్ ఆలూ ఉత్పత్తి వ్యయం రు.500 కాగా, మార్కెట్ ధర అందుకు తక్కువగా వుంటూ రైతులకు తీవ్ర కడగండ్లనే మిగిల్చింది. 2016 నవంబర్ తరువాత ధరల పతనంలో నోట్ల రద్దు ప్రక్రియ కీలకపాత్రమే పోషించిందని ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొ.అరుణ్‌కుమార్ చెబుతున్నారు. నోట్ల రద్దుతో వ్యాపారుల వద్ద నగదుకు తీవ్ర కొరత ఏర్పడిందని, వారు రైతులు తక్కువ ధరలకు అమ్ముకునేలా వత్తిడి చేశారని ఆయన నోట్ల రద్దుపై రాసిన తన పుస్తకంలో వివరించారు. అసంఘటిత రంగంలో నగదు లావాదేవీలు భారీగా పడిపోవటంతో డిమాండ్ కూడా పడిపోయింది. అనేక సందర్భాలలో ప్రజలు తమకు అవసరమైన ఆహారాన్ని కొనుగోలు చేసుకోలేకపోయారన్న వార్తలు వెలువడిన విషయం తెలిసిందే. నోట్ల రద్దు అనంతరం ధరల పతనానికి ఈ అంశాలన్నీ కీలక పాత్ర పోషించాయి. నగదు కొరత జూన్ చివరి వరకూ కొనసాగినప్పటికీ, ఈ దుష్ప్రభావం మాత్రం సుదీర్ఘకాలం ప్రజలకు గుర్తుండిపోతుంది. ఈ దుర్భర పరిస్థితి నుండి రైతులు ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కన్పించటం లేదన్నారు.



సుజనా చౌదరి

మళ్లీ అదే 'డ్రామా'

ఉభయ సభల్లో ఏపి ఎంపిల ఆందోళన

15 రోజుల్లో పరిష్కరిస్తే ఆందోళన విరమణ : సుజనా



అరుణ్ జైట్లీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ పార్లమెంట్‌లో టిడిపి చేపట్టిన ఆందోళన 'డ్రామా' గురువారం కూడా కొనసాగింది. టిడిపి, బిజెపిల మిలాఖత్ మరోసారి బహిర్గత మైంది. టిడిపి ఎంపిలు ఒక పక్క ఆందోళన చేస్తూనే, మరోవైపు సుజనా చౌదరి నేతృత్వం లో కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు. కేంద్ర మంత్రులు లోక్‌సభలో ప్రసంగించేట ప్పుడు టిడిపి ఎంపిలు తమ నినాదాలు ఆపే శారు. తొలుత పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు, గేట్ నెంబర్ 1 వద్ద వైసిపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. చిత్తూరు ఎంపి శివప్రసాద్ తప్పెట గుళ్ల వేషధారణలో పాటలు పాడుతూ నిరసన తెలిపారు. లోక్‌సభ ప్రారంభం కాగానే టిడిపి, వైసిపి ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. చిత్తూరు ఎంపి శివప్రసాద్ తప్పెట గుళ్ల వేషధారణలో కంజరతో సభలోకి వచ్చి... దాన్ని వాయించేం దుకు ప్రయత్నించడం గందరగోళానికి దారి తీసింది. దీంతో పార్లమెంటు సిబ్బంది ఆయన్ని వారించి బయటకు పంపేశారు. ఆయన సాధారణ దుస్తులతో సభకు వచ్చారు. 'గోవిందా గోవిందా' అంటూ టిడిపి ఎంపిలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న ఎంపిలపై స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు చేసే నినాదాలు ఇతర సభ్యులకు ఇబ్బందిగా ఉంది. నిరసన తెలపండి కానీ.. గట్టిగా నినాదాలు మాత్రం చేయొద్దు. క్రమశిక్షణ తప్పితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడను" అని హెచ్చరించారు. అయినప్పటికీ ఎంపిలు వెనక్కు తగ్గకపోవడంతో సభను 11.34 నిమిషాల వరకు వాయిదా వేశారు. .

వాయిదా అనంతరం ప్రారంభమైన సభలో సభ్యులిచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు. ఏపి ఎంపిలు తమ ఆందోళనను కొనసాగించారు. ఒకనొక సమయంలో ఎంపి శివప్రసాద్, లోక్‌సభ డిప్యూటీ జనరల్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలను తీసుకుని బయటకు వెళ్లేందుకు యత్నించారు. అయితే బిజెపి నేతలు ఆయన్ను అడ్డుకున్నారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మరోసారి 12:45 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తరవాత కూడా ఏపి ఎంపిలు తమ ఆందోళనను కొనసాగించారు. ఏపి అంశంపై సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడతారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్, మరో కేంద్ర మంత్రి సుజనా చౌదరి ప్రకటన చేశారు. సభ వాయిదా పడిన అనంతరం టిడిపి ఎంపిలను స్పీకర్ సుమిత్రా మహాజన్ తన చాంబర్‌లోకి పిలిచారు. అయితే చాంబర్‌లోకి వెళ్లేందుకు ఎంపి శివప్రసాద్ నిరాకరించారు. మరోవైపు సభలోనే ఉన్న కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆ పార్టీ సభాపక్ష ఉపనేత జ్యోతిరాదిత్యలతో టిడిపి ఎంపిలు కేశినేని నాని, తోట నర్సింహం, రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఏపిలో పరిస్థితిని సోనియాకు వారు వివరించినట్లు సమాచారం. మధ్యాహ్నం డిప్యూటీ స్పీకర్ సభను నిర్వహిస్తున్న సందర్భంలో టిడిపి ఎంపిలు తోట నరసింహం, శివప్రసాద్, అవంతి శ్రీనివాస్, గల్లా జయదేవ్, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, రవీంద్రబాబు తదితరులు సభలో పడుకుని నిరసన తెలిపారు.

కాంగ్రెస్ నోటీసులు

ఏపి విభజన చట్టం, ప్రత్యేక హోదాపై చర్చ జరపాలని లోక్‌సభలో కాంగ్రెస్ నోటీస్ ఇచ్చింది. 184 నిబంధన కింద ఏపికి ప్రత్యేక హోదాపై చర్చ, ఓటింగ్ జరపాలని లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కి కాంగ్రెస్ పక్షనేత మల్లిఖార్జున ఖర్గే నోటీసులు అందజేశారు. మరోవైపు రాజ్యసభలో ఏపికి జరిగిన అన్యాయంపై చర్చకు అనుమతించాంటూ కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్రరావు, టిడిపి ఎంపిలు సిఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, తోట సీతామహాలక్ష్మీ, వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఆందోళన చేపట్టారు. ఆయా పార్టీల ఏపి ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. విభజన హామీల అమలుపై 15 రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని కేంద్ర మంత్రి సుజనా చౌదరి పార్లమెంట్ ఉభయ సభల్లో డిమాండ్ చేశారు. ఏపి ప్రజల మనోభావా లను కేంద్రం అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచం ద్రరావు సూచించారు. ఈ సభలో ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదన్నారు. హామీలు అమలు చేసి ప్రజాస్వామ్యా న్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు.

2019లోపు పోలవరం పూర్తి చేస్తాం

– మంత్రి నితిన్ గడ్కరీ



పోలవరం ప్రాజెక్టును 2019లోగా పూర్తి చేయడం తన బాధ్యతని కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బిజెపి ఎంపిలు కంభం పాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ గురువారం నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు నిధులు, జాతీయ రహదారులు ఇచ్చామన్నారు.

ఏపికి విడతల వారీ సాయం చేసింది


– ఎంపి గోకరాజు గంగరాజు



అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేసిందో శుక్రవారం చెబుతామని ఆ పార్టీ ఎంపి గోకరాజు గంగరాజు పేర్కొన్నారు. ఏపికి న్యాయం జరగలేదనడం సరికాదని, విడతల వారీగా కేంద్రం సాయం చేస్తోందని ఆయన అన్నారు. ఆంధ్రుల మనోభావాలకు అనుగుణంగా బిజెపి.. ఏపికి సాయం చేస్తోందన్నారు. ఏపికిచ్చిన హామీల అమలుపై అధిష్టానంతో చర్చిస్తామని ఎంపి గోకరాజు వ్యాఖ్యానించారు.

కేంద్రం ఎంతో చేసింది

– మంత్రి కామినేని శ్రీనివాస్



టిడిపి మిత్రపక్షంగా ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి చాలా చేసిందని రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏపికిచ్చిన హామీలన్నీ కేంద్రం నెరవేరుస్తోందని తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోగా కేంద్రం నుంచి సంతప్తికర సమాధానం వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

టిడిపి మంత్రులు రాజీనామా చేయాలి

– ఎంపి విజయసాయి రెడ్డి



కేంద్ర మంత్రి వర్గంలో ఉన్న సుజనా చౌదరి రాష్ట్రపతి ప్రసంగాన్ని ఎలా వ్యతిరేకిస్తా రని వైసిపి ఎంపి విజయ సాయి రెడ్డి ప్రశ్నించారు. మంత్రివర్గంలో ఉండి ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్రంపై విశ్వాసం లేకపోతే సుజనా చౌదరి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభలో విజయ ఎసాయి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. రూల్ 238-1, రూల్ 238-2, రూల్ 238-ఏ కింద వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 74, 75 ప్రకారం ఏ అంశమైనా, కేబినెట్‌లో ఆమోదం పొందిన తర్వాత మంత్రి దాన్ని వ్యతిరేకించడం నిబంధనలకు విరుద్ధమని విజయసాయి రెడ్డి వివరించారు. అయితే దీనిని రాజ్యసభ ఛైర్మన్ తిరస్కరించారు. ఇదే అంశంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను విజయ సాయి రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. వైసి ఎంపి విజయసాయి రెడ్డి వ్యవహరించిన తీరుపై టిడిపి ఎంపి సిఎం రమేశ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు

పార్లమెంటులో ప్రధాని అబద్ధాలు

మీడియా పరిశీలనలో వాస్తవాల వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంట్‌లో బుధవారం చేసిన ప్రసంగంలో బ్యాంకుల్లో అనుత్పాదక ఆస్తులు (ఎన్‌పిఎ) పేరుకుపోవటానికి గత కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని చేసిన వ్యాఖ్యలు, ఆసందర్భంగా ప్రకటించిన అంకెలు అవాస్తకాలని మీడియా పరిశీలనలో వెల్లడైంది. 'దేశ ప్రజల కోసం ఇప్పటి వరకూ మీ ఆరోపణలన్నీ విన్నాను. ఎన్‌పిఎలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది. యుపిఎ సర్కారు తప్పిదాల వల్లే బ్యాంకుల్లో ఎన్‌పిఎలు పేరుకుపోతున్నాయి' అని ప్రధాని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఆయన ఉటంకించిన సమాచారం కొంత అయోమయంగా వుంది. 'మీరు అధికారంలోవున్నపుడు ఎన్‌పిఎలు 36 శాతం మాత్రమే వున్నాయంటూ అబద్ధాలు చెప్పారు. మేం అధికారంలోకి వచ్చిన తరువాత వాస్తవాలు వెలికి తీసినపుడు ఎన్‌పిఎలు 82 శాతం మేర వున్నట్లు తేలింది' అని ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాగా ఈ అంశంపై ఆర్‌బిఐ వెల్లడించిన డేటాను కొంతమంది మీడియా ప్రతినిధులు పరిశీలించినపుడు 2013-14లో బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాలలో ఎన్‌పిఎల మొత్తం 3.8 శాతం మాత్రమేనన్న విషయం వెలుగులోకి వచ్చింది. మార్చి 2014 నాటికి బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాల విలువ రు.52 లక్షల కోట్లకు చేరుకుందని చెబుతూ ఇది యుపిఎ ప్రభుత్వ హయాంలో పారు బాకీలలో భాగమేనని, ఇది పేద ప్రజల డబ్బు అని ప్రధాని వ్యాఖ్యానించారు. రిజర్వ్ బ్యాంక్ డేటా ప్రకారం రు.52 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మొత్తం ప్రభుత్వ రంగ బ్యాంకులు అందించిన రుణాలే తప్ప ఎన్‌పిఎలు కాదని తెలుస్తోంది. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాది 2015-16లో ఎన్‌పిఎల మొత్తం విలువ రెట్టింపు స్థాయికి పెరిగి 7.5 శాతానికి చేరుకున్నట్లు ఆర్‌బిఐ డేటా చెబుతోంది. ఎన్‌పిఎలకు సంబంధించి ఆర్‌బిఐ వెల్లడించిన సమాచారం, ప్రధాని ప్రసంగానికి చెందిన వీడియో క్లిప్పింగ్‌లో బిజెపి ట్విట్టర్ ఖాతాలో మనకు కన్పిస్తాయి. కొంతమంది మీడియా ప్రతినిధులు వాస్తవాల కోసం బిజెపికి ట్వీట్ చేసిన వెంటనే ఆ పార్టీ వర్గాలు ఈ క్లిప్పింగ్‌లను తొలగించినట్లు తెలుస్తోంది.



ప్రధానికి సభా హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇస్తామన్న రేణుకా చౌదరి

న్యూఢిల్లీ : రాజ్యసభలో బుధవారం కాంగ్రెస్ సభ్యురాలు రేణుక చౌదరి పట్ల ప్రధాని నరేంద్రమోడీ అవమానకరంగా వ్యవహరించడంపె కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మోడీకి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు పంపనున్నట్లు రేణుకా చౌదరి వెల్లడించారు.. మోడీ ప్రసంగిస్తున్న సమయంలో రేణుకా చౌదరి బిగ్గరగా నవ్వారు. 'నిశ్శబ్దంగా సభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆమెకు సూచించగా, 'ఆమె నవ్వును ఆపకండి, రామాయణ సీరియల్‌లో ఇ టువంటి నవ్వును చూశానని, మళ్లీ మొదటిసారిగా అలాంటి నవ్వును చూసే అవకాశం కలిగిందని మోడీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కాంగ్రెస్ మహిళా ప్రతినిధుల బృందం ఛైర్మన్ వెంకయ్య నాయుడిని కలిశారు. ఈ సందర్భంగా మోడీ క్షమాపణ చెప్పాలని మహిళల ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది.. ఈ సమస్యను చర్చించిన అనంతరం ప్రధానికి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని రేణుకా చౌదరి పేర్కొన్నారు.

నాగా పీపుల్స్ ఫ్రంట్‌తో పొత్తుకు కాంగ్రెస్ యత్నాలు

న్యూఢిల్లీ: నాగాలాండ్ అసెంబ్లీకి ఈ నెల 27న జరుగనున్న ఎన్నికల్లో కొన్ని స్థానాలలో నాగా పీపుల్స్ ఫ్రంట్‌తో పొత్తు కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. మొత్తం 60 మంది సభ్యులున్న ఈ శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మంగళ వారం నాడు 23 మంది అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. తాము మొత్తం 58 స్థానాలలో పోటీ చేస్తామని అధికార నాగా పీపుల్స్ ఫ్రంట్ ఇప్పటికే ప్రకటించింది. కేంద్రంలోని అధికార బిజెపి రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన నాగాలాండ్ డెమొక్రాటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)తో పొత్తు కుదుర్చుకుని 20 స్థానాలలో తన అభ్యర్థులను ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి నీఫ్యూ రియో నేతృత్వంలోని ఎన్‌డిపిపి మిగిలిన 40 స్థానాలలో తన అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. నామినేషన్ల దాఖలుకు తుదిగడువు గురువారం కాగా ఉపసంహరణకు ఈ నెల 12వ తేదీ తుది గడువు. ఎన్‌పిఎఫ్ ఇప్పటికే దాదాపు అన్ని స్థానాలలో తన అభ్యర్థులను ప్రకటించింది. అయితే నామినేషన్ల ఉపసంహరణకు గుడువు మిగిలి వున్న నేపథ్యంలో కొన్ని స్థానాలలో తమ అభ్యర్థులను నిలిపే అంశంపై ఎన్‌పిఎఫ్‌తో చర్చించనుంది.

ఆంగ్లానువాద పత్రాలను అందించండి

అయోధ్య కేసులో సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : అయోధ్య రామజన్మభూమి-బాబ్రీమసీదు వివాదంలో అలహాబాద్ హైకోర్టుకు సమర్పించిన పత్రాల ఆంగ్లానువాదాన్ని రెండు వారాల్లోగా అందచేయాలని సుప్రీంకోర్టు గురువారం సంబంధిత వర్గాలను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన అప్పీళ్లపై మార్చి 14న విచారణ కొనసాగిస్తామని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం వివరించింది. ఈ కేసును అనుదిన ప్రాతిపదికన విచారించాలని తాము భావించటం లేదని తెలిపింది. ప్రస్తుతానికి దీనిని కేవలం 'భూ వివాదం'గా మాత్రమే తాము పరిగణిస్తున్నామన్న న్యాయపాలిక ఈ కేసులో ఇతరులను ఇంప్లీడ్ చేసే అంశంపై తరువాత నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన పౌరాణిక, చారిత్రక పత్రాల్లోని ముఖ్యాంశాలను ఇంగ్లీష్‌లోకి అనువదించి ఇప్పటి నుండి రెండు వారాల్లోగా తమకు అందచేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ పత్రాలను వీడియో క్యాసెట్ల రూపంలో అందచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇందుకు అయ్యే వ్యయాన్ని ఆయా పార్టీలే భరించాలని స్పష్టంచేసింది.

భారత్‌కు ప్రత్యేక దూతను పంపుతానన్న యమీన్

విదేశాంగశాఖ నో!

న్యూఢిల్లీ: మాల్దీవుల్లో ఏర్పడిన రాజకీయ సంక్షోభంపై చర్చించేందుకు ప్రత్యేక దూతను పంపుతామన్న అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ప్రతిపాదనను భారత్ తిరస్కరించిందని దౌత్యవర్గాలు తెలిపాయి. ఈ సంక్షోభంపై 'మిత్రదేశాల'తో చర్చించేందుకు యమీన్ ఇప్పటికే చైనా, పాకిస్తాన్ తదితర దేశాలకు ప్రత్యేక దూతలను పంపారని ఈ వర్గాలు వివరించాయి. ప్రోటోకాల్, షెడ్యూలింగ్ వంటి కారణాలతో భారత్ ఈ ప్రత్యేక దూత ప్రతిపాదనను తిరస్కరించినట్లు భారత ప్రభుత్వ వర్గాలు ధృవీకరించాయి. దీనితో పాటు యమీన్ ఎమర్జెన్సీ ప్రకటించటం తదితర చర్యల పట్ల కూడా భారత ప్రభుత్వం అసంతృప్తితో వున్నట్లు ఈ వర్గాలు వివరించాయి. ప్రత్యేక దూత పర్యటనకు సంబంధించిన సమాచారం మాల్దీవుల ప్రభుత్వం ముందుగా అందచేయకపోవటంతో పాటు ప్రధాని నరేంద్రమోడీ, విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌లు విదేశీ పర్యటనల్లో వుండటం కూడా ఈ తిరస్కరణకు కారణమని దౌత్య వర్గాలు వివరించాయి.

తాజ్‌మహల్ పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక : సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : రాబోయే నాలుగు వారాలలో తాజ్‌మహల్ భద్రత, పరిరక్షణ కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రపంచంలోని ఏడు అద్భుతాల్లో ఒకటైన తాజ్‌మహల్ సౌందర్యాన్ని, వైభవాన్ని కాలుష్యం దెబ్బతీస్తుండటంతో ఈ వ్యాఖ్యలు చేసింది. తాజ్ మహల్, తాజ్ ట్రెపెజియం జోన్ (టిటిజెడ్) చుట్టుపక్కల కొన్ని కార్యక్రమాలు ఎందుకు జరిగాయో వివరించాలని అత్యున్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాజస్తాన్‌లోని భరత్‌పూర్, ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, ఫిరోజాబాద్, మధుర, హత్రాస్, ఈత్ వరకు టిటిజె పరిధి 10,400 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది.

ముంబయిని కమ్మిన పొగ మంచు

ముంబయి : నగరంలోని స్కైలైన్ ప్రాంతమంతా మంచు దుప్పటి కమ్ముకొంది. ఈ పొగ మంచుతో నగరవాసు లు కళ్ళ మంటలు, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందిపడ్డారు. ఈ పరిస్థితిని కొందరు ట్వీట్ చేశారు. గత రాత్రి ముంబయి చూడటానికి పాత సినిమాల్లో ఉండే వార్ జోన్ సిటిలా ఉందని, మబ్బు, చీకటి కమ్ముకుని, లైట్ల నీడలతో ఉందని ప్రముఖ మాజీ క్రికెటర్ హర్షా బోగ్లే ట్వీట్ చేశారు. వాయు నాణ్యత సూచిక(ఎక్యూఐ)ప్రకారం బాంద్రాలో కాలుష్య తీవ్రత ఉదయం 10 గంటలకు పర్టిక్యులర్ మీటర్(పిఎం) 10 వద్ద 405 ఉంది. ఇది చాలా తీవ్రమైనది సూచిక తెలుపుతోంది. 400 పైగా పిఎం 10 వద్ద ఉంటే ఆరోగ్యకరమైన ప్రజలపై ప్రభావితం చేయడంతో పాటు ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారిని మరింత తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

తైవాన్‌లో కొనసాగుతున్న వరుస ప్రకంపనలు

10కి చేరిన మృతుల సంఖ్య

హుయాలిన్ : తైవాన్‌లో వరుస ప్రకంపనలతో గురువారం సహాయ కార్యకలాపా లకు అంతరాయం కలుగుతోంది. బుధవారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 10కి చేరుకుంది. 265మంది గాయపడ్డారు. 58మంది ఆచూకీ తెలియరాలేదు. దాంతో శిధిలాల కింద ఇంకా ఎవరైనా వుండొచ్చునని సహాయక సిబ్బంది పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టింది. గత 24 గంటల్లో 200కిపైగా ప్రకంపనలు సంభవిం చాయి. వాటిలో 5.7 అన్నిటికన్నా తీవ్రమైనదని, అయితే వచ్చే రెండు వారాల్లో ఇంకా ప్రకంపనలు సంభవించే అవకాశం వుందని అధికారులు తెలిపారు. ఈ ప్రకంపనల కారణంగా ప్రజలు ఇళ్ళలో వుండడానికి భయపడుతున్నారు. గురువారం ఉదయం 11గంటల సమయంలో కాస్త తీవ్రతతో కూడిన ప్రకంపన రావడంతో ప్రజలు ఒక్కసారిగా వీధుల్లోకి పరుగులు తీశారు.



మస్కట్‌తో బాలలు

శుక్రవారం నుండి దక్షిణకొరియాలో ప్రారంభం కానున్న ప్యోంగ్‌చెంగ్ వింటర్ ఒలింపిక్స్ మస్కట్ షూహోరాంగ్‌ను గాంగ్‌న్యూంగ్‌లో చూస్తున్న బాలలు

మరింత సన్నిహిత సహకారం

డచ్ రాజుతో చైనా అధ్యక్షుడి భేటీ

బీజింగ్ : కొత్త సంవత్సరంలో బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టును సంయుక్తంగా అమలుపరచడం ద్వారా పరస్పరం మరింత ప్రయోజనకరమైన, సన్నిహిత సహకారం కొనసాగించాలని చైనా, నెదర్లాండ్స్ అంగీకారానికి వచ్చాయి. చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, డచ్ రాజు విలియం అలెగ్జాండర్ సమావేశం సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. బుధ, గురువారాల్లో డచ్ రాజదంపతులు చైనాలో పర్యటించారు. వారిని సాదరంగా స్వాగతించిన జిన్‌పింగ్, 2014లో నెదర్లాండ్స్‌లో తాను జరిపిన పర్యటన వివరాలను గుర్తు చేసుకున్నారు. ఆ పర్యటనలో ఇరు దేశాల మధ్య బహిరంగ, ఆచరణాత్మక సమగ్ర సహకార భాగస్వామ్యం కుదిరింది.

ఇరు దేశాల మధ్య సంయుక్త కృషి ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చామని, పరస్పర పర్యటనల ఫలితాలను అమలు చేశామని చెప్పారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య రాజకీయ విశ్వాసం, పరస్పర గౌరవం, ప్రయోజనాలు, వాణిజ్యం, పెట్టుబడులు, సంస్కృతి రంగాల్లో పెరుగుతున్న సహకారాన్ని జిన్‌పింగ్ అభినందించారు. త్వరలో చైనా నూతన సంవత్సరం సందర్భంగా రాజు విలియం అలెగ్జాండర్, జిన్‌పింగ్‌కు అభినందనలు తెలిపారు.

వైట్‌హౌస్ స్టాఫ్ సెక్రటరీ రాజీనామా

వాషింగ్టన్ : వైట్‌హౌస్ స్టాఫ్ సెక్రటరీ రాబ్ పోర్టర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన మాజీ భార్యలు ఇద్దరి నుండి గృహ హింస ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నా రు. అయితే రాజీనామా ఎప్పటి నుండి అమ ల్లోకి వస్తుందో ఆయన చెప్పలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకానికి వెళ్ళే డాక్యుమెంట్ల వ్యవహారాలు చూసే సీనియర్ సలహాదారైన పోర్టర్ తనపై తన మాజీ భార్యలు చేసిన ఆరోపణలు పత్రికలకెక్కడంతో ఈ చర్య తీసుకున్నారు.

అయితే వారు చేసిన ఆరోపణ లు పూర్తిగా అవాస్తవాలని పోర్టర్ వ్యాఖ్యానిం చారు. ఈమేరకు వైట్‌హౌస్ ఒక ప్రకటన విడు దల చేసింది. ఈ విషయంలో తాను చాలా పారదర్శకంగా, వాస్తవికతతో వ్యవహరిస్తున్నా నని, అయితే ఈ తప్పుడు ప్రచారంలో ఇక జోక్యం చేసుకోదలచుకోలేదని పోర్టర్ చెప్పారు. చాలా మెతకగా, మృదు స్వభావిగా కనిపించే పోర్టర్‌పై ఇటువంటి ఆరోపణలు రావడం వైట్ హౌస్‌లో చాలా మందిని విస్మయపరిచింది.

ఏప్రిల్ 22న వెనిజులా ఎన్నికలు

కారకస్ : ఎన్నికలను ఎలా నిర్వహించాలనే విషయమై ప్రభుత్వ, ప్రతిపక్షాల మధ్య జరిగిన చర్చలు విఫలమైన గంటల వ్యవధిలోనే వెనిజులా ఎన్నికల తేదీని నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ ప్రకటించింది. ఏప్రిల్ 22వ తేదీన ఎన్నికలు జరుగుతాయని ఎలక్టోరల్ కౌన్సిల్ అధ్యక్షుడు తిబిసి లూసినా ప్రకటించారు. సాధారణంగా అయితే ఈ ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహించాల్సి వుంది. కానీ ఇంత తొందరగా ఎన్నికలు నిర్వహించడాన్ని అమెరికా, యూరప్, లాటిన్ అమెరికా దేశాలు ఖండించాయి. ఈ పరిస్థితి రాజకీయ చర్చలకు మంచిది కాదని, ప్రతిపక్షా నికి అస్సలు మంచిది కాదని పేర్కొన్నాయి.

ఇది ప్రజాస్వామ్యంపై దాడి

మాల్దీవుల్లో అణచివేత చర్యలపై మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్య



మాలె : మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ అసమ్మతి అణచివేతను "ప్రజాస్వామ్యంపై చేస్తున్న అన్ని రకాల దాడి"గా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్యానించారు. కాగా, అధికారం కోసం జరుగుతున్న ఈ పోరాటంలో అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ పైచేయి సాధించినట్లుగా కనబడుతోంది. గత వారం తొమ్మిది మంది రాజకీయ ఖైదీలను విడుదల చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో మాల్దీవుల్లో ఒక్కసారిగా రాజకీయ సంక్షోభం నెలకొంది. ఈ రూలింగ్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ప్రతిపక్ష నేత మహ్మద్ నషీద్ తిరిగి దేశంలోకి రావడానికి వీలు కల్పించింది. కానీ కోర్టు రూలింగ్‌తో యమీన్ ఏకీభవించలేదు. పైగా 15రోజుల పాటు అత్యవసర పరిస్థితి ప్రకటించారు. న్యాయ వ్యవస్థ, పార్లమెంట్ అధికారాలను కుదించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో ఉన్నత న్యాయమూర్తిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు లేవనెత్తిన అభ్యంతరాలను ఉదహరిస్తూ మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు గతవారం రూలింగ్‌ను రద్దు చేసినట్లు ప్రకటించారు. అంటే ఈ ఏడాది చివరిలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ముందుగా ప్రకటించినట్లుగా యమీన్‌పై పోటీ చేయడానికి ప్రతిపక్ష నేత నసీద్ స్వదేశానికి తిరిగివస్తే అరెస్టు చేసే అవకాశం వుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో రాజధాని మాలె వీధులు ప్రశాంతంగా వున్నాయి. ఎక్కడా ప్రతిపక్షాల నిరసనల ఊసే లేదు. అయితే అత్యవసర పరిస్థితి చట్టాలను ఉపయోగించి పోలీసులు అరెస్టులు కొనసాగిస్తున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బంధువులను, ప్రతిపక్ష నేత కుమారుడిని అరెస్టు చేశారు.

అమెరికా నేతలతో భేటీ అయ్యే ఆలోచనలేదు

ఉ.కొరియా స్పష్టీకరణ

సియోల్: ద.కొరియా నిర్వహిస్తున్న శీతాకాల ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో తమ ప్రతినిధులెవరూ అమెరికా నేతలతో భేటీ అయ్యే ఆలోచన కానీ, ప్రతిపాదన కానీ లేదని ఉ.కొరియా స్పష్టం చేసింది. శుక్రవారం నాడు ప్రారంభం కానున్న శీతాకాలం ఒలింపిక్ క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ఇప్పటికే క్రీడలు జరిగే ప్రాంతం పియాంగ్ చాంగ్ గ్రామానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ సోదరి కిమ్ యాంగ్ నామ్‌తో సహ పలువురు ఉ.కొరియా సీనియర్ ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. తాము చర్చల కోసం అమెరికాను ఎన్నడూ ప్రాధేయపడలేదని, ఇదే వైఖరి భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని ఉ.కొరియా ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ అధికార వార్తాసంస్థ కెసిఎన్ఎ వెల్లడించింది. ద.కొరియాలో తమ పర్యటన సమయంలో అమెరికా ప్రతినిధులెవరినీ కలిసే ఆలోచన లేదని ఉ.కొరియా ప్రతినిధిబృంద సభ్యుడు చోయాంగ్‌సామ్ చెప్పారు. ఈ క్రీడలను తమ మధ్య విభేదాల తొలగింపునకు వేదికగా ఉపయోగించుకోవాలని ద.కొరియా భావిస్తుండగా, ఇందుకు తాము సిద్ధంగా లేమని, ఈ క్రీడలను రాజకీయ వేదికగా ఉపయోగించుకోవాలని తాము భావించటం లేదని సామ్ స్పష్టం చేశారు.

ఉ.కొరియా నేతలకు అనుమతి : ఐరాసకు ద.కొరియా వినతి

శుక్రవారం నుండి ప్రారంభమవుతున్న ఒలింపిక్ క్రీడలకు హాజరయ్యేందుకు ఉత్తరకొరియా నేతలపై ఆంక్షలు తొలగించాలని ద.కొరియా ఐరాసకు విజ్ఞప్తి చేసింది. ఐరాస నుండి ఆంక్షలను ఎదుర్కొంటున్న ఉ.కొరియా జాతీయ క్రీడల మార్గదర్శక కమిటీ ఛైర్మన్ చో హుయిని ఆంక్షల నుండి మినహాయించాలని ఐరాసకు తమ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు ద.కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన లో వివరించింది. ఈ విజ్ఞప్తిపై భద్రతా మండలిలోని ఆంక్షల కమిటీ సభ్యులెవరూ అభ్యంతరం చెప్పకుండా వుంటే తాము అనుమతిస్తామని ఐరాస వర్గాలు వెల్లడించాయి.

అమెరికా దాడుల్లో వందమంది సిరియా సైనికులు మృతి

బీరుట్ : సిరియా సైనికులను వందమందిని హతమార్చామని అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ కూటమి గురువారం తెలిపింది. అమెరికా మద్దతు గల కుర్దిష్ బలగాల నియంత్రణలో గల డెర్ ఎజార్ ప్రావిన్స్‌లో కీలకమైన చమురు, గ్యాస్ కేంద్రాలపై అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కి విశ్వాసపాత్రులుగా వున్న బలగాలు ముందుగా దాడి జరిపాయి. తదనంతరం సంకీర్ణ బలగాలు దాడులు జరిపాయి. సిరియా ప్రభుత్వం రసాయన ఆయుధాలను ఉపయోగిస్తోందన్న అనుమానాలు పెరిగిన నేపథ్యంలో అమెరికా, సిరియా మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లాయి. ఈ తరుణంలో ఈ ఘర్షణ చోటు చేసుకుంది. ఇదిలావుండగా వరుసగా నాల్గవ రోజు కూడా సిరియా యుద్ధ విమానాలు రెబెల్స్ అదుపులో వున్న తూర్పు ఘౌటా ప్రాంతంపై బాంబు దాడులు జరిపాయి. సోమవారానికి మృతుల సంఖ్య 170కి చేరింది. ఆ దాడులను తిప్పికొట్టేందుకు సంకీర్ణ బలగాలు కూడా ఎదురు దాడులు నిర్వహించాయని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఈ దాడుల్లో వంద మందికి పైగా సిరియా ప్రభుత్వ బలగాలు మరణించాయని అమెరికా సైనికాధికారి తెలిపారు. కాగా 45మందే మరణించారని సిరియా మానవ హక్కుల పర్యవేక్షక కేంద్రం తెలిపింది. ఎస్‌డిఎఫ్ అదుపులో వున్న ప్రాంతంలో గల కీలకమైన చమురు, గ్యాస్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడానికే ప్రభుత్వం ఈ దాడి జరిపినట్లు కనిపిస్తోందని బ్రిటన్ ప్రధాన కేంద్రంగా పనిచేసే పర్యవేక్షణ గ్రూపు అధ్యక్షుడు రమి అబ్దుల్ రహమాన్ తెలిపారు.

పాక్‌లో ఒకరికి ఉరి

మరో ఐదుగురికి యావజ్జీవం

హరిపూర్, పాకిస్తాన్ : దైవ దూషణకు పాల్పడ్డాడంటూ విద్యార్థిని హతమార్చిన కేసులో పాకిస్తానీ కోర్టు ఒక వ్యక్తికి ఉరి శిక్షతో పాటు మరో ఐదుగురికి యావజ్జీవ శిక్ష విధించింది. గత ఏప్రిల్‌లో వాయువ్య నగరమైన మర్దాన్‌లో అబ్దుల్ వలీ ఖాన్ యూనివర్శిటీలో మషాల్ ఖాన్ (23)ను హాస్టల్ రెండవ అంతస్తు నుండి కిందకు తోసివేశారు. అతని బట్టలూడదీసి, హింసించి ,కాల్చి చంపారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. దారుణమైన ఈ దాడి వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇస్లాం పండితులతో సహ అందరినుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పలు నగరాల్లో నిరసనలు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనలో ఇమ్రాన్ సుల్తాన్ మహ్మద్‌కి ఉరి శిక్ష, ఐదుగురికి యావజ్జీవం విధించగా, మరో 25మందికి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. 26మందిని నిర్దోషులుగా విడిచిపెట్టారు. కాగా కోర్టు నిర్ణయానికి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలుచేయనున్నట్లు డిఫెన్స్ లాయర్ సాద్ అబ్బాసి తెలిపారు. ఇమ్రాన్ సుల్తాన్ అంతమకుముందు తన నేరాన్ని అంగీకరించాడు.

మొదటి పేజీ తరువాయి

బంగ్లా మాజీ ప్రధాని జియాకు ఐదేళ్ల జైలు

దృష్టిలో వుంచుకుని ఐదేళ్ల సాధారణ జైలు శిక్షను విధిస్తున్నట్లు న్యాయమూర్తి మహ్మద్ అఖ్తరుజ్జామన్ తన తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో సహ నిందితుడైన ఆమె కుమారుడు తారిక్ రెహ్మాన్‌తో పాటు మరో నలుగురు సహచరులకు పదేళ్ల వంతున జైలుశిక్ష విధించారు. ఖలీదా జియాకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ప్రతిపక్ష కార్యకర్తలకు, భద్రతా దళాలకు మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. కోర్టు వద్ద నిషేధాజ్ఞలు ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో కనీసం ఐదుగురు పోలీసు అధికారులు గాయపడ్డారని, రెండు మోటార్ సైకిళ్లను ఆందోళనకారులు దగ్ధం చేశారని ఒక ప్రైవేట్ టెలివిజన్ ఛానల్ తన వార్తా కథనంలో వెల్లడించింది.

రేపటి నుంచి సిపిఎం రాష్ట్ర మహాసభలు

తెలిపారు. మహాసభలకు వివిధ జిల్లాల నుంచి ఎంపికైన 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని, దీనితోపాటు మరి కొంతమంది పరిశీలకులు, ఆహ్వానితులు హాజరుకానున్నారని తెలిపారు. పదో తేదీ ఉదయం పది గంటల నుంచి ప్రతినిధులు సభ ప్రారంభమవుతుందని, వివిధ వామపక్షాల నాయకులు ఈ సభలో పాల్గొంటారని వెల్లడించారు. మధ్యాహ్నం ప్రదర్శన, బహిరంగ సభ అనంతరం తిరిగి ప్రతినిధుల సభ కొనసాగుతుందని, 11, 12 తేదీల్లో ఈ సభలు కొనసాగుతాయని, రాష్ట్రంలో వివిధ తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానం చేసి కార్యాచరణ రూపొందించనున్నామని తెలిపారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంపికైన, శిక్షణ పొందిన 300 మంది కళాకారులు, 250 మంది వలంటీర్లు పాల్గొంటున్నారని, వారంతా తమ పనులను పక్కనపెట్టి ఎటువంటి ప్రతిఫలమూ ఆశించకుండా స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారంటూ ఆయన కళాకారులకు, వలంటీర్లకు ఆహ్వానం సంఘం తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 'భీమవరం రాజకీయ కేంద్రమే కాదు.. కళా సాంస్కృతిక కేంద్రం కూడా, ఎంతోమంది పేరు ప్రఖ్యాతులు పొందిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఈ ప్రాంతంలో పుట్టి పెరిగి కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. భీమవరం ఒక పెద్ద విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందింది. వీరందరినీ భాగస్వాములను చేసేలా మహాసభల సందర్భంగా భీమవరంలో తొలి ప్రయత్నంగా 'భీమవరం ఫెస్ట్'ను కూడా నిర్వహిస్తున్నాం. రాబోయే రోజుల్లో ప్రజల నుంచి లభించే స్పందన ఆధారంగా ఈ కార్యక్రమాలు విస్తృతం చేసి నిరంతరం కొనసాగిస్తాం' అన్నారు. మహాసభలకు పట్టణ అలంకరణలో భాగంగా తోరణాలు, అమరవీరుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు, ముఖద్వారాలు ఏర్పాటు చేశామని, బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకోవాలి

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లాలో అంగన్‌వాడీలకు కలెక్టర్ ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెనక్కు తీసుకోవాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం స్త్రీ శిశు సంక్షేమ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. బేబిరాణి, కె. సుబ్బరావమ్మ ప్రకటనలో తెలిపారు. గతనెల 23న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్న దాదాపు 3 వేల మంది అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సు ప్రకారం ప్రతి కార్మికునికి కనీస వేతనం నెలకు రూ 18 వేలు అమలు చేయడంలేదని విమర్శిం చారు. వేతన పెంపు, సంబంధం లేని పనులు అప్పగించరాదని, ఇంకా పలు డిమాండ్లతో అంగన్‌వాడీ వర్కర్లు గత నెల 23న సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఇప్పటికీ వారికి రెండు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని సెంటర్లకు దాదాపు ఏడాది నుంచి అద్దె చెల్లించ డంలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిం చాలని ఆందోళన బాట పడుతున్నట్లు ముందుగానే ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేశామని తెలిపారు. అయి నా పశ్చిమగోదావరి కలెక్టరు అంగన్‌వాడీల పట్ల కక్షతో వారిని భయభ్రాంతులకు గురిచేసేలా బెదిరిస్తూ షోకాజ్ నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. నోటీసులు వెనక్కి తీసుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళలు చేపడతామని హెచ్చరించారు.

జెఎసి ఏర్పాటుకు ముమ్మర కసరత్తు

జెపితో పవన్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీల అమలు కోసం ప్రత్యామ్నాయ వేదికగా జెఎసి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని తెలిపిన జనసేన నేత పవన్ కల్యాణ్ గురువారం నుంచే అందుకు కసరత్తు చేప ట్టారు. ఉదయం లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్ర కాశ్ నారాయణ(జెపి)కు ఫోన్ చేసిన పవన్ కల్యాణ్, మధ్యా హ్నం హైదరాబాద్ బేగంపేటలోని లోక్‌సత్తా కార్యాలయం లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం జెపితో కలిసి మీడియాతో మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చడం లో కేంద్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోం దన్నారు. ఈ పరిస్థితుల్లో హక్కుల సాధన కోసం జెఎసి ఏర్పాటు చేయడం ఒక్కటే పరిష్కారమన్నారు. ఈ జెఎసి ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిమాండ్లకే కాకుండా తెలంగాణ రాష్ట్రం లోని డిమాండ్ల పరిష్కారానికీ కృషి చేస్తుందని తెలిపారు. విభజన సమ యంలో రెండు రాష్ట్రాలకు కేంద్రం అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. విభజన సమయంలో జెపి ఎంతో అధ్యయనం చేశారని, అందుకే హక్కుల సాధనకు ఏం చేయాలనే దానిపై దిశానిర్దేశం చేయాలని కోరానని పవన్ తెలిపారు.



కేంద్రం బాధ్యతలను విస్మరిస్తోంది : జెపి

విభజన హామీలు అమలు జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేయాలన్న పవన్ కల్యాణ్ ఆలోచనకు తాను మద్దతిస్తున్నానని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ తెలిపారు. ఒక గంటలో సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఎవరికీ లేదని, అందరం కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి అవసరముందన్నారు. ఏరు దాటక తెప్ప తగలేశారనే సామె తను కేంద్రం నిజం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమ యంలో మోడీ కూడా వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నిధులు విడుదల చేయలేదన్నారు. విభజన చట్టం ప్రకారం ఆర్థిక లోటు, రైల్వేజోన్, రాజధాని నిర్మాణం తదితర అభివృద్ధిలో కేంద్రం ఎపికి అండగా నిలవాల్సిందేనన్నారు. అలాగే తెలంగాణకు పరిశ్రమలు, ఎయిమ్స్ విషయంలో సాయం అందించాలన్నారు. రాజకీయాల కోసం ప్రజలను బలిచేయొద్దని హితవు పలికారు.

వాటర్ ఆడిట్, బడ్జెట్‌కు కార్యాచరణ

సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నీటి ఆడిట్, బడ్జెట్ రూపకల్పనకు వీలుగా ఈనెలాఖరులోగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సిఎస్ గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ఏడాదిగా గ్రామాల్లోని చెరువులు, రిజర్వాయర్లు, బావులు తదితర నీటి వనరుల నుంచి లభ్యమయే నీరు, ప్రజల తాగునీటి అవసరాలకు, పశువులకు, వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర అవసరాలకు అవసరమైన నీరు ఎంతనేది శాస్త్రీయ విధానంలో లెక్కించి అడిట్, బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుందన్నారు. నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకాల నిధులతో చెక్ డ్యాంలు, పెర్కులేషన్ ట్యాంక్‌లు నిర్మించాలని సూచించారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషన్ కుమార్ మాట్లాడుతూ వాటర్ బడ్జెట్, ఆడిట్‌కు సంబంధించి ఎపి వాటర్ రిసోర్సు, ఇన్మర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పేరుతో వెబ్‌సైట్ రూపొందించినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి మాట్లాడుతూ భూగర్భజలాలు 15 మీటర్ల కంటే తక్కువ ఉన్న గ్రామాల్లో వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో 1,127 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు వీలుగా నిర్మాణాలు చేపడతా మన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ కమీషనర్ రామాంజనేయులు, అధనపు కమీషనర్ శివప్రసాద్, జలవనరుల శాఖ ఈఎన్‌సి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రూర్బన్ పథకం అమలుకు త్వరగా చర్యలు తీసుకోవాలి

నేషనల్ రూర్బన్ మిషన్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అగ్రి ప్రోసెసింగ్, ఆగ్రో సర్వీసెస్, వేర్ హౌసింగ్, పూర్తి పరికరాలతో కూడిన మొబైల్ హెల్త్ యూనిట్లు ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి లైట్లు, డ్రైన్లు, రహదారులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శులు రావత్, నీరబ్‌కుమార్ ప్రసాద్, పిఆర్ కమీషనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆర్ఐడిఎఫ్ ఖర్చు 58 శాతమే

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాబార్డ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వివిధ పనులకు ఇస్తున్న రుణాన్ని సక్రమంగా ఖర్చు చేయక పోవడంపై నాబార్డ్ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. పనులు వేగవంతం చేయకపోతే కొత్త నిధులకు ఇబ్బందులు తప్పవని అంతర్లీనంగా హెచ్చ రికలు జారీ చేసింది. తాజా ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడిఎఫ్) ప్రాజెక్టుల కోసం నాబార్డ్ నుంచి రూ. 1200 కోట్లు రుణం వచ్చింది. అయితే ఇప్పటివరకు దీంట్లో కేవలం 704 కోట్లు (58 శాతం) మాత్రమే ఖర్చు చేశారు. ఇక కేవలం ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న రెండు నెలల్లోనే రూ. 500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే నాబార్డ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. గత ఏడాది కూడా నిధుల వ్యయంపై నాబార్డ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు, మూడు లేఖలు వచ్చాయి. నిధులను సక్రమం గా, త్వరగా వినియోగించకపోతే దాని ప్రభా వం కొత్తగా రావాల్సిన నిధులపై పడతుందన్న హెచ్చరికలు కూడ జారీ చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు మృతి

ప్రజాశక్తి-చింతూరు / కాకినాడ

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బెనగల్ సమీపంలోని హిరోలీ అటవీ ప్రాంతంలో పోలీసులకూ, మావోయిస్టులకూ మధ్య బుధవారం రాత్రి జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు దళకమాండర్ ఉంగా (35) మృతి చెందినట్లు ఎఎన్ ఎస్‌పి జిహెచ్ భగేల్ తెలిపారు. మావోయిస్టులు బేస్ క్యాంప్‌పై దాడికి యత్నిస్తున్నారనే సమాచారంతో కూంబింగ్ చేపట్టామని చెప్పారు. పోలీస్ కాల్పుల్లో మరికొంతమంది మావోయిస్టులు తీవ్రంగా గాయపడి ఉంటారని, అక్కడి వాతావరణం గమనిస్తే తెలిసిందని భగేల్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

మళ్లీ పాతపాటే!

మాత్రమే కేటాయించారు. ఏపి మిత్రులు తనను కలుస్తూనే ఉంటారని, ఏపి విభజన సమస్యలపై తనకు సానుభూతి ఉందని అన్నారు. చెప్పిన మాట ప్రకారమే పెద్ద ఎత్తున ఏపికి నిధులు ఇచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించామని తెలిపారు. ప్యాకేజీలో చాలా అంశాలను అమలు చేశామని, మరికొన్ని అంశాలు అమలు చేసేదశలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతికీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా డబ్బులిచ్చామని పేర్కొన్నారు. ఏపికి నిధులు ఇవ్వాలని అడుగుతున్నారు కానీ.. కొద్దిగా భారం తగ్గితే ఏపి లాంటి రాష్ట్రాలకు నిధులు ఇచ్చే అవకాశముంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు తాము మద్దతిచ్చినా ఏపి హక్కుల కోసం తాము పోరాడామన్నారు. ఏపికి ఇచ్చిన హామీల్లో ఇప్పటికే తాము కొన్ని అమలు చేశామని, మరికొన్ని అమలు దశలో ఉన్నాయని తెలిపారు. ఏపికి పలు జాతీయ విద్యా సంస్థలను కేటాయించామని, తెలంగాణకు కూడా జాతీయ విద్యా సంస్థలు కేటాయించామని, వాటికి నిధులు ఇప్పటికే ఇచ్చామని, నిధులివ్వడం కొనసాగిస్తామని జైట్లీ తెలిపారు. ఏపి రాజధాని నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాలకు కూడా కొన్ని నిధులు ఇచ్చామని తెలిపారు. రెవెన్యూ లోటుకు సంబంధించి ఏపి అధికారులతో కలిసి లెక్కలు వేస్తున్నామని, బుధవారం నుంచీ కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ అధికారులు చర్చలు కూడా జరుపుతున్నారని అన్నారు. రైల్వే జోన్‌కు సంబంధించి కొన్ని విషయాలు తేలాల్సి ఉందని అన్నారు. నాబార్డ్ ద్వారా పోలవరం ప్రాజెక్ట్ కోసం ఇప్పటికే నాలుగున్నరవేల కోట్ల రూపాయలలిచ్చామని, పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా తీసుకుని నిధులు ఇస్తున్నామని తెలిపారు. నాబార్డ్ ద్వారా నిధులు ఇవ్వాలని జనవరి 3న ఏపి సిఎం లేఖ రాస్తే అలానే చేస్తున్నామని తెలిపారు. అదనపు నిధులను ఈఏపి ద్వారా ఇవ్వాలని భావించామంటూ ప్రకటించారు. నాబార్డ్ నుంచి అదనపు నిధులిస్తే....రుణ పరిమితి పెరుగుతుందని చెప్పామంటూ జైట్లీ తెలిపారు. రైల్వే జోన్, పెట్రో కారిడార్‌కు సంబంధించి చర్చలు జరుపుతున్నామని వివరించారు. అయితే, తన ప్రసంగంలో ఎక్కడా నిర్దిష్ట ప్రకటన చేయలేదు. అదనపు నిధుల గురించి గానీ, ఈఎపిలపై గానీ స్పష్టత ఇవ్వలేదు. విద్యా సంస్థలు, పోలవరం, రాజధానిపై ఖచ్చితమైన హామీ ఇవ్వలేదు. రెవెన్యూ లోటు, రైల్వే జోన్ గురించి ప్రస్తావన లేదు. జైట్లీ ప్రకటనపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపిలు ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో స్పీకర్ సుమిత్ర మహాజన్ సభను శు క్రవారానికి వాయిదా వేశారు.

కొత్త సీసాలో పాత సారా: మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైసిపి

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సమస్యలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో చేసిన ప్రకటన కొత్త సీసాలో పాత సారాలా ఉందని వైసిపి ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా నిలబెట్టాలనే చిత్తశుద్ధి నిజంగా ఉంటే కేంద్రంలోని మంత్రులతో, ఎంపిలతో రాజీనామా చేయించాలని అన్నారు.

పాత కథే మళ్లీ వినిపించారు: సిఎం రమేష్, టిడిపి

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పాత కథే మళ్లీ వినిపించారని టిడిపి ఎంపి సిఎం రమేష్ విమర్శించారు. అరుణ్‌జైట్లీ ప్రకటనపై టిడిపి ఎంపిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపి ప్రజలను మరోసారి మోసం చేశారని దుయ్యబట్టారు. పాత కథనే మళ్లీ వినిపిస్తున్నారని, ఏపిని కేంద్రం చిన్నచూపు చూస్తోందని టిడిపి నేతలు ధ్వజమెత్తారు. ఏపి చాలా ఇబ్బందుల్లో ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని సిఎం రమేష్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు పట్టిన గతేంటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. హోదా బదులు ప్యాకేజి ఇస్తామన్నారని, నిధులు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. రైల్వేజోన్ హామీ నెరవేర్చాల్సిందేనని తేల్చిచెప్పారు. మిత్రపక్షంగా ఉన్న తమకు న్యాయం జరగడం లేదని సిఎం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సారి సొంత బ్యానర్‌లో



ప్రభాస్

ప్రభాస్ 'బాహుబలి' తర్వాత చేస్తున్న సినిమా 'సాహో'. శ్రద్ధా కపూర్ కథానాయికగా చేస్తుంది. సూజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సైంటిఫిక్ థ్రిల్లర్ నిర్మాణ పనుల్లో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత ఈ డార్లింగ్ చేయబోయే చిత్రం ఏమిటన్నది స్పష్టత వచ్చేసింది. ఈ సారి తన తదుపరి చిత్రం ఆయన సొంత బ్యానర్‌లో చేస్తున్నాడు. అదేనండీ... ప్రభాస్ పెదనాన్న కృష్ణంరాజు ప్రొడక్షన్ గోపీకృష్ణ మూవీస్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందనుంది. ఏప్రిల్ చివరి వారంలో చిత్రీకరణను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నెల చివరిలో ప్రభాస్ దుబాయ్ వెళ్లనున్నారు. ఏప్రిల్ 20న తిరిగి రానున్నారు. కృష్ణంరాజు నిర్మించనున్న ఈ ప్రేమకథా చిత్రానికి 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం షూటింగ్ మొత్తం యూరప్‌లో ఉంటుందట.

హీరోయిన్ ఎవరు?



బాలకృష్ణ



వెంకటేష్

చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ వంటి అగ్రతారలు కొత్త చిత్రాలు తీస్తున్నారంటే వీరికి కథానాయికలుగా ఎవరు చేస్తారు? అసలు ఎవరిని తీసుకోవాలన్నదానిపైనే ఎక్కువగా చర్చ జరుగుతుంది. సినిమా ప్రారంభం కాకపోవడానికి కూడా సగం కారణం హీరయిన్ ఎంపికే. చిరంజీవి చేసిన 'ఖైదీ నంబర్ 150' చిత్రానికి హీరోయిన్‌గా చాలా మందిని అనుకున్నారు. చివరకు బాలీవుడ్ నుంచి దీపికా పదుకొనే చేస్తుందని ప్రచారం జరిగింది. ఎవరూ కుదరక కాజల్‌ను ఎంపిక చేశారు. ఇప్పుడు బాలయ్యకు, వెంకటేష్‌కు అదే సమస్య వచ్చింది.

తెలుగు సినిమాల్లో కథానాయిక పాత్రకు ప్రాధాన్యమూ ఉండదు...వాళ్లు లేకుండా సినిమాలు నిర్మించడమూ అరుదే. ఏ సినిమాను తీసుకున్నా అందాల ఆరబోత కోసమో, పాటల కోసమో హీరోయిన్లను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి అగ్ర హీరోల సినిమాల్లో ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు పెద్ద హీరోల సరసన కథానాయికలుగా చేసేవారే కరువైపోతున్నారు. చిరంజీవి రీ ఎంట్రీ చేస్తున్నప్పుడు ఆయన సరసన చేసే కథానాయిక ఎవరు అన్నదానిపై పెద్ద చర్చ జరిగింది. మొన్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో కూడా కథానాయికపైనే ఎక్కువ చర్చ నడిచింది. బాలీవుడ్, హాలీవుడ్‌లలో లేని వింత పరిస్థితి తెలుగు చిత్రసీమలోనే ఉంటుంది. వయసు మీరిన వారితో నటిస్తే అవకాశాలు రావనే భావన కథానాయికల్లో ఎక్కువగా ఉంది.

అందుకే అగ్రహీరోలకు హీరోయిన్లు దొరకడం కష్టమైపోతుంది. ఒక వేళ దొరికినా అప్పటికే చేసిన కాంబినేషనే కొత్త చిత్రాల్లోనూ పునరావృతమవుతుంది. నయన తార, అనుష్క, శ్రియ...వీళ్లే అగ్ర హీరోలకు హీరోయిన్లు. ఎన్ని సినిమాలు చేసినా వీళ్ల కాంబినేషనే మళ్లీ మళ్లీ వస్తుంది.

బాలకృష్ణ ఎన్టీఆర్ బయోపిక్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. దానికి 'ఎన్టీఆర్' అనే పేరు కూడా పెట్టేశారు. ఎన్టీఆర్‌గా బాలయ్య చేస్తున్నారు. తేజ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమాలో బసవతారకం పాత్ర కోసం చిత్రబృందం తెగ గాలిస్తుంది. ఎవరూ కుదరలేదట. నిత్యమేనన్‌ని ఈ పాత్ర కోసం సంప్రదిస్తే..తన వల్లకాదనట్టు సున్నితంగా చేయనని చెప్పేసిందట. ఈ చిత్రం వచ్చే నెల నుంచి షూటింగ్ మొదలు కానుంది.

వెంకటేష్ హీరోగా తేజ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కబోతుంది. 'బాబు బంగారం' తర్వాత వెంకటేష్ చేస్తున్న సినిమా ఇది. ఇది ఇంకా ఎప్పుడు పెట్టాలపైకి వెళ్ల నుందో తెలియదు కానీ ఇందులో ఓ కథానాయికను ఎంపిక చేశారు. కానీ మరో కథానాయిక కోసం అన్వేషిస్తున్నారు. నయన తారను ఎంపిక చేద్దామని చూసినా వెంకీ, నయన కాంబినేషన్ మొన్ననే 'బాబు బంగారం' వచ్చింది. అందులో నయన పారితోషికం ఎక్కువ. అనుష్కను చేద్దామంటే హీరోను డామినేట్ చేస్తుందేమోనని భయం. అందుకే కొత్త అమ్మాయిని ఎంపిక చేయాలని ఆలోచన చేస్తుందీ చిత్రబృందం.

వచ్చే నెలలోనే ఎన్టీఆర్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. మార్చి రెండో వారంలో చిత్రీకరణకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ సినిమాలో తారక్ సరసన నటించేవారు ఎవరో ఇంకా స్పష్టత రాలేదు. పూజా హెగ్డే, అను ఇమ్మాన్యుయేల్, బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్లలో ఎవరైనా నటించే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతుంది. మరోపక్క తారక్ ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్‌లో నటించబోతున్నారు. ఈ సినిమాకూ కథానాయిక ఎవరో ఇంకా తేల్లేదు. ఇందులో తారక్‌తో పాటు రామ్‌చరణ్ కూడా నటించనున్నారు.



ఎన్టీఆర్

16న 'సోడా గోలీ సోడా'



మానస్, నిత్య నరేష్

ఎస్.బి ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై చక్రసీద్ సమర్పణలో మల్లూరి హరిబాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సోడా గోలీ సోడా'. నిర్మాత భువనగిరి సత్య సింధూజ. మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్లు. ఈ చిత్రం ఈనెల 16న విడుదల కాబోతుంది. నిర్మాత భువనగిరి సత్య సింధూజ మాట్లాడుతూ 'పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అన్ని వర్గాలను ఆకర్షించే కంటెంట్ ఉంది. ఎక్కడా వెనుకాడకుండా చిత్రాన్ని కమర్షియల్ విలువలతో నిర్మించాం. దర్శకుడు అనుకున్నట్లు చిత్రాన్ని తీర్చిదిద్దాడు. సెన్సార్ నుండి క్లీన్ యూ సర్టిఫికెట్ వచ్చింది. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. 16న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేస్తున్నామ'ని అన్నారు.

దండుపాళ్యం3

విభిన్నమైన కథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగమైన నటనతో దండు పాళ్యం చిత్రాలు క్రేజ్ సంపాదించుకున్నాయి. ఇదే తరహాలో 'దండుపాళ్యం3' చిత్రం కూడా విడుదలకు సిద్ధమైంది. శ్రీనివాస రాజు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మార్చి 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. కన్నడలో రూపొందిన ఈ చిత్రం తెలుగు హక్కుల్ని వాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ పొందింది. శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి తెలుగులో అందిస్తున్నారు. సాయి కృష్ణ పెండ్యాల సహ నిర్మాత. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. త్వరలోనే భారీ స్థాయిలో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



'దండుపాళ్యం 3'లో పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే



రకుల్ ప్రీత్ సింగ్

ఆరు అడుగుల అందగాడైతేనే

రకుల్ ప్రీత్ సింగ్‌కి ఎటువంటి అబ్బాయి కావాలి? అతను ఎలా ఉండాలి అన్నదానిపై ఈ కథానాయిక బహిర్గతం చేసింది. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలన్నదానిపై అభిమానుల ముందుంచింది. ఆమె మొదట చెప్పిన మాట ఒకటే... అతను మాత్రం పొట్టిగా ఉండకూడదని షరతు విధించింది. రకుల్ పొడవు 5.9. అడుగులు. అందుకే తనకంటే కాస్తా పొడవుగా అంటే ఆరు అడుగుల అందగాడైతేనే చేసుకుంటుందట. ఈ విషయాన్ని ఇటీవల మాక్సిమ్ మాగ్జయిన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పింది. ప్రస్తుతం రకుల్ చేతిలో తెలుగు సినిమా ఒక్కటీ లేదు. కొత్త ప్రాజెక్టు కోసం అన్వేషిస్తుంది. బాలీవుడ్‌లో ఆమె కథానాయిక చేసిన 'అయ్యారీ' చిత్రం ఈనెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాతో వినాయక్ సినిమా అనగానే జోక్ అనుకున్నా

సాయి ధరమ్ తేజ్



"మెగాఫ్యాన్స్‌ను గౌరవించి బాలకృష్ణ చూపిన విధానం సంతోషాన్ని ఇచ్చింది. అలాంటివి చూశాక యంగ్ హీరోలు వారి నుంచి చాలా నేర్చుకోవాలి అనిపించింది. ఎంత ఎత్తుకు ఎదిగినా అందరినీ కలుపుకుని వెళ్ళాలని తెలుసుకున్నాం. 'బాహుబలి' లాంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ప్రభాస్ కూడా.. మా ఆడియోను ఆవిష్కరించడం మరింత సంతోషాన్ని ఇచ్చింది" అని కథానాయకుడు సాయి ధరమ్ తేజ్ అన్నారు. వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' ఈ శుక్రవారమే విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఆయన చెప్పిన విశేషాలు.

ఈ సినిమా బ్రేక్ ఇస్తుందా?

ప్రతి సినిమా బ్రేక్ ఇస్తుందని చేస్తాం. నాలుగు ఫ్లాప్స్ తర్వాత నాకు వినాయక్ మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు. ఇది వినాయక్‌తో పాటు కథ నచ్చి చేశాను. ఆకుల శివ కథను బాగా డైరెక్ట్ చేశారు. 'జవాన్' లాగే 'ఇంటిలిజెంట్' కూడా మైండ్ గేమ్ కాన్సెప్ట్. ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్ బాగా ఉంటుంది. అందుకే సినిమాపై నమ్మకమంతో ఉన్నాం'.

మీకు పర్సనల్‌గా ఇంటిలిజెంట్స్ ఎవరైనా ఉన్నారా?

నా గురువులంతా ఇంటిలిజెంట్సే. నాకు అవకాశం ఇచ్చిన వారంతా ఇంటిలిజెంట్సే.

ఒకేసారి మెగా హీరోల సినిమాల విడుదల ఎలా స్వీకరిస్తున్నారు?

వరుణ్, నేను చాలాసార్లు ఇదే విషయమై మాట్లాడుకున్నాం. కానీ పరిస్థితి అలా వచ్చింది. బహుశా ఇది మాకు పరీక్షేమో. రెండు సినిమాలు బాగా ఆడాలని మాత్రం అనుకుంటున్నాం.

చిరంజీవి రీమిక్స్ పాటలు మీరే చేస్తున్నారు?

అలా అని కాదు. దర్శకులు కూడా అవే కోరుకుంటున్నారు. నాకు అలా కలిసి వస్తున్నాయి. రీమిక్స్ చేసేటప్పుడు చాలా బాధ్యతగా ఫీలయ్యాను. ఇప్పటివరకు నాలుగు రీమిక్స్ చేశాను.

ఈ సినిమా కాన్సెప్ట్ ఏంటి ?

జీవితంలో మనం ఎదగడానికి కొందరు చాలా సహాయం చేస్తారు. అలాంటి వాళ్ళు కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్ళకి మనం కూడా సహాయం చేయాలి. ఆ సాయం చేయడానికి ఎంతదూరమైనా వెళ్లాలి. అనేదే ఈ సినిమా కాన్సెప్ట్.

ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?

ఇందులో నేనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కనిపిస్తాను. ఒక అనుకూల వాతావరణంలో ఉండే కుర్రాడు కొన్ని కారణాల వలన వాటిని వదిలి బయటికొచ్చి తన వాళ్ళ కోసం ఎలా పోరాడతాడు? కష్టాలను ఎలా తప్పించుకుంటాడు? అనేదే నా పాత్ర చిత్రీకరణ.

వినాయక్‌తో సినిమా చేయడం ఎలా ఉంది ?

నిజంగా వినాయక్‌తో సినిమా చేస్తానని అస్సలు ఊహించలేదు. వరుస ఫ్లాపుల్లో ఉన్న నన్ను 'ఖైదీ నెం 150' లాంటి భారీ హిట్ అందుకున్న తర్వాత పిలిచి మరీ సినిమా చేయడమనేది ఆయన గొప్పతనం. ఆయనతో వర్క్ చేసినందుకు చాలా సంతోషంగా ఫీలవుతున్నాను.

ఫ్లాప్‌లని మీరే చెప్పారు. ఆ తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

తప్పుచేసినప్పుడు రియలైజ్ అవ్వాలి. నేను చేసిన నాలుగు సినిమాలు ఆడలేదు. అందుకు కథలో డీల్ చేసిన విధానం ప్రేక్షకుడ్ని మెప్పించలేకపోయింది. దర్శకుడు అనుకున్న విధానంలో తీశాడు. అందుకే ఆడియన్స్ నచ్చేవిధంగా చేయలేకపోయింది. 'జవాన్' కథ విన్నప్పుడు హీరో ఇంటిలోనే విలన్ ఉండడం అనేది నాకు బాగా నచ్చింది. కానీ దాన్ని ప్రేక్షకులు సరిగ్గా రిసీవ్ చేసుకోలేకపోయారు. ఇలా ఫ్లాప్స్ గురించి ఎవ్వరినీ నిందించలేం.

ఫ్లాప్స్ వచ్చినా సినిమాలు ఆపడం లేదేంటి?

వినాయక్ సినిమా నాతో అనగానే.. జోక్ అనుకున్నా. ఫ్లాప్స్‌లో ఉండగా పెద్ద నిర్మాతలు వచ్చి నాతో తీయడం మాటల్లో చెప్పలేను. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ చెబుతూ ఉండే విషయం గుర్తుకు వచ్చేది. మనకు వచ్చిన అవకాశాన్ని ఎంత బాగా ఉపయోగించుకుంటామనేది చూడాలి తప్పిదే.... ఇలా వస్తుందేమో. ఇలా రావాలని ఎదురుచూడకూడదు.. అని. అలా వచ్చిన అవకాశాల్ని చేసుకుంటూ పోతున్నా. ఫలితం మన చేతుల్లో లేదు.

యాక్షన్, కమర్షియల్ చట్రం నుండి బయటకు రాలేకపోతున్నారెందుకు?

నాకు భిన్నమైన సబ్జెక్ట్స్ చేయాలనే ఉంది. కానీ నా దగ్గరకు వచ్చే వాళ్ళు కమర్షియల్ సినిమాలతోనే వస్తున్నారు. అందుకే అవే చేస్తున్నాను. అవకాశం వస్తే తప్పకుండా భిన్నమైన సినిమాలు చేస్తాను.

అగ్రి ప్లస్



లాభదాయకమైన కార్శి చెరకు

చెరకు తోటలు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి : విత్తనం నాటి పెంచితే అవి మొక్క తోటలు. రెండు : ఒకసారి నరికిన తర్వాత - మోడు నుంచి మొలకెత్తే తోటల్ని కార్శి (పిలక) తోటలు. మొక్కతోటల ద్వారానే అధిక దిగుబడి సాధించవచ్చని, అధిక లాభం చేకూరుతుందని కొందరి అభిప్రాయం. మొక్కతోటలు ఎక్కువ దిగుబడినివ్వటం నిజమేకానీ, ఎక్కువ లాభం మాత్రం ఇవ్వలేవు. కార్శి తోటలను కొంచెం శ్రద్ధగా పెంచితే మంచి లాభాలను అందిస్తాయి. ఖర్చునూ గణనీయంగా తగ్గిస్తాయి. కనుక కార్శి చెరకుసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ కథనంలో చూద్దాం.

చెరకు సాగులో ప్రధానమైన ఖర్చు విత్తనం. ఒక ఎకరంలో చెరకు నాటడానికి దుక్కి, విత్తనం, నాట్లు, కూలీ... మొత్తంగా 20 నుంచి 25 వేలు ఖర్చవుతుంది. అయితే కార్శి తోటలకు ఈ ఖర్చు, శ్రమ ఉండదు. కాబట్టి నాలుగైదు టన్నులు దిగుబడి తగ్గినా కార్శి తోటలతో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఏ రాష్ట్రంలోని చెరకు విస్తీర్ణాన్ని పరిశీలించినా, ఏ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకును పరిగణనలోకి తీసుకున్నా, మొక్కతోటల విస్తీర్ణం కన్నా, కార్శి తోటల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. 60 నుంచి 70 శాతం కార్శి తోటలున్న ఫ్యాక్టరీలు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఇందుకు కారణం ప్రారంభదశలో తక్కువ పెట్టుబడే. ఒకటికి మించి కార్శి తోటలు పెంచే రైతులు మన ప్రాంతంలో కూడా ఉన్నారు. ఉయ్యూరు, చాగల్లు, చోడవరం, సామర్లకోట ఫ్యాక్టరీల పరిధిలో మూడు, నాల్గు కార్శీలు పెంచుతున్న రైతులున్నారు. కోయంబత్తూరు సమీపంలో ఒక రైతు 18 కార్శీల నుంచి దిగుబడి తీశారు. కర్నాటకలో ఒక రైతు ఏకంగా 34 కార్శీలు పండించిన ఉదాహరణలూ ఉన్నాయి. కార్శి తోటల పెంపకంలో వారు శ్రద్ధ చూపించడంవల్ల మొక్క తోటలతో సమానంగా దిగుబడులు సాధించి, ఖర్చును తగ్గించుకొని, మంచి లాభాలు పొందుతున్నారు.

కార్శి పెంపకంలో జాగ్రత్తలు

చెరకు నాటడం పూర్తయ్యాక పొలంలో ఎండిపోయిన ఆకు గుట్టలు గుట్టలుగా ఉంటుంది. ఈ ఆకును రైతులు తగులబెట్టడం ఆనవాయితీ. ఆకును తగులబెట్టే ముందు రైతు కొంచెం శ్రద్ధ చూపాలి. గుట్టలుగా ఉన్న ఆకును పొలంలో పలచగా పరచాలి. అలా పరచడం వల్ల రెండు ఉపయోగాలున్నాయి. ఎండాకు గుట్టలుగా ఉన్నప్పుడు తగులబెడితే, అధిక వేడికి గుట్టల కింద ఉన్న చెరకు మొదళ్లు (భీజాలు) మాడిపోతాయి. అలా జరిగినప్పుడు పిలకలు రావడం ఆలశ్యమవుతుంది.

ఫలితంగా పొలంలో మొక్కలు, ఆ తర్వాత గడల సంఖ్య తగ్గుతుంది. అందువల్ల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. అలాంటి నష్టాలు వాటిల్లకుండా ఉండాలంటే ఎండాకును పలచగా పరచటం అవసరం. మొక్క తోట పెంచే సమయంలో కొన్ని పురుగులు చెరకు ఆకుపై ఉంటాయి. అవి ముదురు చెరకుకు నష్టం కలిగించలేవు. కానీ పిలక (లేత) మొక్కలను నష్టపరుస్తాయి. నరికే సమయంలో కొన్నిరకాల పురుగులు భూమిపై పడే అవకాశం ఉంది. నేలపై పూర్తిగా ఆకును పరిచినప్పుడు, భూమిపై ఉన్న పురుగులూ ఆకుతో పాటు కాలిపోతాయి. కార్శి పైరుకు పురుగుల బెడద తగ్గుతుంది.

మోడు చెక్కించడం అవసరం

ఎండాకు తగలబెట్టిన తర్వాత మోడు చెక్కించడం కూడా అవసరమే. కూలీలు చెరకును అజాగ్రత్తగా నరికినప్పుడు ఒక్కోసారి రెండు, మూడు కణుపులూ వదిలేస్తారు. నీరు పెట్టినప్పుడు ఆ కణుపుల వద్ద ఉన్న కన్నులు (మొలక భాగాలు) త్వరగా పెరుగుదలకు వచ్చేస్తాయి. అలా



ముందుగా రావటం మంచిది కాదు. పిలకలన్నీ ఒకేసారి, సమానంగా పెరగాలి. ముందుగా భూమి పైభాగంలో మొలకెత్తిన వాటికి వేళ్లు భూమిలోకి చొచ్చుకుపోయే అవకాశం ఉండదు. క్రమంగా చనిపోతుంటాయి

ఒకవేళ అలాంటివి కొన్ని బతికినా, తొలకరి గాలులకు పడిపోయి నష్టం కలిగిస్తాయి. అలాకాకుండా ఉండాలంటే తప్పకుండా మోడు చెక్కించాలి. పదునైన పారలను మోడు చెక్కటానికి ఉపయోగించాలి. మోడు చెక్కిన తర్వాత మలాథియన్ ద్రావణం భూమిపై పోయడం అవసరం. మలాథియన్ మందు కలిపిన నీటిని రోజ్‌క్యాన్‌లో పోసుకుని, చెరకు మొదళ్ల వరసలో పోయడం అవసరం. అలా చేయటంవల్ల చెరకు మొదళ్ల వద్ద భూమిలో ఉన్న పురుగులు చనిపోతాయి. రోజ్‌క్యాన్‌ల ద్వారా మలాథియన్ ద్రావణం పోయటం చాలా సులభం. మోడు చెక్కించిన రెండు మూడు రోజుల తర్వాత పొలానికి నీరు పారించాలి. అలా నీరు పారించడానికి ముందే పొలంలో ఖాళీలను గుర్తించాలి. ఆ ప్రదేశంలో కొంచెం గుంతలు చేసి ఉంచి, వాటిలో విత్తనం ముచ్చెలు వేసి కప్పేయాలి. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పుడు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. ఈ ఖాళీలు నింపడానికి చెరకు ముచ్చెల కన్నా, పెంచిన నారు శ్రేయస్కరం.

సమానంగా పెరగాలి

చెరకు నరకటం ప్రారంభించినప్పుడే కొన్ని గడలను ఒంటి కన్ను ముచ్చెలుగా నరికి, మెత్తటి మట్టిలో పెట్టి, నీళ్ల చిలకరిస్తుండాలి. తోటలు నరకటం పూర్తయి, ఎండాకును తగలబెట్టి మోడును చెక్కించే సమయానికి ఆ ఒంటికన్ను ముచ్చెల నుంచి మొలకుల వచ్చి, పెరుగుతుంటాయి. మొదటి దఫా నీరు పారించినప్పుడు, ముందుగానే గుర్తులు పెట్టుకున్న గుంతల్లో ఈ మొక్కలు పెట్టడం చాలా సులువుగా ఉంటుంది. ఒంటి కన్ను ముచ్చెలను మట్టిలో కాకుండా ఫాలిథిన్ కవర్లలో ఉంచి కూడా నారు పెంచవచ్చు. ఇలాకాకుండా నీరు పెట్టినప్పుడు ముచ్చెలను సరాసరి గుంతల్లో ఉంచి, మట్టి కప్పుతారు. అది సరైన పద్ధతి కాదు.



చెరకు మొలక రావడానికి 10 నుంచి 15 రోజులు పడుతుంది. అప్పటికి కార్శి రెండు మూడాకులు తొడుగుతుంది. అలా పెరిగే మొక్కలతో సమానంగా ముచ్చెల నుంచి వచ్చి మొక్కల పెరుగుదల వాటితో సమానంగా పెరగటం సాధ్యంకాదు. కాబట్టి నారు పెంచుకొని, ఖాళీలు నింపటం మంచిది.

ఈ విధమైన జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మొక్క తోటలతో సమానంగా కార్శి తోటలూ మంచి దిగుబడినిస్తాయి. కార్శికి పెట్టుబడి తక్కువ కాబట్టి మొక్కతోటకన్నా పిలక తోట నుంచి ఎక్కువ లాభం పొందటానికి అవకాశాలున్నాయి.

దాసరి ఆళ్వారుస్వామి
కుందేరు, కృష్ణాజిల్లా.
ఫోన్ నెం: 9393818199

వరిలో అగ్గితెగులు

ప్రస్తుతం దాళ్వా వరిసాగు నాట్లు వేసే దశ నుంచి పిలకలు పెట్టే దశ వరకూ ఉంటుంది. కనుక సస్యరక్షణలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించవలసిన అవసరం ఉంది. దీనికి సంబంధించిన వివరాలతో పాటు వరి మాగాణుల్లో వేసిన అపరాలలో వైరస్ తెగుళ్లను






నివారించడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె. రాజారెడ్డి ఇస్తున్న సూచనలు :

- ✧ వరి నాటే ముందు ప్రధానపొలం చుట్టూ ఉన్న గట్లపై పెరిగిన కలుపును పూర్తిగా తొలగించడంవల్ల దానిపై ఆవాసం ఉండే శిలీంధ్రాలు తొలగిపోతాయి.
- ✧ నాటిన తరువాత పంటపై అగ్గితెగులు లక్షణాలు కనిపిస్తే ట్రై సైక్లోజోల్ 75 శాతం మందును 0.6 గ్రా. లేదా ఐసోప్రొథయొలిన్ 40 శాతం మందును 1.5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ✧ పైరుపై అగ్గితెగులు లక్షణాలు కనిపించినపుడు నత్రజని ఎరువును సిఫారసు మేరకు మాత్రమే వాడాలి. అదీ కొద్ది మోతాదులో వేయడం మంచిది.
- ✧ పొలంలో మురుగునీరు ఎక్కువకాలం నిల్వ ఉండకుండా చూడాలి. దీనివల్ల కాండం కుళ్ళు తెగులు వ్యాపించకుండా నివారించుకోవచ్చు.
- ✧ పొలంలో పెరిగిన కలుపును సకాలంలో తొలగించడం వల్ల తెగులు వ్యాప్తిని కొంతవరకు నివారించుకోవచ్చు.

వరి మాగాణుల్లో అపరాల సాగు

- ✧ సాధారణంగా కొరినోస్పొరా ఆకుమచ్చ తెగులు, బూడిద, తుప్పు తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టడానికి, పైరు 30-35 రోజుల దశలో, లీటరు నీటికి 2 మి.లీ. హెక్సాకొనజోల్, 50-55 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ✧ వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. పల్లాకు తెగులు, ఆకుముడత తెగులు, సీతాఫలం తెగులు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి మొక్కలను పీకేసి, తెగులు వ్యాప్తికి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి.



డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.


ఈ వారం **విజ్ఞాన వాణి**

చెరకులో కలుపు మందు

చెరకు నాటుకున్న మొదటి దశలో కలుపు ఎక్కువ అయితే మొక్క పెరుగుదలకు నష్టం వాటిల్లుతుంది. అందుకే కలుపును నాశనం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇస్తున్న సూచనలను పాటించాలి.

➤ మొక్కతోట నాటిన మూడు రోజులలోపు కలుపు నాశనమందు ఎకరాకు అట్రాజన్' రెండు కిలోలు లేదా మెట్రిబ్యుజిన్ 600 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి భూమిపై పిచికారీ చేయాలి. తర్వాత ఎకరానికి 1.3 టన్నుల చెరకు చెత్తను, నాటిన 3 నుంచి 30 రోజుల మధ్య కప్పాలి. దీని వలన నేలలోని తేమ సంరక్షింపబడటమేకాకుండా కలుపు, పీకపురుగు ఉధృతి కూడా తగ్గుతుంది. క్రమేణ చెరకు చెత్త చివికి భూమికి సేంద్రియ పదార్థం సమకూరుతుంది.

➤ చెరకు నాటిన మూడు రోజులలోపు కలుపు మందు పిచికారి చేయలేని పరిస్థితుల్లో ఎకరాకు "మెట్రిబ్యుజిన్" 400 గ్రా. + 2,4-డి సోడియం సాల్ట్ 800 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 20-25 రోజులకు పిచికారీ చేయాలి. దీనివలన పంటకు హాని లేకుండా అన్నిరకాల కలుపు మొక్కలు నివారింపబడతాయి.



మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత నంబరుకూ కాల్ చేయవచ్చు-1800 425 0430

చిన్నారి



పొడుపు కథ

రంగు రంగుల పక్షి
శాకాహార భక్షి
వంకర ముక్కుంటది
జోస్యం చెబుతుందది?

జవాబు : రామచిలుక

జోక్ :

టీచర్ : ఏంటిరా రింకూ, స్కూలుకు ఆవును తీసుకొచ్చావు?
రింకు : మీరు నిన్న చెప్పారు కదా టీచర్.. ఆవు మీద వ్యాసం రాసి తీసుకురమ్మని.. అందుకే తీసుకొచ్చా..!

రంగులు వేయండి!




పిల్లలూ..! పక్కనున్న బొమ్మకి రంగులు వేయండి!

ముత్యం లాంటి దేశం

పిల్లలూ..! మీరెప్పుడైనా అండోరా దేశం గురించి విన్నారా? ఇది యూరప్‌లోని ఒక చిన్న దేశం. ఈ దేశం మొదట ఫ్రాన్స్, స్పెయిన్ ఆధీనంలో ఉండేది. ఆ దేశాల నుంచి స్వాతంత్ర్యాన్ని పొంది చివరకు నీలం, ఎరుపు రంగులను ఫ్రాన్స్ నుంచి, పసుపు, ఎరుపు రంగులను స్పెయిన్ నుంచి తీసుకుని జెండాను తయారుచేసుకున్నారు. యూరప్ మొత్తంలో అండోరా లా వెల్లా ఎత్తయిన రాజధాని. ఇది సముద్రమట్టానికి 3,356 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ దేశంలో వ్యవసాయానికి ఉపయోగించే భూమి కేవలం రెండు శాతం. అందుకే వీరు ఆహారాన్ని ఎక్కువగా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంటారు. అంతేకాదు పిల్లలూ ఈ దేశంలో అక్షరాస్యత రేటు ఎక్కువే. ఇక్కడ విమానాశ్రయాలు, రైల్వే లైన్లు ఉండవు. వీరు ఎక్కడికి వెళ్లాలన్నా రోడ్డు మార్గాన్నే ఎక్కువగా వాడుతుంటారు.



ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం చెప్పమంటారా? ఈ దేశంలో దొంగలు పడటం ఉండదట! జేబుదొంగలు అస్సలు కనిపించరట!! అండోరా లా వెల్లా జనాభా 85,470. దీని విస్తీర్ణం 467.63 చదరపు కిలోమీటర్లు. కాటలాన్ ఈ దేశ అధికారిక భాష. అంతేకాదు అక్కడి ప్రజలు ఫ్రెంచ్ కూడా ఎక్కువగానే మాట్లాడుతుంటారు. అండోరా అనే పదం అరబిక్ భాషలోని అల్‌దురా అనే పదం నుంచి వచ్చిందట. దీనర్థం 'ముత్యం' అని. ఇక్కడ కుటుంబ యజమానిగా ఉండే పురుషుల దగ్గర ఆత్మరక్షణ కోసం చట్ట ప్రకారం తుపాకీ ఉండొచ్చు. ★





నేను గీసిన బొమ్మ





ఎస్. నిహార్
యుకెజి,
వి.పి.ఎస్ పబ్లిక్ స్కూల్,
విజయవాడ.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

బంద్‌తో రాష్ట్రం వెలవెల



నిర్మానుష్యమైన గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ రోడ్డు



బోసిపోయిన విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్



రాజమహేంద్రవరం మెయిన్ బజార్‌లోని షాపులు మూత



బంద్‌తో మూతపడిన విజయవాడ లెనిన్ సెంటర్‌లోని బుక్‌షాపులు



తిరుపతిలోని గాంధీ రోడ్డు ఇలా..



జనసంచారం లేక కర్నూలు కొండారెడ్డి బురుజు ఏరియా



నిర్మానుష్యంగా మారిన విశాఖ రోడ్లు

SPORTS ఆటలు



ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్
క్వార్టర్స్‌కు భారత జట్లు

అలోర్ సెటార్ (మలేసియా) : పి.వి. సింధూ సారథ్యంలోని బ్యాడ్మింటన్ మహిళా జట్టు క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. గురు వారం జపాన్‌తో తలపడిన భారతజట్టు 1-4 తేడాతో ఓటమిపాలైంది. అయినా తొలిమ్యాచ్ లో హాంకాంగ్‌పై 3-2 తేడాతో గెలుపొంద డంతో క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. తొలిమ్యాచ్‌లో సింధూ జపాన్‌కు చెందిన ప్రపంచ నెంబర్-2 సీడ్ యమగుచితో తలప డిన కేవలం 36 నిమిషాల్లోనే విజయం సాధిం చింది. 21-19, 21-15 పాయింట్ల తేడాతో గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని సంపాదిం చింది. అనంతరం జరిగిన మరో సింగిల్స్‌లో శ్రీకృష్ణప్రియ 12-21, 10-21 తేడాతో సయాక సాటో చేతిలో పరాజయం పాలైంది. అనంతరం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలుపొందలేదు. చివరకు 1-4 తేడాతో భారత్ జపాన్ చేతిలో ఓటమి చవిచూసింది. జపాన్ చేతిలో ఓడినప్పటికీ భారత్‌కు క్వార్టర్‌ఫైనల్స్ బెర్త్ దక్కింది. ఎందుకంటే అంతకుముందు భారత్ షట్లర్లు హాంకాంగ్‌పై విజయం సాధించి గ్రూప్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. దీంతో గ్రూప్-డబ్ల్యూ నుంచి జపాన్‌తో పాటు భారత్ క్వార్టర్స్ చేరుకుంది.

పురుషుల జట్టు ఓటమి

గ్రూప్-డిలో ఇండోనేషియాతో తలపడిన భారత షట్లర్లు ఓటమిపాలయ్యారు. గురువారం ఇండోనేషియా జట్టుతో తలపడి 3-2 తేడాతో ఓటమిపాలయ్యారు. సాయిప్రణీత్ 21-18, 21-19 పాయింట్ల తేడాతో ఆంటోనీ (ఇండోనేషియా)పై... రాంకీరెడ్డి-చిరాజ్‌శెట్టిల జోడీ 18-21, 21-18, 24-22తో ఇండోనేషియా జోడీలపై మాత్రమే గెలిచారు. శ్రీకాంత్ ఇండోనేషియాకు చెందిన క్రిష్టి చేతిలో 17-21, 17-21 పాయింట్ల తేడాతో ఓటమిపాలయ్యాడు. మిగతా రెండు మ్యాచ్‌లలోనూ ఓటమిపాల వ్వడంతో 2-3తో ఇండోనేషియాజట్టు విజయం సాధించి గ్రూప్-డిలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఓడినప్పటికీ భారతజట్టు గ్రూప్-డి నుండి రెండోస్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించారు.

నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్స్

(పురుషులు)	(మహిళలు)
భారత్ × చైనా	జపాన్ × చైనీస్ తైపే
మలేషియా × హాంకాంగ్	భారత్ × ఇండోనేషియా
థాయ్‌లాండ్ × దక్షిణకొరియా	చైనా × థాయ్‌లాండ్
జపాన్ × ఇండోనేషియా	మలేషియా× దక్షిణకొరియా

నేటి నుంచి
వింటర్ ఒలింపిక్స్



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : శుక్రవారం నుండి దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్ కౌంటీలో వింటర్ ఒలింపిక్స్ అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. ఈసారి ఒలిపింక్స్‌ను ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలు కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. అమెరికాతో కయ్యానికి కాలు దువ్వుతున్న ఉత్తర కొరియా క్రీడాకారులు... అమెరికా అథ్లెట్లు కూడా ఈ ఒలిపింక్స్‌లో పాల్గొనడం గమనార్హం. ఈ మ్యాచ్‌లన్నీ మంచులో పర్వతాల్లో జరగ నుండడంతోపాటు అత్యంత ప్రమాదకరమైనవి కూడా. ముఖ్యంగా స్కై రేసర్లకు అత్యంత ప్రమాదకరమైన క్రీడ ఇది. ఇంతకుముందు ఇలా ఒలింపిక్స్‌లో పాల్గొని ఎంతోమంది క్రీడాకారులు గాయాల పాలైన సందర్భాలు, మృతిచెందిన సందర్భాలు కూడా లేకపోలేదు. ఈసారి వింటర్ ఒలింపిక్స్‌లో 92 దేశాల నుండి 2,952మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. మొత్తం 15 క్రీడాంశాల్లో 102 ఈవెంట్‌లలో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఫిబ్రవరి 9 నుండి 25వ తేదీవరకు దట్టమైన మంచుపర్వతాల్లో ఈ క్రీడలు జరగను న్నాయి. ఈసారి ఒలింపిక్స్ నుండి 1200 మంది గార్డ్‌లను తప్పించారు. గార్డుల్లో కొందరు అకస్మాత్తుగా విరేచనాలు, వాంతులు చేసుకోవడంతో గార్డులందరినీ తప్పించి వారిస్థానంలో 900 మంది సైనికులను దక్షిణాఫ్రికా ప్రభుత్వం నియమించింది. భారతదేశం తరపునుండి శివ కేషన్ ల్యూజ్, క్రాస్ కంట్రీ స్కియింగ్ రెండు ఈవెంట్‌లలో పాల్గొంటు న్నాడు. ఈ రెండు ఈవెంట్ల తొలిమ్యాచ్‌లు శుక్రవారం సాయంత్రం జరగనున్నాయి.

ఐదుసార్లు ఛాంపియన్

ఐదుసార్లు వింటర్ ఒలిపిక్స్‌లో భారతదేశం తరపున పాల్గొన్న ఏకైక అథ్లెట్ శివ కేషన్. ఈ ఒలిపింక్స్‌లో లూజ్, క్రాస్‌కంట్రీ స్కీయింగ్ ఈవెంట్‌లో గంటకు 134.3 కిలోమీటర్ల అత్యధిక రికార్డ్. ఆసియాకప్, ఆసియన్ ఛాంపియన్‌షిప్ లలో నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించాడు.

వింటర్ ఒలింపిక్స్ జరిగే ఈవెంట్లు

1. ఆల్పైన్ స్కీయింగ్,
2. షాట్‌ట్రాక్ స్పీడ్ స్కేటింగ్
3. క్రాస్‌కంట్రీ స్కీయింగ్
4. ఫ్రీస్టయిల్ స్కీయింగ్,
5. నార్డింగ్ కంబైన్డ్
6. స్కీ జంపింగ్,
7. స్నో బోర్డ్
8. కర్లింగ్
9. ఫిగర్ స్కేటింగ్
10. ఐస్ హాకీ
11. బయథ్లాన్
12. స్పీడ్ స్కటింగ్
13. బాబ్స్లే
14. లూజ్,
15. స్కెల్టన్



మున్సిపల్ కమిషనర్ జె.నివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఫన్‌టైమ్స్ సెక్రటరీ వేమూరి సాంబశివరావు

అట్టహాసంగా రాష్ట్రమాస్టర్స్
బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్

ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల పోటీలు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికీ సహజ విజయ లక్ష్యం అవసరమనీ, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలనీ అన్నారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నమెంట్ ఈ నెల 11 వరకు జరగనుంది.

బీసీసీఐకి సచిన్ లేఖ



ముంబయి: భారత క్రికెట్ లెజెండ్, భారతరత్న సచిన్ టెండూల్కర్ బీసీసీఐకి లేఖ రాశాడు. ఇటీవల అంధుల ప్రపంచకప్ గెలిచిన భారత జట్టును బీసీసీఐ గుర్తించాలని, బోర్డ్ పెన్షన్ పథకం క్రిందకు అంధుల క్రికెట్ ఆటగాళ్ళను తీసుకురావాలని కోరాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన అంధుల ప్రపంచకప్ టోర్నీలో భారత ఆటగాళ్ల సత్తా చాటిన విషయం తెలిసిందే. ఫైనల్లో పాక్‌ను చిత్తు చేసి భారత్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అనంతరం భారత్ చేరుకున్న ఆటగాళ్లను అటు ప్రభుత్వం, ఇటు బీసీసీఐ గుర్తించిందే లేదు. ప్రపంచకప్ గెలిచి వచ్చిన ఆటగాళ్లకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని, ఉద్యోగాలు ఇప్పించాలని అప్పుడే పలువురు ఆటగాళ్ల కోరారు. అలాగే సీఏబీఐను బీసీసీఐ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

సెహ్వాగ్ జట్టు ఓటమి

స్విట్జర్లాండ్ : సెహ్వాగ్ సారథ్యంలోని (ప్యాలెస్ డైమండ్స్), అఫ్రిధి నాయకత్వంలోని (రాయల్స్) జట్ల మధ్య జరిగిన తొలి ఐస్ క్రికెట్ మ్యాచ్‌లో సెహ్వాగ్ జట్టు ఓటమిపాలైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన డైమండ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. సెహ్వాగ్ అత్యధికంగా 62 పరుగులు చేశాడు. అనంతరం ఆ లక్ష్యాన్ని రాయల్స్ జట్టు 15.2 ఓవర్లలోనే సాధించింది. ఆ జట్టులో ఓవన్ షా 34 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 74 పరుగులు చేసి గెలిపించడమే కాకుండా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కూడా గెలుచుకున్నాడు. రెండోది, చివరిమ్యాచ్ శుక్రవారం జరగనుంది.

శ్రీలంక 222 ఆలౌట్

ఢాకా : బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో లంక జట్టు తొలిరోజే ఆలౌట్ అయ్యింది. గురువారం టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 65.3 ఓవర్లలో 222 పరుగులు మాత్రమే చేసింది. మెండిస్, ఎ.సిల్వాలు అర్ధసెంచరీలతో రాణించారు. రజాక్, ఇస్లామ్‌లకు నాలుగేసి వికెట్లు చొప్పున సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 56 పరుగులకే నాలుగు వికెట్లను చేజార్చుకుంది. ఇరుజట్ల మధ్య జరిగిన తొలిటెస్ట్ డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68